ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి


# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

బుధవారం 27 మే 2026
సంపుటి: 28 సంచిక: 58
Wednesday 27 May 2026
Vol.No 28 Issue No .58
హైదరాబాద్
Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

- యుద్ధ ప్రభావంతోనూ సరఫరాలో అంతరాయం
- రైతులు పంట వ్యర్థాలను తగులబెట్టవద్దు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



హైదరాబాద్,మే26 : యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు ఆరోపించారు. యుద్ధ మిగతా2లో..

## ఎబోలాపై ఆందోళన అవసరం లేదు


- అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్,మే26 : ఎబోలా వైరస్‌పై తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన మిగతా2లో..

## దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు

- తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కేవలం నలుగురే
- పోలీసులకు లొంగిపోయిన నరహరి, ధనమ్మ జంటకు చెక్కులు అందచేత
- గణపతి తదితరులు కూడా వెంటనే లొంగిపోవాలి
- డిజిపి సివి ఆనంద్ పిలుపు



హైదరాబాద్,మే26 : మావోయిస్టు పార్టీలో నాలుగున్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ మిగతా2లో..



# పంచాయతీ సిబ్బందికి తీపి కబురు చెప్పిన రేవంత్ సర్కారు

- రాష్ట్రంలోని 50 వేల మంది పంచాయతీ సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు
- జీతాల కోసం ప్రతినెలా రూ. 50 కోట్ల ప్రత్యేక నిధుల విడుదల
- గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తూ కీలక నిర్ణయం
- పోస్టల్ విధానం రద్దు.. ఇకపై పెన్షన్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ
- అర్హులైన వారికి కొత్త పెన్షన్ల మంజూరుకు మొదటి ప్రాధాన్యత

హైదరాబాద్,మే26 :రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి జీతాలు అందినట్లే, క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బందికీ వేతనాలు అందాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా, ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నెల మొదటి రోజే జీతాలు అందేలా చూడాలని మిగతా2లో..



## చొరబాటు దారులూ పారిపోండి

- వెళ్లగొట్టక ముందే పారిపోతే మంచిది
- జైల్లో పెట్టి తిండి పెట్టేది లేదు
- బంగ్లాదేశ్ వలసదారులకు సిఎం సువేందు హెచ్చరిక
- సరిహద్దుల వద్దకు చేరుకుంటున్న అక్రమ వలసదారులు

కోల్‌కతా,మే26 : పశ్చిమబెంగాల్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ అక్రమవలసదారులపై చర్యలను సువేందు అధికారి ప్రభుత్వం ముమ్మరం చేసింది. అక్రమవలసదారులను వారి స్వదేశానికి పంపేందుకు చర్యలు తీసుకుంటోంది. మిగతా2లో..

## ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు


భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం



హైదరాబాద్,మే26 : రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అత్యంత ఘనంగా మిగతా2లో..

## దేశంలో అసహజ జనాభా మార్పు

- ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు
- హోంమంత్రి అమిత్ షా వెల్లడి



న్యూఢిల్లీ,మే26 : అక్రమ వలసలు, ఇతర కారణాలతో దేశంలో చోటుచేసుకుంటున్న 'అసహజ జనాభా మార్పు'పై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ 2025 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ఈ మిగతా2లో..

## మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

- సంపద సృష్టించే శక్తిగా మహిళలకు ప్రోత్సాహం
- సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించిన సీతక్క



హైదరాబాద్,మే 26 : మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మిగతా2లో..

## మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్ఎంసి విభజన

- నగరంలో మంచినీటి సమస్యను పట్టించుకోని ప్రభుత్వం
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపణ



హైదరాబాద్,మే 26 : కేసీఆర్ హయాంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు కూడా హైదరాబాద్‌లోని పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. మజ్లిస్ ఒత్తిడితో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని రామచందర్‌రావు మిగతా2లో..

## తెలంగాణలో అవినీతి రాజ్యం

- అడ్డంగా దోచుకుంటున్న కాంగ్రెస్
- శంషాబాద్‌లో 180 ఎకరాలు హాంఫట్
- సింగరేణిలో కోట్ల రూపాయాల బొగ్గు మాయం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు సంచలన ఆరోపణలు

హైదరాబాద్,మే26 : తెలంగాణలో అవినీతి రాజ్యం నడుస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. భూములు ఆక్రమణలు, రెవెన్యూలో వేలకోట్ల స్కామ్‌లు, సింగరేణిలో బొగ్గు స్కకమాలు జరుగుతున్నాయని అన్నారు. అడ్డంగా దోచుకుంటున్నారని కాంగ్రెస్‌పై ఆయన విరుచుకు పడ్డారు. శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో మిగతా2లో..



## శిరాజ్‌సింగ్ అప్నాపన్ పుస్తకావిష్కరణ

- ఆవిష్కరించిన మాజీ ప్రధాని దేవెగౌడ
- వెంకయ్య తదితర ప్రముఖుల హాజరు



మిగతా2లో..

## రాష్ట్రంలో 'ఫార్మ్ టు హోమ్' విధానం

- రైతుల నుంచి నేరుగా ప్రజలకు ఉత్పత్తులు
- అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు



అమరావతి,మే26 : రాష్ట్రంలో 'ఫార్మ్ టు హోమ్' విధానాన్ని అమలు చేయాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరేలా కొత్త మిగతా2లో..

# సిబిఐ ఎంక్వాయిరీ కి కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- హడలిపోతున్న గ్రానైట్ వ్యాపారులు
- బిఆర్ఎస్ నేతలే టార్గెట్ గా విచారణ
- వందల కోట్ల గ్రానైట్ అక్రమ రవాణా పై బిగుస్తున్న ఉచ్చు..
- ఉమ్మడి కరీంనగర్ లో హాట్ టాపిక్ గా మారిన గ్రానైట్ వ్యవహారం



**కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో చీఫ్) మే 26 :** అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతి అయి కరీంనగర్ కే వన్నె తెచ్చిన గ్రానైట్ వ్యవహారంపై దర్యాప్తు జరుగుతుండడం సంచలనంగా మారింది. గ్రానైట్ అక్రమ రవాణాపై ఇప్పటికే ఈడీ, సీబీఐ ఎంట్రీ ఇవ్వగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మరో దర్యాప్తు సంస్థ జోక్యం చేసుకోనుంది. దీంతో అటు జాతీయ, ఇటు రాష్ట్ర దర్యాప్తు సంస్థలు గ్రానైట్ తవ్వకాలపై సమగ్రంగా విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కరీంనగర్ గ్రానైట్ క్వారీల నుండి చైనాకు ఎగుమతి అవుతున్న వ్యవహారంపై విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు దృష్టి సారించారు. కృష్ణపట్నం, విశాఖపట్నం తదితర ఓడ రేవుల నుండి సీనరేజ్ ట్యాక్స్ చెల్లించకుండా ఎగుమతి చేస్తున్నారని గుర్తించారు. ఆయా పోర్టులలో చైనాకు ఎగమతి



చేసేందుకు సిద్ధంగా ఉన్న గ్రానైట్ బ్లాకులను సమగ్రంగా పరిశీలించిన విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు సీనరేజ్ ట్యాక్స్ ఎగవేస్తున్నట్టుగా గుర్తించారు. ఇందుకు సంబంధించి 29-05-2013న అప్రైజల్ రిపోర్ట్ (C.NO.NO.268 /NR1/2013).30.60 ఆధారంగా 768889.937 క్యూబిక్ మీటర్ల గ్రానైట్ విదేశాలకు ఎగుమతి అయిందని, మిగతా2లో..

# సిబిఐ ఎంక్వయిరీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్



రూ.124,94,46,147 సీనరేజ్ చెల్లించాల్సి ఉందని గుర్తించారు. మైనింగ్ యాక్ట్ ప్రకారం వన్ ప్లస్ పై టైం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని ఇందుకు రూ. 749,66,76,882 వసూలు చేయాలని ఆ రిపోర్టులో పేర్కొన్నారు. 8రవాణా ఏజెన్సీల ద్వారా కరీంనగర్ సమీపంలోని వివిధ క్వారీల నుండి గ్రానైట్ బ్లాకులు తరలించారని విజిలెన్స్ అధికారులు ఆ నివేదికలో వివరించారు. పెనాల్టీలో మినహాయింపు ఇవ్వాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి 6665/=1/2016 మెమో విడుదల చేసిన ప్రభుత్వం వన్ ప్లస్ వన్ పెనాల్టీ కట్టాలని సూచించింది. అయితే ఈ మెమో నిబంధనలకు విరుద్దంగా పేర్కొనబడిందని మైనింగ్ చట్టాలను సవరలించాల్సి ఉంటుందని తెలుస్తోంది. కరీంనగర్ గ్రానైట్ అక్రమాలపై ప్రస్తుత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పలువురు కేంద్ర మంత్రులకు ఫిర్యాదు చేశారు. మరో వైపున ప్రధాన మంత్రి కార్యాలయానికి, ఈడీ, సిబిఐ, డిజిజిఐ విభాగాలకు కరీంనగర్ కు చెందిన అడ్వకేట్ భేతి మహేందర్ రెడ్డి, సింగిరెడ్డి భాస్కర్ రెడ్డిలు ఫిర్యాదులు చేశారు. ఈడీ కరీంనగర్ లోని పలు చోట్ల సోదాలు నిర్వహించి కొంత నగదును స్వాధీనం చేసుకున్నామని, బినామీ అకౌంట్లకు డబ్బులు వచ్చినట్టుగా గుర్తించామని, పనమా లీక్స్ లో పేరున్న లీ వెన్హువోకు చెందిన సంస్థల ద్వారా ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండానే అప్పు తీసుకున్నట్టుగా గుర్తించామని ఈడీ అధికారులు ఓ ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఆ తరువాత ఈడీ అధికారులు ఈ విషయంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మరోసారి ఫిర్యాదులు చేశారు. ఎగుమతులపై సమగ్ర విచారణ చేసే అవకాశాలు ఉన్నాయి. మైనింగ్ విభాగం నుండి ఎంత విస్తీర్ణంలో అనుమతులు తీసుకున్నారు, ఎంత మేర తవ్వకాలు జరిపారు, వెలికి తీసిన గ్రానైట్ పరిమాణం ఎంత, రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించిన సీనరేజ్ ఎంత, జీఎస్టీ తదితర అన్ని అంశాలపై సీబీసీఐ అధికారులు లోతుగా దర్యాప్తు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. గతంలో విజిలెన్స్ అధికారులు ఇచ్చిన నివేదికలను కూడా పరిశీలించి పర్యావరణ చట్టాలను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశాలు ఉన్నట్టుగా తెలుస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏయే అంశాలపై విచారణ చేయాలన్న ఆదేశాలకు అనుగుణంగా సీబీసీఐడీ అధికారులు దర్యాప్తు చేయనున్నారు. విజిలెన్స్ రిపోర్ట్ ఆధారంగా జాతీయ దర్యాప్తు సంస్థలు, గత పదేళ్లలో జరిగిన మైనింగ్ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని సీబీసీఐడీ రంగంలోకి దిగుతుండడం గమనార్హం.

## పంచాయతీ సిబ్బందికి తీపి కబురు చెప్పిన రేవంత్ సర్కారు

తేల్చిచెప్పారు. సిబ్బంది జీతాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయాలన్న నిబంధనను రద్దు చేయాలని ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కి సవరణలు చేసి, పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీకి బదులుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను పునరుద్ధరించడానికి దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. పెన్షన్ల పంపిణీ విధానంలోనూ మార్పులు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను ఉపయోగించి పెన్షన్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దేశంలో అసహజ జనాభా మార్పు

కమిటీకి రిటైర్డ్ జడ్జి ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని అమిత్‌షా తెలిపారు. కమిటీ మెంబర్‌గా హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఉంటారని చెప్పారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై కమిటీ సమగ్ర మూల్యాంకనం చేసి పరిష్కారం సూచిస్తుందని అమిత్‌షా తెలిపారు. జనాభా మార్పు సమస్య భారతదేశ సార్వభౌమత్వం, జాతీయ భద్రత, సామాజిక సమతుల్యత, ఆదివాసీ సమాజాల పరిరక్షణకు పెను సవాలుగా మారిందన్నారు. మత, సామాజిక వర్గాల స్థాయిలో జనాభా మార్పుల సరళని కమిటీ విశ్లేషిస్తుందని చెప్పారు.

## మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితి పెంచుతున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని పేర్కొన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. జూన్ 5వ తేదీన మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సులు అందజేస్తారని తెలిపారు. మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మధిరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వర్కింగ్ ఉమెన్స్ భద్రత తమ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గ్రామీణ మహిళలకు హైదరాబాద్‌లో సురక్షిత వసతి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. సఖి నివాస్‌లో 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని స్పష్టం చేశారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు.

## మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్ఎంసి విభజన

దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో డివిజన్ల ఏర్పాటుపై ఇప్పటికే అధికారులకు ఒక క్లారిటీ లేదని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపేరుతో ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని మతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. మంగళవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నీటి సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ప్రజాసమస్యలను కాంగ్రెస్ నేతలు పక్కదారి పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్‌కు మజ్లిస్ ముఖ్యం కానీ, హైదరాబాద్ ప్రజలు ముఖ్యం కాదని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో కాలుష్య నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని అన్నారు. భాగ్యనగరంలో చిన్న వాన పడితే.. నగరం మునిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని విశ్వనగరంగా బీజేపీ మాత్రమే మార్చగలదని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. తెలంగాణలో అవినీతి రహితమైన పరిపాలనను బీజేపీ మాత్రమే అందిస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు.

## రాష్ట్రంలో 'ఫార్మ్ టు హోమ్' విధానం

మార్కెటింగ్ వ్యూహాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు మధ్యవర్తుల ప్రభావం తగ్గుతుందని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయం, ఆక్వా, పశుసంవర్ధక రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి మండలం యడవోలు సమీపంలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు జులై నెలలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కడప జిల్లా పులివెందులలో నిర్మాణంలో ఉన్న ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసినట్లు సీఎం పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత పరిశీలనకు ఈ ల్యాబ్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఆక్వా రంగానికి ప్రోత్సాహంగా కొత్త ఆక్వా కనెక్షన్లకు విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. అలాగే మత్స్యకారుల సంక్షేమం కోసం 200 మెకనైజ్డ్ బోట్ల కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. రైతులు, మత్స్యకారులు, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## శివరాజ్‌సింగ్ అప్నాపన్ పుస్తకావిష్కరణ

న్యూఢిల్లీ,మే 26 : కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన 'అప్నాపన్: మై ఎక్స్‌పీరియన్స్ విత్ నరేంద్ర మోదీ' పుస్తకావిష్కరణ కార్యక్రమం దేశ రాజధాని ఢిల్లీలో ఘనంగా జరిగింది. అప్నాపన్ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశానికి అప్నాపన్ పుస్తకాన్ని శివరాజ్ సింగ్ అంకితం చేశారు. దేశాభివృద్ధికి నరేంద్ర మోదీ చేస్తున్న కృషి, ఆయనతో తన అనుభవాలను ఈ పుస్తకంలో కేంద్ర మంత్రి పొందుపరిచారు. పుస్తకావిష్కరణ అనంతరం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రైతు కుటుంబం నుంచి శివరాజ్ సింగ్ చౌహాన్ వచ్చారు. 17 ఏళ్ల పాటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. దేశంలో ప్రముఖ ముఖ్యమంత్రిగా శివరాజ్ సింగ్ పేరు తెచ్చుకున్నారు. ఉచిత పథకాలకు నేను వ్యతిరేకం. రాష్ట్రాలు తమ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజలకు విద్య, ఆరోగ్యం అందించాలి. మోదీ అంటే 'మేకింగ్ ఆఫ్ ఇండియా డెవలప్‌మెంట్' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్, పలువురు టీడీపీ ఎంపీలు, ఎన్డీఏ నేతలు హాజరయ్యారు.

**LOST PASSPORT**

I Shaik Waseem, Passport No.N4080837 was lost at Shapur Nagar, Jeedimetla on 24.04.26, whoever finds it, Please contact me as per the details in the Passport or sumit it at Passport office, Hyderabad.

## తెలంగాణలో అవినీతి రాజ్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు.

ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో - సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

## దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు

వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మీడియా ఎదుట నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టారు. మే 12వ తేదీన పోలీసుల ఎదుట నరహరి, ఆయన భార్య లొంగిపోయారు. వారిని ఈ రోజు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారిద్దరికి రూ. 25 లక్షలు, రూ.20 లక్షలు చొప్పున డీజీపీ చెక్కులు అందజేశారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 47 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో తెలంగాణాకి చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒకరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 15, జార్ఖండ్ 13, ఒడిశాకు చెందిన 15 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు. 2024 నుండి ఇప్పటి వరకు 822 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. మొత్తం 334 ఆయుధాలతో వీరంతా తెలంగాణా పోలీసులు ఎదుట లొంగిపోయారని చెప్పారు. ఇక తెలంగాణా పోలీసులు ముందు లొంగిపోయిన ఒడిశాకి చెందిన మావోయిస్టులను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులను త్వరలో వారి ప్రాంతాలకు వెళ్లి స్వయంగా కలుస్తానని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్షణరావు అలియాస్ గణపతితోపాటు జాడే రత్న బాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు లొంగిపోవాలని ఈ సందర్భంగా వారికి డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. మీరు లొంగిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌తోపాటు సదుపాయాలు కల్పిస్తామని అజ్ఞాతంతో ఉన్న మావోయిస్టులకు డీజీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఈ సందర్భంగా వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు నిరంతరాయంగా చేపట్టిన కూంబింగ్ కారణంగా భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించారు. ఇక ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు అందజేశారు. దీంతో దేశంలో దాదాపుగా మావోయిస్టు పార్టీ ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయింది.

## చొరబాటు దారులూ పారిపోండి

ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగానే బెంగాల్‌లోని అక్రమవలసదారుల పై సువేందు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో సీఎం బెంగాల్ సీఎం సువేందు అధికారి చొరబాటుదారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బెంగాల్ నుంచి వెళ్లగొట్టకముందే పారిపోవాలని సూచించారు. బంగ్లా ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లకపోతే.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతమున్న విదేశీయుల చట్టానికి లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 'ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే పారిపోండి' అంటూ ముఖ్యమంత్రి తాజాగా హెచ్చరించారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల అంశంపై మాట్లాడుతూ, కొత్త చట్టంతో కాకుండా ప్రస్తుతం ఉన్న విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించ డానికి సిద్ధంగా ఉన్నట్టు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని తెలిపారు. బంగ్లా అక్రమ చొరబాటుదారులను జైళ్లకు పంపవద్దని తాను పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. 'వారికి మనమెందుకు ఆతిథ్యం ఇవ్వాలని దేశ వనరులను మనం ఎందుకు దుర్వినియోగం చేయాలి. చొరబాటుదారులు ఏమైనా మన అల్లుళ్లా?' అని ప్రశ్నించారు. బంగ్లా పౌరులు స్వచ్ఛందంగా, శీఘ్రుంగా వెళ్లకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకింపూర్ సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్దఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ సమయంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని.. వారిని తిరిగి తీసుకువెళ్లడం అక్కడి ప్రభుత్వ బాధ్యత అని సువేందు పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైల్లో పెట్టొద్దని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. వారికి ఆశ్రయమిచ్చి, తిండి పెట్టడానికి వారేమైనా మన బంధువులా అని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం 'గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి' అనే నినాదంతో విదేశీయులను దేశం నుంచి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అక్రమంగా రాష్ట్రంలోకి చొరబడినట్లు గుర్తించిన వారికి, సరైన పత్రాలు లేని వారికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి నిర్బంధ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. మాల్దాలో తొలి నిర్బంధ కేంద్రాన్ని ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

నిర్వహించాలని కెబినెట్ సబ్ కమిటి అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం లో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జూన్ 2 నుండి 12 వరకు నిర్వాహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా-శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశర చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాల న్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలి. ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపులు) ఏర్పాటు చేయాలి. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేయనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు. మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ రావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్, తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

ప్రభావంతో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కేంద్రాన్ని పలుమార్లు కోరినా సరఫరా సమస్య కొనసాగుతోందన్నారు. యూరియా సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని చెప్పారు. ఇకపోతే రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు. అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అయినప్పటికీ పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా పంట అవశేషాల దహనాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంపై బీజేపీ చేస్తున్న విమర్శలు అన్యాయమని మంత్రి వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణంగా పడే వర్షాలు తగ్గే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. అందువల్ల రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతులకు భరోసా ఇచ్చే పంటగా మారుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

## ఎబోలాపై ఆందోళన అవసరం లేదు

అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎబోలా కేసులు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎబోలా లక్షణాలు ఉన్న వారిని గుర్తించలేదని పేర్కొన్నారు. ఎబోలాపై రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించిందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కట్టుదిట్టమైన స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. డీఆర్సీ, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్కానింగ్ చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 10 పడకల ఐసోలేషన్ వార్డు ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. డాక్టర్ సునీల్ కుమార్ నోడల్ అధికారిగా నియామించినట్లు చెప్పారు. అనుమానితుల సాంపుల్స్‌ను మహారాష్ట్ర పుణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపామన్నారు. ÷దేశాల నుంచి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకున్నారన్నారు. వారిలో ఎవరికీ ఎబోలా లక్షణాలు లేవని తెలిపారు. 58 మందిని 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో అధికారులు ఉంచారని గుర్తు చేశారు. 108 అంబులెన్స్‌లను 24 గంటలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. అన్ని ప్రభుత్వాసుపత్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. న్ఫెక్షన్ కంట్రోల్ ప్రోటోకాల్స్ కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులను ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు. ప్రజారోగ్య రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.

## పద్మ పురస్కారాలు2027కు నామినేషన్లు ఆహ్వానం.

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

కడప, మే 26 (విజన్ ఆంధ్ర) వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ప్రదానం చేసే "పద్మ పురస్కారాలు2027" కోసం నామినేషన్లు మరియు సిఫార్సులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో తెలిపారు. దేశ సేవ,సామాజిక సేవ, కళలు, సాహిత్యం, విద్య, వైద్యం, విజ్ఞానం & సాంకేతికత, క్రీడలు, ప్రజాసేవ తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గుర్తించి గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారాలను ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తుందని తెలిపారు.పద్మ విభూషణ్", "పద్మ భూషణ్", "పద్మశ్రీ" విభాగాల్లో ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. భారతీయ పౌరులందరూ ఈ పురస్కారాలకు అర్హులని, ఎవరైనా స్వయం నామినేషన్ చేసుకోవచ్చని, అలాగే ప్రతిభావంతులైన వ్యక్తుల పేర్లను ఇతరులు కూడా సిఫార్సు చేయవచ్చని పేర్కొన్నారు.మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంతాల్లో నిస్వార్థ సేవలు అందిస్తున్న సాధారణ వ్యక్తులు వంటి అట్టడుగు వర్గాల ప్రతిభావంతులను గుర్తించి నామినేట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు (డాక్టర్లు, శాస్త్రవేత్తలు మినహా), పీఎస్‌యూ ఉద్యోగులు ఈ పురస్కారాలకు అనర్హులని తెలిపారు.అభ్యర్థులు తమ నామినేషన్లు లేదా సిఫార్సులను అధికారిక "రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్" https://awards.gov.in ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుందని, దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 31-07-2026 అని వెల్లడించారు. ముందుగా పోర్టల్‌లో నమోదు చేసుకుని లాగిన్ ఐడీ సృష్టించుకోవాలని, అనంతరం "పద్మ అవార్డ్స్ 2027" విభాగంలో అవసరమైన వివరాలు నమోదు చేసి దరఖాస్తు సమర్పించాలని సూచించారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ మరియు వార్డు స్థాయి సంఘాలు ఈ ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారంపై విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన వ్యక్తులు దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దేశం కోసం నిస్వార్థంగా సేవ చేస్తున్న సామాన్యులను వెలుగులోకి తీసుకురావడమే ఈ పురస్కారాల ప్రధాన ఉద్దేశమని, అర్హులైన వ్యక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY


## సంపాదకీయం

# చాపకింద నీరులా ఎబోలా వ్యాప్తి !

ఎబోలా వణికిస్తోంది. కరోనా అంత వేగంగా కాకపోయినా మెల్లగా చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీంతో ఇప్పుడు ప్రపంచ దేశాలకు కొత్త తలనొప్పి ప్రారంభం అయ్యింది. ఆఫ్రికా దేశాల నుంచి ఇతర దేశాలకు విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే ప్రపంచ దేశాలు అప్రమత్తం అయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అన్ని దేశాలకు హెచ్చరికలు జారీచేసింది. కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాలకు పాకిన ఎబోలా వందల మందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం చాలా కష్టమని అంతర్జాతీయ ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనుషులకు సోకే నాలుగు రకాల ఎబోలా వైరస్‌ల్లో బుండిబుగ్యో ఒకటి. దీనిని ఉగాండాలోని ఓ పర్వత ప్రాంతంలో తొలిసారి కనుగొన్నారు. గతంలో రెండుసార్లు మాత్రమే వ్యాపించడంతో అధికారులు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఫలితంగా తాజాగా వ్యాపించిన ప్రదేశంలోని ల్యాబ్ పరీక్షల్లో దీనిని గుర్తించే సౌకర్యం లేకపోవడంతో.. గుర్తించేందుకు జాప్యం జరిగింది. మొదటి దీనిని గుర్తించేందుకు నమూనాను వేల మైళ్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ రీసెర్చి ల్యాబ్‌కు పంపాల్సి వచ్చింది. ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో తొలి ఎబోలా కేసు నమోదైంది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స తీసుకొని కొన్ని రోజుల్లోనే మరణించారు. ఆ తర్వాత ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇంటికి తరలించారు. దానిని తాకిన చాలా మందికి కొన్నాళ్లకే ఎబోలా లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాలపాటు వ్యాధి లక్షణాలు బయటపడకపోవడంతో ఎక్కువ మందికి సోకే అవకాశం కలుగుతోంది. వ్యాధి వ్యాపించిన ప్రదేశం కాంగోలో ప్రధాన మైనింగ్ కేంద్రం కావడంతో జనాభా రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో 2018లో ఎబోలా వ్యాపించిన సమయంలో దానిని కట్టడి చేయడానికి ఏకంగా రెండేళ్ల సమయం పట్టింది. ఎబోలాలో జైర్ అనే స్ట్రెయిన్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. దీంతో పోలిస్తే బుండిబుగ్యో ఎబోలా వైరస్ కొంచెం నెమ్మదిగానే తన సంఖ్యను పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పశ్చిమాఫ్రికా ప్రాంతంలో 2014లో 11,300 మంది ప్రాణాలు తీసింది జైర్ వేరియంట్. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఎబోలా వ్యాప్తి. దీంతో పోలిస్తే బుండిబుగ్యో వేరియంట్ సోకిన వారిలో 30? మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. కాకపోతే దీనికి ఇప్పటి వరకు ఎలాంటి వ్యాక్సిన్, చికిత్స లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఈశాన్య కాంగోలోని ఇటూరి ప్రావిన్స్‌లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. రోజు రోజుకూ మృతులసంఖ్య పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ బుండిబుగ్యో ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమ్జ్గం÷న్సీగా ప్రకటించింది. ప్రస్తుతం కాంగో, ఉగాండ, దక్షిణ సూడాన్‌లలో వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు భారత ప్రభుత్వం కూడా బుండిబుగ్యో ఎబోలాపై అప్రమత్తమైంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణించవద్దని హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఇపపటివరకు కాంగోలో మొత్తం 867 మందికి ఈ వ్యాధి వ్యాపించగా.. 204 మరణాలు నమోదయ్యాయి. ఎబోలా ఎఫెక్ట్ భారత్‌పైనా పడింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెలాఖరులో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన నాల్గవ 'ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్' వాయిదా పడింది. ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ప్రస్తుతం కలకలం రేపుతున్న ఎబోలా వైరస్ వ్యాప్తి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మరోవైపు ముందస్తు జాగ్రత్తగా కేంద్ర ఆరోగ్య శాఖ దేశవ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించింది. ముందుగా నిర్దేశరచిన షెడ్యూల్ ప్రకారం 4వ ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ మే 28 నుంచి మే 31 వరకు న్యూఢిల్లీలో జరగాల్సి ఉంది. ఈ క్లిష్ట సమయంలో ఆఫ్రికా దేశాలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని తెలియజేసిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'ఆఫ్రికా సీడీసీ' నేతృత్వంలో జరుగుతున్న ప్రజారోగ్య సన్నద్ధత, అత్యవసర పరిస్థితుల నియంత్రణ ప్రయత్నాలకు భారత్ తన వంతు సాంకేతిక, వైద్య సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ అంతర్జాతీయ ప్రయాణికులకు కీలకమైన హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే వారు లేదా ఆయా దేశాల మీదుగా ప్రయాణించి భారత్‌కు వచ్చే వారు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే తమ ఆరోగ్య పరిస్థితిని అధికారులకు నివేదించాలని ఆదేశించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 'హై-రిస్క్'గా వర్గీకరించిన డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ఎబోలా లక్షణాలు ఉన్నా లేదా బాధితులతో పరిచయం ఉన్నా ప్రయాణికులు స్వచ్ఛందంగా విమానాశ్రయ ఆరోగ్య అధికారులకు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి భారతదేశంలో ఎక్కడా ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. డబ్ల్యూహెచ్ఓ సూచనల ప్రకారం ప్రభుత్వం అన్ని ముందస్తు నివారణ చర్యలను తీసుకుంటోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎబోలా నివారణకు అవసరమైన సన్నద్ధతతో ఉండాలని కేంద్రం ఆదేశించింది. 'ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మండని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

# బీజేపీ యాత్రతో కదులుతున్న ప్రభుత్వం

- నెల రోజులుగా ధాన్యం కొనుగోలు లేదు..
- రైతుల గోస వర్ణనాతీతం..
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...



నిజామాబాద్ మే26:( విజన్ ఆంధ్ర) బిజెపి చేపట్టిన బస్సు యాత్రతో రాష్ట్ర ప్రభుత్వం కదులుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు భువనగిరి, ఆలేర్, జనగాం మార్కెట్ యార్డులోని ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఇప్పటికే ధాన్యం కొనుగోలు పూర్తి కావాల్సి ఉన్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. రాష్ట్రంలోని పలుచోట్ల సుమారు 40 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది అన్నారు. అనేకచోట్ల రైతులు తమ గోడును వెళ్ళబోసుకుంటున్నారని పేర్కొన్నారు. తాము వెళ్తున్న మార్కెట్ యార్డ్ పేరును తెలుసుకొని ముందస్తుగానే లారీలను పంపుతున్నారన్నారు. ప్రభుత్వం ఇలాగే స్పందిస్తుందంటే తాము గ్రామ గ్రామాన వెళ్లి రైతులకు అండగా నిలుస్తామన్నారు. ఒకవైపు వాతావరణ శాఖ ఎండలపై హెచ్చరికలు జారీ చేస్తే...రైతులు మాత్రం అదే ఎండలో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారన్నారు.

# ప్రశాంత వాతావరణం పెంపొందించేందుకు పోలీసుల తనిఖీలు

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు - ఏసీపీ సదానందం

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర మే 26 : ప్రజల రక్షణ,శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయంలో పోలీసులు విస్తృతంగా 'కార్డన్ అండ్ సెర్చ్ ఉమ్మడి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ఏసీపీ సదానందం నేతృత్వంలో పోలీస్ బలగాలు కాలనీలోని ప్రతి ఇల్లును క్షుణ్ణంగా సెర్చ్ చేశారు. అదేవిధంగా వాహనాలను సైతం తనిఖీ చేసి, సరైన పత్రాలు మరియు నెంబర్ ప్లేట్లు లేని పలు ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఏసీపీ సదానందం మాట్లాడుతూ,సమాజంలో నేరాల నియంత్రణకు, కాలనీల్లో ప్రశాంత వాతావరణం పెంపొందించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా నేటి యువత, విద్యార్థుల ప్రవర్తనపై



తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని, వారు ఎలాంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని గుర్తుచేశారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో నివసించే ప్రజలంతా ఒకరినొకరు గౌరవించుకుంటూ, సోదర భావంతో మెలగాలని ఏసీపీ కోరారు. కాలనీల్లో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనబడినా తక్షణమే 'డయల్ 100'కు ఫోన్ చేసి సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను మరియు వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు. నెంబర్ ప్లేట్లు లేని, సరైన పత్రాలు లేని వాహనాలను నడిపితే సీజ్ చేయడమే కాకుండా భారీ జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్,ఎస్ఐ లక్ష్మారెడ్డిలతో పాటు అక్కన్నపేట ఎస్ఐ ప్రశాంత్, కోహెడ ఎస్ఐ అభిలాష్ మరియు పోలీస్ సిబ్బంది, సివిల్ ఫోర్స్ భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కాలనీలోని ప్రతీ బ్లాక్‌ను జల్లెడ పట్టి, ప్రజలకు భద్రతపై భరోసా కల్పించారు.

# రైతన్నలు ఆందోళన వద్దు

- ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుంది
- నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి మే 26 : సిద్దిపేట జిల్లా కేంద్రంలో గలనంగునూరుమండలంలోరైతన్నలు ఆందోళన చెందవలసిన అవసరం లేదు చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి భరోసా కల్పించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోప్యాక్స్ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్నితనిఖీనిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరిమాట్లాడుతూ.ధాన్యం కొనుగోళ్ల ను వచ్చే 10 రోజుల్లో పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యచరణరూపొందించారని తెలిపారు.కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ధాన్యంకొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా కల్పించారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణావిభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతి పదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు.. ట్రాక్టర్లు ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని చైర్మన్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలోనాగరాజుపల్లి సర్పంచ్ ముక్కెర లింగం యాదవ్, రాగుల కనకయ్య, గౌరబోయిన రాజు,శేఖర్, రాంరెడ్డి, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీతో సేవా స్ఫూర్తి!!

- ఎండల్లో ప్రజలకు చల్లని ఊరట
- పుట్టినరోజున వినూత్న సేవా కార్యక్రమం
- రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ వితరణతో పేదలకు ఉపశమనం
- దాహార్తిని తీరుస్తున్న గోదావరిఖని రిక్రియేషన్ క్లబ్

బ్యూరో చీఫ్ (పెద్దపల్లి), మే 26 (విజన్ ఆంధ్ర) : నిప్పులు చెరిగే వేసవి ఎండల్లో అల్లాడుతున్న గోదావరిఖని ప్రజలకు రామగుండం రిక్రియేషన్ క్లబ్ ఒక చల్లని ఆసరాగా నిలుస్తోంది. పట్టణ ప్రధాన చౌరస్తాలో ప్రతిరోజూ సాగుతున్న ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం మంగళవారం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. ఇందుకు కారణం రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ అరావ్ ఎటర్నా అధినేత పుప్పాల విక్రమసింహారావు తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా యజ్ఞానికి అండగా నిలవడమే.



మండుటెండల్లో బాటసారుల దాహార్తిని తీర్చడమే పరమావధిగా, సామాజిక బాధ్యతతో క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారని క్లబ్ అధ్యక్షులు బల్మూరి అమరేందర్ రావు ఈ సందర్భంగా గర్వంగా ప్రకటించారు. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, సమాజానికి మేలు చేసే విధంగా విక్రమసింహారావు ముందుకు రావడం అందరికీ స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు. విక్రమసింహారావుకి జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తగా, ఎండ వేడి నుంచి ఉపశమనం పొందుతున్న సామాన్యుల ముఖాల్లోని చిరునవ్వే ఈ కార్యక్రమ విజయానికి నిదర్శనంగా నిలిచింది. ఈ మానవీయ కోణమే రామగుండం రిక్రియేషన్ క్లబ్ చేస్తున్న నిరంతర కృషికి అద్దం పడుతోంది. పదిమందికి మేలు చేసే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సేవా కార్యక్రమంలో గోపాల్ రావు, శ్రీనివాస్, నిట్టూరి జీవన్ బాబు, తూముల అశోక్ రావుతో పాటు ఈద జగన్ మోహన్ రెడ్డి, కొల్లూరి శ్రీనివాస్ ఉత్సాహంగా పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు.

# విద్యా వ్యాపారం: ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై కళ్లు తెరవాల్సిందెవరు?




గండిపేట మే 26 (విజన్ ఆంధ్ర) : తెలంగాణలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుందంటే చాలు, సగటు మధ్యతరగతి తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. పుస్తకాలు, యూనిఫారాలు, వ్యాన్ ఫీజులు... వీటన్నింటికీ మించి ఆకాశాన్ని తాకుతున్న ట్యూషన్ ఫీజులు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. ఒకప్పుడు సమాజ సేవగా, పవిత్రమైన విధిగా సాగిన విద్య, నేడు అత్యంత లాభదాయకమైన 'కార్పొరేట్ వ్యాపారం'గా రూపాంతరం చెందింది. ఈ విద్యా దోపిడీకి అడ్డుకట్ట పడేదెప్పుడు? నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ప్రభుత్వం, బ్రాండ్ల వెనుక పరిగెడుతున్న తల్లిదండ్రులు ఎప్పుడు కళ్లు తెరుస్తారు?

**తల్లిదండ్రుల భ్రమలు - కార్పొరేట్ మాయాజాలం**

ముందుగా తల్లిదండ్రులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. "ఎక్కువ ఫీజు కడితేనే నాణ్యమైన చదువు వస్తుంది", "ఏసీ క్లాస్ రూములు, ఇంటర్నేషనల్ సిలబస్ ఉంటేనే మన బిడ్డల భవిష్యత్తు బాగుంటుంది" అనే ఒక రకమైన సామాజిక భ్రమలో తల్లిదండ్రులు బతుకుతున్నారు. ఒకటవ తరగతి చదివే పిల్లవాడికి కూడా ఐఐటీ, నీట్ ఫౌండేషన్ అంటూ వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తుంటే, అది తమ పిల్లల మేధస్సుకు మంచిదని నమ్ముతూ అప్పులు చేసి మరీ ఫీజులు చెల్లిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలు కేవలం ఏసీ రూములు, రంగురంగుల భవనాలను చూపిస్తూ విద్యా వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నాయి. తమ పిల్లల ప్రగతికి పాఠశాల ఫీజుల పరిమాణానికి ఎలాంటి సంబంధం లేదని తల్లిదండ్రులు గ్రహించాలి. విద్యాసంస్థలను కేవలం బ్రాండ్ల రూపంలో చూడటం మానేసి, ప్రశ్నించడం నేర్చుకోనంత కాలం ఈ ఫీజుల దోపిడీ ఇలాగే కొనసాగుతుంది.

ప్రభుత్వ ఉదాసీనత: పాలకుల కళ్లు కప్పిన విద్యా లాబీ!

ఫీజుల నియంత్రణ విషయంలో తెలంగాణ ప్రభుత్వ తీరు అత్యంత నిరాశాజనకంగా ఉంది. గతంలో ఏర్పాటైన ప్రొఫెసర్ తిరుపతి రావు కమిటీ వంటి అనేక కమిటీల నివేదికలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. పొరుగు రాష్ట్రాలు కొన్ని ఫీజుల నియంత్రణకు చట్టాలు తెస్తుంటే, మన రాష్ట్రంలో మాత్రం ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల లాబీయింగ్‌కు ప్రభుత్వం తలొగ్గుతోందా అనే అనుమానం కలగక మానదు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, వాటిని బలోపేతం చేయడంలో పాలకులు విఫలం కావడం వల్లే ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యా హక్కు చట్టం (=ఱజు) ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో కేటాయించాల్సిన 25 శాతం సీట్ల నిబంధనను పటిష్టంగా అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ప్రతి ఏటా ఫీజులను 10 నుంచి 20 శాతం పెంచుకుంటూ పోతున్నా, వాటి ఆడిటింగ్ నిర్వహించే నాథుడే కరువయ్యాడు. ఇకనైనా ప్రభుత్వం నిద్ర మత్తు వదిలి ఒక బలమైన "ఫీజుల నియంత్రణ చట్టాన్ని" తీసుకురావాలి. ప్రతి పాఠశాల విద్య హక్కు చట్టం వివరాలు, తమ విద్యార్థుల ఫీజుల వివరాలను, ఉపాధ్యాయుల జీతాలను పారదర్శకంగా వెబ్‌సైట్‌లో ఉంచేలా కఠిన నిబంధనలు అమలు చేయాలి. తల్లిదండ్రులు కూడా కేవలం వాట్సాప్ గ్రూపులకే పరిమితం కాకుండా, 'తల్లిదండ్రుల సంఘాల' ద్వారా సంఘటితమై పాఠశాల యాజమాన్యాలను, ప్రభుత్వాన్ని నిలదీయాలి. విద్య అనేది వ్యాపార వస్తువు కాదు, అది ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు. ఈ హక్కును వ్యాపారుల పాలు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అటు ప్రభుత్వానిది, ఇటు సమాజానిది.

# ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి

## యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" ఎర్రముక్కపల్లె బ్రాంచి నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప, మే 26 (విజన్ ఆంధ్ర): అన్నిరంగాల్లోఖాతాదారులకు విశిష్టమైన, మెరుగైన సేవలు అందిస్తున్న "యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" సేవలు జిల్లాలో మరింత విస్తృతం కావాలని. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. మంగళ వారం నగరంలోని రాజీవ్ మార్గ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన "యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" ఎర్రముక్కపల్లె బ్రాంచ్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి. వైవియూ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, యూబీఐ రీజినల్ మేనేజర్ లక్ష్మితులసి లతోకలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కడప జిల్లాలో అన్ని ప్రాంతాల్లో శాఖలను విస్తృత పరుస్తూ ఖాతాదారులకు మెరుగైన, విశిష్టమైన



బ్యాంకు సేవలు అందిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఈ బ్యాంకు ద్వారా ప్రజలకు కేవలం లావాదేవీలు మాత్రమే కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను లబ్దిదారులకుఅందజేయడంలో పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. అర్హులైన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక చేయుతను అందించడంలో కూడా సహకారం అందించాలని కోరారు అన్ని రంగాల ప్రజలకు, వారి అవసరాలకు అనుగుణంగా. సేవింగ్, కరెంట్ ఖాతాదారులకు నమ్మకమైన సేవలు అందించాలన్నారు. ఈ విషయంలో బ్యాంకర్లు లబ్దిదారుల్లో అవగాహన, నమ్మకాన్ని, ప్రోత్సాహాన్ని అందించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. బ్యాంకర్లకు, లబ్దిదారులకు మధ్య సత్సంబంధాలు మెరుగుపడేలా సేవలు అందించాలన్నారు. భవిష్యత్తులో అధిక లాభాలు గడించి, జిల్లా ఆర్థిక ప్రగతిలో "యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" కూడా తమ వంతు భాగస్వామ్యం కావాలన్నారు. డిజిటల్ లావాదేవీల నిర్వహణపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. ఇప్పటికే డిజిటల్ లావాదేవీల నిర్వహణలో జిల్లా 100% సఫలీకృతం అయిందన్నారు. కార్యక్రమంలో ముందుగా.. ప్రారంభోత్సవ పూజ, జ్యోతి ప్రజ్వలన అనంతరం బ్యాంకు పక్కనే నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీఎం సెంటర్ ను కూడా వైవియూ విసి, యూబీఐ ఆర్ఎం లతో కలిసి జిల్లా కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం బ్యాంకు అధికారులు జిల్లా కలెక్టర్, విసి లను గౌరవ పూర్వకంగా పుష్ప గుచ్ఛం అందించి, దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో "యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" ఎర్రముక్కపల్లె బ్రాంచ్ మేనేజర్ భాను తేజ, ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ రవీంద్రా రెడ్డి, వివిధ శాఖల బ్యాంక్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధ మహిళకు గది నిర్మాణం ఏర్పాటు

- తక్షణ ఆర్థిక సాయం అందజేసిన తిరుమలరావు

కారేపల్లి,మే 26 (విజన్ ఆంధ్ర) : నిరుపేద ఒంటరి మహిళలకు ఒక గది నిర్మాణాన్ని చేపట్టి ఆదుకుంటామని గుడిపూడి తిరుమలరావు అన్నారు. వివరాల్లోకి వెళితే సింగరేణి మండలం గేట్ కారేపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో నివసిస్తున్న కాకాటి కళావతి నిలువ నీడలేని పరిస్థితుల్లో ఉండటానికి కనీస సౌకర్య లేకుండా ఇబ్బంది పడుతున్నారు. బాధితురాలు పలువురు కోరిక మేరకు మంగళవారం వృద్ధ మహిళ కళావతి ఇంటిని పరిశీలించిన అనంతరం తక్షణ సాయంగా కొంత ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దాత గుడిపూడి తిరుమలరావు మాట్లాడుతూ... బాధితురాలు కళావతికి ఇందిరమ్మ



ఇండ్లు మంజూరు చేసినా నిర్మాణం చేపట్టుకోలేని స్థితిలో ఉన్నందున నివసించేందుకు ఒక గది నిర్మాణం పూర్తి చేసి ఇస్తానన్నారు. నిరుపేద బలహీన వర్గాలకు బాసటగా నిలుస్తూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిర్విరామంగా పాటుపడతా నన్నారు. గ్రామ అభివృద్ధిలో తన వంతు సాయం అందిస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన ఏజెండా అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసరావు, గుడిపూడి నర్సయ్య,గుడిపూడి తిరుమల రావు,జక్కుల కుమార్, షేక్ హాజేమియా, చెరుకూరి రామారావు,కాకతి సుదర్శన్,సామినేని తిరుపతిరావు, మంద రామారావు,వల్లభినేని చంద్రశేఖర్,కాకతి పృధ్వి,బండ మల్లయ్య,పొట్లకాయల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీసుల ఉక్కుపాదం

- జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో ఆకస్మిక దాడులు
- 06 కేసుల నమోదు.. భారీ మొత్తంలో డాక్యుమెంట్లు, ఆభరణాల స్వాధీనం





రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 26 (విజన్ ఆంధ్ర): అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తూ ప్రజలను అధిక వడ్డీలతో వేధిస్తున్న వారిపై జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా 15 ప్రత్యేక పోలీసు బృందాలు ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమ ఫైనాన్స్ వ్యాపారాలపై కఠిన చర్యలు చేపట్టాయి. ఈ దాడుల్లో అక్రమంగా ఫైనాన్స్, వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై 06 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. తనిఖీల సందర్భంగా రూ.1,39,65,000 విలువైన వివిధ డాక్యుమెంట్లతో పాటు రూ.1,77,000 విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలతో డబ్బులు ఇచ్చి సామాన్యులను వేధించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని తరువాత అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడటం, ఆత్మహత్యలకు పాల్పడటం వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ అనుమతులతో చట్టబద్ధంగా ఫైనాన్స్ నిర్వహించే సంస్థలనే నమ్మాలని సూచించారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ ఫైనాన్స్ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయానికి లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు బాధితులకు న్యాయం జరిగేలా సమగ్ర విచారణ చేపడతామని ఎస్పీ స్పష్టం చేశారు. అధిక వడ్డీ రేట్లతో సామాన్యులపై దౌర్జన్యాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# వేములవాడలో ప్రారంభమైన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్

## అందుబాటులోకి తక్కువ ధరకే నాణ్యమైన భోజనం





వేములవాడ రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 26 (విజన్ ఆంధ్ర): మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎదుట ఏర్పాటు చేసిన మెప్మా క్యాంటీన్ & క్యాటరింగ్ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ క్యాంటీన్‌ను ప్రారంభించారు. మహిళలు వ్యాపార రంగంలో రాణించి ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధిలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. క్యాంటీన్ ప్రారంభం అనంతరం వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కేంద్రాన్ని సందర్శించి స్వయంగా భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ ప్రభుత్వాసుపత్రికి వచ్చే పేద రోగులు, వారి సహాయకులు, అలాగే శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ఈ క్యాంటీన్ ఎంతో ఉపయోగకరంగా మారుతుందని అన్నారు. తక్కువ ధరకే పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందించడం అభినందనీయమన్నారు. ఈ క్యాంటీన్ ద్వారా ప్రజలకు చౌకగా భోజనం అందడమే కాకుండా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. మహిళలు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ క్యాంటీన్‌ను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, మెప్మా అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల వేగంపై కలెక్టర్ ఫోకస్

## హమాలీలు, వాహనాలు పెంచాలని అధికారులకు ఆదేశాలు



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 26 (విజన్ ఆంధ్ర): జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులు, గోదాంలకు తరలించి అన్‌లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో పాటు పౌర సరఫరాలు, సహకార, గ్రామీణాభివృద్ధి, మెప్మా, రవాణా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ధాన్యం సేకరణ, మిల్లుల్లో అన్‌లోడింగ్ పురోగతి, ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. మిల్లుల వద్ద హమాలీల సంఖ్య పెంచి అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని యజమానులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. వర్షాల అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం బస్తాలను వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు తగినంత అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి హమాలీలను అపారెల్ పార్క్‌కు పంపించి అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చి తూకం వేసిన బస్తాలను ఆలస్యం లేకుండా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజువారీ కొనుగోళ్ల శాతం పెరిగేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

# గుంటూరుపల్లిలో నూతన అంగన్వాడీ భవనం ప్రారంభం

- గ్రామీణ పిల్లలకు మెరుగైన విద్య, పోషణ అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : కలెక్టర్ డాక్టర్ సత్య శారద





వరంగల్ జిల్లా ప్రతినిధి మే26(విజన్ ఆంధ్ర) ; ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల రెండవ రోజు సందర్భంగా సంగెం మండలం గుంటూరుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.8 లక్షలు, సీడీపీఓ ఆధ్వర్యంలోని 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.4 లక్షల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో ఈ భవనం నిర్మించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్త అంగన్వాడీ భవనం ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్య విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వరంగల్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా 'స్నేహ' కార్యక్రమం ప్రారంభిస్తే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమల్లోకి వచ్చింది అన్నారు. మహిళలు, కౌమార దశలో ఉన్న చిన్నారుల సంక్షేమానికి "స్నేహ" కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలికలకు అవసరమైన సేవలను ఒకే వేదికపై అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత చిన్నారులకు మెరుగైన పోషణ, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతంతో పాటు చిన్నారుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి డి డబ్ల్యూ రాజమణి ఖిలా వరంగల్ తాసిల్దార్ ఇక్బాల్ ఎంపీడీవో రమేష్ గుంటూరుపల్లి సర్పంచ్ సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పథకం ప్రకారమే మర్డర్

- అప్పు,అక్రమ సంబంధం, హత్యకు దారితీసింది
- పోలీసుల అదుపులో నిందితులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ భాస్కర్





మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 26,(విజన్ ఆంధ్ర ) : ఈనెల 22 న రోడ్డుప్రమాదం లో మృతి చెందిన అనుమానస్పద కేసులో పోలీసులు రెండు మూడు రోజుల్లోనే చెందించారు. ఈ ఘటనకు సంబంధించి మంగళవారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ ఎగ్గడి భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ తో కలిసి వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట గ్రామం ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన సాయిని కుమార్ (40) అనే వ్యక్తి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 22న రాత్రి పని నిమిత్తం బయటకు వెళ్లిన సాయిని కుమార్ ముల్కల్ల శివారులో రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ కు తీసుకెళ్లగా మృతదేహం పై గాయాలను చూసి అనుమానం వచ్చి తన కొడుకుకు రూ.60 వేలు అప్పుగా ఇచ్చిన రామ్ మల్లేష్ అనే వ్యక్తి పై అనుమానం ఉన్నట్లు తల్లి సాయిని లక్ష్మీ ఫిర్యాదు ఇచ్చిందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.మృతుడి భార్య సాయిని భారతి గుడిపేట్ గ్రామానికి చెందిన లగిశెట్టి సురేందర్ అనే వ్యక్తికి అక్రమ సంబంధం వున్నది.ఈ అక్రమ సంబంధం విషయం భారతి భర్తకు తెలియడంతో తాగుడుకు అలవాటు పడి, రోజు తాగి వచ్చి తన భార్యను కొట్టి హింసించేవాడు. విపరీతంగా తాగడం వలన అప్పుల పాలై, గుడిపేట్ గ్రామానికే చెందిన రామ్ మల్లేష్ వద్ద రూ.60వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగి కట్టక పోవడం తో మల్లేష్ మృతుడి ఇంటికి వెళ్లి డబ్బుల విషయంలో గొడవ చేశాడు. మృతుడు అప్పు తిరిగి ఇవ్వనందున మల్లేష్ మృతున్ని చంపుతానని బెదిరించేవాడు. ఆదే క్రమంలో మృతుడి భార్య కు మల్లేష్ తో పరిచయం ఏర్పడింది. మృతుడు రోజు తాగి వచ్చి భారతి ని అక్రమ సంబంధం విషమై కొట్టడం వలన, తన భర్తను చంపితే తన ఆక్రమ సంబందానికి అడ్డు లేకుండా పోతుందని భర్తను చంపాలని నిర్ణయించుకొని, పథకం ప్రకారం మృతుని పేరు మీద స్థానికంగా, ఆన్లైన్లో యాప్ల ద్వారా రూ.15లక్షలు అప్పు చేసి పలు కంపనీల్లో ఇన్సూరెన్స్ లు చేయించింది. తరువాత రామ్ మల్లేష్ తో భారతి తన భర్త సాయిని కుమార్ ను చంపి, దానిని రోడ్డు ప్రమాదం గా చిత్రీకరించుటకు రూ.10లక్షలకు ఒప్పందం చేసుకుంటారు. 2026 ఏప్రిల్లో అడ్వాన్స్ రూ. 2 లక్షలను ఇస్తుంది. మల్లేష్ ఒక్కడే చంపడం సాధ్యం కాదని తనకు పరిచయమున్న మేస్త్రి పని చేస్తున్న శ్రీరామ్ అనే వ్యక్తిని మాట్లాడుకొని ప్లాన్ చేసుకుంటారు. వారి పథకం ప్రకారం ఈ నెల 22న అర్ధరాత్రి సమయంలో ముల్కల్ల గ్రామ శివారులో ముగ్గురు కలిసి మద్యం సేవిస్తారు. మృతునికి ఎక్కువ మద్యం తాగించి, ఇనుప సుత్తె తో తల పై బలంగా కొట్టి హత్య చేస్తారు. చనిపోయాడనుకొని నిర్ణయించుకొని దాన్ని రోడ్ ప్రమాదంగా చిత్రీకరించుటకు మృతున్ని అతని మోటార్ సైకిల్ ను రోడ్ పై పడేసి అక్కడి నుండి పారిపోయినారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మృతుడి ఫోన్ డేటా ఆధారంగా నిందుతులైన గుడిపేటకు చెందిన రాం మల్లేష్, మృతుడి భార్య సాయిని భారతి, లగిశెట్టి సురేందర్ ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించడంతో నిందుతులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు తరలించనున్నట్లు డీసీపీ వివరించారు. మంచిర్యాల ఎల్ ఐ సి కాలనీకి చెందిన శ్రీరాం కుమార్ అనే నిందుతుడు పరారిలో ఉన్నట్లు త్వరలోనే అతనిని కూడా పట్టుకొని కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు పంపిస్తామని పేర్కొన్నారు.నిందితుల నుండి ఒక మోటార్ సైకిల్, 25 వేల రూపాయలు నగదు, భీమా కంపెనీలకు చెందిన 4 పాలసీలు బాండ్ లు, 3 సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సీఐ జీ. రవీందర్, హాజీపూర్ ఎస్ ఐ.కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు సమన్వయంతో చర్యలు అవసరం

## ప్రజల్లో అవగాహన పెంచాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచన



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 26 (విజన్ ఆంధ్ర): మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులకు సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం మరియు రవాణా నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్య తో కలిసి మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో నమోదైన ఎన్డీపీఎస్ కేసులు, మాదక ద్రవ్యాల సాగు నివారణ చర్యలు, విద్యార్థులు మరియు యువత డ్రగ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడిన వారిని గుర్తించి వారికి వైద్య సేవలు, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ–అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ద్వారా బాధితులకు చికిత్సతో పాటు మానసిక పరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై పోలీస్, ఎక్సైజ్, విద్యాశాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శరత్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


# మహిళా భద్రతపై గోడపత్రిక ఆవిష్కరించిన వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్




వరంగల్ జిల్లా ప్రతినిధి మే26(విజన్ ఆంధ్ర); మహిళా భద్రతపై అవగాహన పెంపొందించేందుకు మరో ముందడుగు పడింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా భద్రతకు సంబంధించిన సందేశాలతో రూపొందించిన గోడ పత్రికను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం సీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. "మహిళల రక్షణ కోసం భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళలు ఎక్కడైనా ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. సమాజంలో మహిళలపై జరిగే వేధింపులు, నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన అవసరమని తెలిపారు. గోడ పత్రిక ద్వారా మహిళా హక్కులు, భద్రతా చర్యలు, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన హెల్ప్ లైన్ వివరాలను ప్రజలకు చేరవేయడం లక్ష్యం అన్నారు.పోలీస్ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేస్తే మహిళలకు మరింత భద్రత కల్పించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక బృందాలు, షీ టీమ్స్ సమర్థంగా పనిచేస్తున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ దారా కవిత అదనపు డీసీపీ రవి తదితర అధికారులు పాల్గొన్నారు. మహిళా భద్రతపై ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.

# కలెక్టరేట్ లిఫ్ట్‌లో ఇరుక్కున్న అధికారి

- గంటన్నర తర్వాత సురక్షితంగా బయటకు తీసిన సాంకేతిక సిబ్బంది





రాజన్న సిరిసిల్ల, మే 26 (విజన్ ఆంధ్ర): రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో మంగళవారం ఉదయం లిఫ్ట్‌లో ఓ అధికారి ఇరుక్కోవడంతో కొంతసేపు ఆందోళన నెలకొంది. డీఆర్డీఏ కార్యాలయంలో ఎపిడి అధికారిగా పనిచేస్తున్న కూర నర్సింహులు విధులకు హాజరయ్యేందుకు కలెక్టరేట్‌కు వచ్చి పై అంతస్తుకు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కారు. అయితే సాంకేతిక సమస్య కారణంగా లిఫ్ట్ మధ్యలోనే నిలిచిపోయింది. లిఫ్ట్‌లో చిక్కుకుపోయిన అధికారి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతోందని తోటి ఉద్యోగులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో ఉద్యోగులు వెంటనే అప్రమత్తమై సాంకేతిక సిబ్బందికి సమాచారం అందించారు. సుమారు గంటన్నర పాటు శ్రమించిన సాంకేతిక నిపుణులు లిఫ్ట్ తలుపులు తెరిచి కూర నర్సింహులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అధికారి క్షేమంగా బయటపడటంతో కలెక్టరేట్ ఉద్యోగులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనతో కొంతసేపు కార్యాలయ ప్రాంగణంలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

# క్రీడాకారులను అభినందించిన పోలీస్ కమిషనర్

**- శిక్షణతో రాణిస్తున్న పోలీస్ పిల్లలు**



ఖమ్మం జిల్లా బ్యూరో, మే 26(విజన్ ఆంధ్ర) : జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 23,24 తేదీల్లో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన అండర్ -11,13 జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ - 2026 సింగిల్స్, డబుల్స్ పోటీలలో ప్రతిభ చూపి 12వ యోనెక్స్- సన్‌రైజ్ తెలంగాణ రాష్ట్ర సీనియర్, సబ్-జూనియర్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్లకు అర్హత సాధించిన క్రీడాకారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఇటీవల రాష్ట్ర డీజీపీ నూతనంగా ప్రారంభించిన పోలీస్ స్పోర్ట్స్ కంప్లెక్స్ లో బ్యాడ్మింటన్ శిక్షణ పొందిన పోలీస్ సిబ్బంది పిల్లలు ఇస్లావత్ కీర్తిష్, వి.నిశాంత్,ఎ.శ్రీ మేధాన్వా,(వి.మనోజ్,ఎ.రోహిత్ సీనియర్ విభాగం మరియు కోచ్ లు ) జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ లో ప్రతిభ చూపటం అభినందనీయమన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని అన్నారు. బ్యాడ్మింటన్ వంటి క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించి క్రీడల్లో రాణిస్తున్న పోలీస్ స్పోర్ట్స్ కంప్లెక్స్ ను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 26 (విజన్ ఆంధ్ర) : వేములవాడ నియోజకవర్గంలోని తిప్పాపురంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని ముని కళ్యాణ మహోత్సవం, సిద్ధోగ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో సిద్ధోగ వేడుకలను తిలకించారు. ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామీణ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడే ఇలాంటి మహోత్సవాలను ప్రజలు కలిసి నిర్వహించడం అభినందనీయమన్నారు.

# బక్రీద్ బందోబస్తుపై సీపీ సమీక్ష విజిబుల్ పోలీసింగ్‌తో అప్రమత్తంగా ఉండాలి

**- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్**

**- ధాన్యం సేకరణ కేంద్రాలపైనా నిఘా పెట్టాలని ఆదేశాలు**




వరంగల్ జిల్లా ప్రతినిధి మే26(విజన్ ఆంధ్ర); కమిషనరేట్ పరిధిలో బక్రీద్ పండుగకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్షించారు. ప్రార్థనా స్థలాల వద్ద విజిబుల్ పోలీసింగ్ ఉండాలని, గోవుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటివరకు చెక్‌పోస్టుల ద్వారా 11 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. స్టేషన్ స్థాయిలో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, పాత నేరస్తులను బైండోవర్ చేయాలని సూచించారు. గ్రామీణ సంతల్లో పశువుల విక్రయాలపై నిఘా పెట్టాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వధశాలల వ్యర్థాల తరలింపునకు మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీపీ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. ధాన్యం సేకరణ, రవాణా, గోదాముల నిల్వ సామర్థ్యంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రవాణా కోసం అవసరమైన లారీల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, దారా కవిత, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# ఈజీఎస్ బిల్లుల కోసం ఎంపీడీవో కార్యాలయంలో ట్రాక్టర్ యజమాని నిరసన

**- పురుగుల మందు డబ్బాతో బైఠాయింపు.. చందుర్తిలో ఉద్రిక్తత**



చందుర్తి రాజన్న సిరిసిల్ల బ్యూరో,మే 26 (విజన్ ఆంధ్ర): రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో ఈజీఎస్ బిల్లుల చెల్లింపుల విషయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ట్రాక్టర్ యజమాని లండే సంతోష్ ఎంపీడీవో కార్యాలయంలో పురుగుల మందు డబ్బాతో నిరసనకు దిగారు. తాను 2025లో ఈజీఎస్ పనుల కింద సుమారు 200 ట్రిప్పుల మట్టిని తరలించినప్పటికీ ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు. పలుమార్లు అధికారులను సంప్రదించినా సరైన స్పందన లభించలేదని వాపోయారు. పనుల కోసం పెట్టుబడి పెట్టేందుకు అప్పులు చేయాల్సి వచ్చిందని, బిల్లులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సంతోష్ తెలిపారు. బిల్లుల విషయమై అడిగితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే తమకు రావాల్సిన నగదును విడుదల చేసి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఘటనతో ఎంపీడీవో కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.

# రైతు గోస బీజేపీ భరోసా

**హనుమకొండ జిల్లాలో కొనసాగుతున్న 'రైతుగోస - బీజేపీ భరోసా' యాత్ర లో నీరుకుళ్ళ క్రాస్ రోడ్ వద్ద ధాన్యపు కళ్ళాలను సందర్శించిన బీజేపీ అగ్రనేతలు.**

**రైతులను గోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవు: ఎంపీ ఈటల రాజేందర్**

**డిక్లరేషన్ పేరిట వరంగల్ రైతుల్ని కాంగ్రెస్ మోసం చేసింది: బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.**

**ప్రశ్నించిన వారిపై కక్షసాధింపు చర్యలకు దిగితే ఐదేళ్లు కూడా అధికారంలో ఉండలేరు: ఎంపీ రఘునందన్‌రావు**



హన్మకొండ జిల్లా ప్రతినిధి మే 26 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండ జిల్లాలో 'రైతుగోస – బీజేపీ భరోసా' బస్ యాత్ర ఉధృతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ క్రాస్ రోడ్ వద్ద పెంచికలపేట పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ ముఖ్య నేతల బృందం సందర్శించింది. కేంద్రంలో ధాన్యం రాశుల వద్ద ఇబ్బందులు పడుతున్న రైతులతో నేతలు స్వయంగా మాట్లాడి, కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతులను, ప్రతిపక్షాలను ధబాయించడం సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే బంద్ చేయాలని డిమాండ్ చేశారు. రైతులను గోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవన్నారు. కనీసం గన్నీ బ్యాగులు (సంచులు), కాంటాలు, లారీలు ఏర్పాటు చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ధాన్యం కొనలేని మంత్రులు సిగ్గులేకుండా ఎదురుదాడికి దిగడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోళ్లకు, సంచులకు, పరదాలకు, రవాణాకు వంద శాతం నిధులు ఇస్తుంటే.. కొనుగోలు చేయడం చేతకాక కేంద్రంపై నెపం నెట్టడం రేవంత్ రెడ్డి చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ధాన్యం సేకరించకపోతే రైతులు ఈ ప్రభుత్వాన్ని పాతాళానికి తొక్కడం ఖాయమని హెచ్చరించారు. బీజేపీ శాసనసభ పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నారని, క్షేత్రస్థాయికి వచ్చి చూస్తే 50 శాతానికి పైగా ధాన్యం ఇంకా కళ్ళల్లోనే మూలుగుతోందని అన్నారు. వరంగల్ వేదికగా 'రైతు డిక్లరేషన్' ప్రకటించిన కాంగ్రెస్, నేడు ఇక్కడి రైతులనే నట్టేట ముంచిందని ఆరోపించారు. సమస్యలపై ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్‌ను సస్పెండ్ చేయడం దుర్మార్గుల పాలనకు అద్దం పడుతోందన్నారు. "మేము బీజేపీ ఎమ్మెల్యేలుగా అడుగుతున్నాం.. మమ్మల్ని సస్పెండ్ చేసే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా?" అని సవాల్ విసిరారు. రైతులకు అన్యాయం జరిగితే బీజేపీ చూస్తూ ఊరుకోదని, అవసరమైతే పెద్ద ఎత్తున రైతు ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు మాట్లాడుతూ.. పెట్రోల్ ధరల పెరుగుదలపై మాట్లాడిన పాపానికి ఒక ఆర్టీసీ డ్రైవర్ ఉద్యోగాన్ని పీకేయడం ప్రజాస్వామ్యమా? అని ప్రశ్నించారు. తెలంగాణలో సాగుతున్న కాంగ్రెస్ తుగ్లక్ పాలనను రాహుల్ గాంధీ చూడాలని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ రైతులకు బేడీలు వేస్తే, నేడు రేవంత్ రెడ్డి ప్రశ్నించిన వారిపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. మాట్లాడిన వారిపై ఇలాంటి అప్రజాస్వామిక, కక్షసాధింపు చర్యలకు పాల్పడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు కూడా అధికారంలో ఉండలేదని స్పష్టం చేశారు. ఈ 'రైతుగోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్, శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావులతో పాటు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి, ఎమ్మెల్సీ జి. ఆంజి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మారెడ్డి, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్,మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, కే. రాజయ్య యాదవ్, చందుపట్ల కీర్తి రెడ్డి, డాక్టర్ కాళీ ప్రసాద్, సిద్ధం నరేష్ పటేల్, ఎడ్ల అశోక్ రెడ్డి, బద్దం మహిపాల్ రెడ్డి, పోతుగంటి భరత్ ప్రసాద్, జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఆరుట్ల దశమంత రెడ్డి, మల్లాది తిరుపతి రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు నిషిధర్ రెడ్డి, ములుగు జిల్లా అధ్యక్షులు మొగిలి, జనగామ జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ తదితర హనుమకొండ జిల్లా బీజేపీ నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం

**- పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలని నాయకుల పిలుపు**




రాజన్న సిరిసిల్ల, మే 26 (విజన్ ఆంధ్ర): రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం, గ్రామ మరియు వార్డు స్థాయి కమిటీల ఏర్పాటు, ప్రభుత్వ పథకాల ప్రచారం వంటి అంశాలపై నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ కూన శ్రీశైలం గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏఐసీసీ పిలుపు మేరకు గ్రామ, వార్డు స్థాయి కమిటీలను బలోపేతం చేస్తూ పార్టీని ప్రజల్లో మరింత బలంగా తీసుకెళ్లాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందన్నారు. ఇందిరా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదలకు ఉపాధి అవకాశాలు కల్పించిందని, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు చీరల పంపిణీ, కులగణన వంటి కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ జీవిత బీమా పథకం కింద రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని జూన్ 2 నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూ కొత్త సంక్షేమ కార్యక్రమాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతోందన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నారని, అందువల్లే ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయాలు సాధించామని నాయకులు పేర్కొన్నారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నల్గొండలో తెల్లవారు జామున కార్డెన్ అండ్ సెర్చ్

**- 46 మంది అనుమానితులు అదుపులోకి**

**- 200 మంది పోలీసులతో 10 బృందాలుగా విస్తృత తనిఖీలు.**

**- 54 ద్విచక్ర వాహనాలు,16 గుట్కా బ్యాగులు స్వాధీనం:**

**- ఎస్పీ శరత్ చంద్ర పవార్**




ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,మే26,(విజన్ ఆంధ్ర) : నేర నియంత్రణ లక్ష్యంగా నల్గొండ పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు విస్తృత స్థాయిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పట్టణాన్ని అష్ట దిగ్బంధం చేసి సతీష్ నగర్‌తో పాటు ఇతర పలు ప్రాంతాల్లో 10 బృందాలుగా ఏర్పాటు చేసి ఈ తనిఖీలు చేపట్టారు.200 మంది పోలీసులతో తనిఖీలు చేపట్టారు.నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో ఏడుగురు సీఐలు,18 మంది ఎస్ఐలు,నార్కోటిక్ డాగ్‌తో కలిపి సుమారు 200 మంది పోలీసు అధికారులు,సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. పట్టణంలోని పలు కాలనీలు, అనుమానిత ప్రాంతాలు, లాడ్జీలు,అద్దె గదులు,రైల్వే స్టేషన్,బస్టాండ్,ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.పట్టణంలో సుమారు 360 ఇండ్లలో తనిఖీలు నిర్వహించారు.46 మంది అనుమానితులను గుర్తించి వారి వివరాలు సేకరించి పరిశీలిస్తున్నారు.ఇతర రాష్ట్రాలకు చెందిన 18 మందిని గుర్తించారు.వీరిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన10 మంది,బీహార్‌కు చెందిన 4 మంది,తమిళనాడుకు చెందిన1వ్యక్తి,అస్సాంకు చెందిన1వ్యక్తి, హర్యానాకు చెందిన 2 మంది ఉన్నారు.ఇద్దరు రౌడీషీటర్లు,5 మంది ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు.ఆరుగురికి గంజా టెస్టులు నిర్వహించగా వీరిలో ఇద్దరు గంజా సేవించినట్లు గుర్తించారు.అక్రమంగా నిల్వ ఉంచిన 16 గుట్కా బ్యాగులు,4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.సరైన పత్రాలు, రిజిస్ట్రేషన్ సక్రమంగా లేని 54 ద్విచక్ర వాహనాలు,2 ఆటోలు, అధిక శబ్దం కలిగిన 2 వాహనాలను స్వాధీనం చేసుకొని సంబంధిత కేసులు నమోదు చేస్తున్నారు.శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ,అనుమానితుల గుర్తింపు,అక్రమ కార్యకలాపాల అరికట్టడం లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టామని ఎస్పీ తెలిపారు.నేరచరిత్ర కలిగిన వ్యక్తులు,రౌడీషీటర్లు, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా పోలీసు శాఖ వెల్లడించింది.

# యూపీఎస్సీ-సీఎస్ఈ 2027కు మైనారిటీలకు ఉచిత కోచింగ్

**- దరఖాస్తులకు మే 31 తుది గడువు**

**- హైదరాబాద్‌లోని మైనారిటీస్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ.**

**- ప్రవేశ పరీక్ష జూన్ 14న నల్గొండ టీజీఎంఆర్ఈఐఎస్‌లో.**

నల్లగొండ జిల్లా బ్యూరో,మే 26,(డిజైన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్,మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ-సి ఎస్ ఈ 2027 పరీక్ష కోసం 2026-2027 విద్యా సంవత్సరంలో మైనారిటీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి టి.విజయేందర్ రెడ్డి తెలిపారు. ముస్లింలు ,క్రైస్తవులు, సిక్కులు, జైనులు,బౌద్ధులు,పార్సీలకు చెందిన మైనారిటీ అభ్యర్థులు ఈ ఉచిత కోచింగ్‌కు అర్హులు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన సాధారణ/ ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు,అన్ని రిజర్వ్ కేటగిరీలలో వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుంది. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి.ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుంది.ఆసక్తి గల అభ్యర్థులు https://cet.cgg.gov.in/tmreis వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.దరఖాస్తులకు చివరి తేదీ:31-05-2026,ప్రవేశ పరీక్ష తేదీ:14-06-2026. ప్రవేశ పరీక్ష నల్గొండ జిల్లాలోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ పాఠశాల పీజీ ఎంఆర్ఈఐఎస్ లో నిర్వహించబడుతుంది. అర్హులైన ఆసక్తి కలిగిన మైనారిటీ అభ్యర్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి టి.విజయేందర్ రెడ్డి కోరారు.

## నేడు ఢిల్లీకి తమిళనాడు సిఎం విజయ్

**ప్రధాని మోడీతే భేటీకి అవకాశం**

చెన్నై,మే26: తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ బుధవారం ఢిల్లీ పర్యటన చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోడీని కలిసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించారు. బుధవారం ఉదయం సీనియర్ అధికారులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో సహా విజయ్ ఢిల్లీకి చేరుకోనున్నారు. అలాగే ఈ పర్యటనలో కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ, రాహుల్ గాంధీని ఆయన కలవనున్నారు. విజయ్ ముఖ్యమంత్రి అయ్యాక ఇదే తొలి పర్యటన కావడం గమనార్హం.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- కలెక్టర్ బి.చంద్రశేఖర్**

**- రెడ్‌క్రాస్ భవన్‌లో విద్యార్థులకు బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన.**

**- వృద్ధుల డే కేర్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్.**





ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, మే 26,(విజన్ ఆంధ్ర) : బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు బాలికల అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నల్గొండ పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో మహిళా,శిశు,దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల రహిత తెలంగాణ లక్ష్యంతో "బాల్య వివాహ నిషేధ చట్టం-2006"పై విద్యార్థులకు ఉద్దేశించి నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని,బాల్య వివాహాలను అరికట్టేందుకు విద్యార్థులు చైతన్యవంతంగా వ్యవహరించాలని అన్నారు. బాల్య వివాహాల వల్ల ఎంతోమంది బాలికల జీవితాలు దెబ్బతింటున్నాయని, కుటుంబాల్లో ఆవేదన మిగులుతున్నదని తెలిపారు. విద్యార్థులు తమ ప్రాంతాల్లో జరిగే బాల్య వివాహాలపై పోలీసులు లేదా అధికారులకు సమాచారం అందించాలని,బాలికలు సంఘాలుగా ఏర్పడి తమ సమస్యలను పంచుకోవాలని సూచించారు.బాల్య వివాహాలను అరికట్టడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న వెల్ఫేర్ వీక్ ద్వారా పిల్లలకు అనేక అవకాశాలు కల్పిస్తున్నదని,ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని చెప్పారు.విద్యార్థులు సోషల్ మీడియాను అతి మోతాదులో ఉపయోగించకుండా జాగ్రత్తగా ఉండాలని,ఏఐ ఫోటో మార్ఫింగ్ వంటి సైబర్ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం ఎంతో ముఖ్యమని, సమాజంలో తలెత్తుకుని జీవించేలా వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.బాలికల సమస్యలపై ప్రతి నెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రణామం వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సందర్శించి అక్కడి వృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.వృద్ధులు క్యారంస్ ఆడుతుండగా వారితో ఆప్యాయంగా ముచ్చటించారు.ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అనవసరంగా బయట తిరగవద్దని సూచించారు.అవగాహన కార్యక్రమానికి రెడ్‌క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సీడీపీవో లావణ్య,సీడబ్ల్యూసీ చైర్మన్ చింత కృష్ణయ్య,సీడబ్ల్యూసీ సభ్యులు భాస్కర్ వెంకన్న,డీసీపీవో గణేష్ హాజరయ్యారు.



# ఓపెన్‌కాస్ట్‌ల వేడి...

- అడవులు మాయం... ఎండలు భయం..
- ప్రకృతిని కోల్పోయిన కొత్తగూడెం...
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజల ఆందోళన
- అడవులు ఉంటేనే వానలు... చెట్లు ఉంటేనే చల్లదనం.

# కొత్తగూడెం మీద భానుడి దాడి..!




కొత్తగూడెం బ్యూరో మే 27( విజన్ ఆంధ్ర)

**ఒకప్పుడు పచ్చని అడవులు, కొండలు, గనుల ప్రాంతాల మధ్య చల్లని వాతావరణంతో గుర్తింపు పొందిన కొత్తగూడెం ఇప్పుడు మండుతున్న ఎండలతో అల్లాడుతోంది. గతంలో వేసవి కాలంలో కూడా అంతగా అనిపించని వేడి ఇప్పుడు ఉదయం నుంచే భానుడు భగభగమంటూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. ఒకప్పుడు సాయంత్రం వేళల్లో చల్లని గాలులు వీచిన ప్రాంతాల్లో ఇప్పుడు రాత్రి వేళల్లో కూడా ఉక్కపోత తగ్గడం లేదు. "ఇంత వేడి కొత్తగూడెంలో ఎప్పుడూ చూడలేదు" అని పెద్దవారు చెబుతుండగా, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంతో పోలిస్తే ఉష్ణోగ్రతలు పెరగడం వెనుక పలు కారణాలు ఉన్నాయని స్థానికులు, పర్యావరణ ప్రేమికులు, సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రకృతి సమతుల్యత దెబ్బతినడమే ప్రధాన కారణమని చెబుతున్నారు.**

### భూగర్భ గనుల స్థానంలో ఓపెన్‌కాస్ట్ విస్తరణ సింగరేణి

ప్రాంతాల్లో ఒకప్పుడు ఎక్కువగా భూగర్భ గనులే ఉండేవి. భూమి అడుగున బొగ్గు తవ్వకాల వల్ల పైభాగంలో పచ్చదనం కొంతవరకు కొనసాగేది. కానీ కాలక్రమేణా భూగర్భ గనులను మూసివేసి, వాటి స్థానంలో భారీ స్థాయిలో ఓపెన్‌కాస్ట్ గనులు ప్రారంభమయ్యాయి. ఓపెన్‌కాస్ట్ గనుల కోసం వందల ఎకరాల అడవులను తొలగించడం జరిగింది. భారీ యంత్రాలతో భూమిని పూర్తిగా తవ్వేయడం వల్ల సహజ వాతావరణం దెబ్బతింది. ముందుగా చెట్లు, మట్టి, పచ్చిక బయళ్లు ఉండే ప్రాంతాలు ఇప్పుడు ఎండిన రాళ్లు, బొగ్గు దుమ్ము, బహిరంగ గుంతలుగా మారిపోయాయి. దీంతో భూమి వేడిని ఎక్కువగా గ్రహించి తిరిగి వాతావరణంలోకి విడుదల చేస్తోందని నిపుణులు చెబుతున్నారు.

### చెట్ల నరికివేత... కానీ పునర్వనీకరణ ఎక్కడ..?

ఓపెన్‌కాస్ట్ గనుల కోసం పెద్దఎత్తున చెట్లు నరికివేయడం జరిగింది. కానీ నరికిన చెట్లకు ప్రత్యామ్నాయంగా అదే స్థాయిలో పునర్వనీకరణ జరగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక పెద్ద చెట్టు వందల లీటర్ల నీటిని భూమిలో నిల్వ ఉంచడమే కాకుండా పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చెట్లు కార్బన్‌డైఆక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్ విడుదల చేస్తాయి. అలాంటి చెట్లు తగ్గిపోవడంతో సహజ శీతలీకరణ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. ఇప్పటివరకు అడవులతో నిండిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత తక్కువగా ఉండేది. ఇప్పుడు అదే ప్రాంతాల్లో రహదారులు, మట్టి గుట్టలు, ఓపెన్ మైన్స్ మాత్రమే కనిపిస్తున్నాయి. చెట్లు లేకపోవడంతో వర్షపాతం కూడా తగ్గుతోందని ప్రజలు చెబుతున్నారు.

### సోలార్ ప్లాంట్ల ప్రభావం పై చర్చ

పర్యావరణానికి మేలు చేస్తాయని భావిస్తూ ప్రస్తుతం సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. రామవరం నుండి రుద్రంపూర్ వరకు అనేక ప్రాంతాల్లో భారీ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు కావడం గమనించవచ్చు. అయితే ఈ ప్లాంట్ల ప్రభావంపై కూడా స్థానికుల్లో చర్చ మొదలైంది. వేల ఎకరాల్లో భూమిని సమతలీకరించి, అక్కడ ఉన్న చెట్లు తొలగించి సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేయడం వల్ల సహజ ఉష్ణ సమతుల్యత మారుతోందని కొందరు అభిప్రాయపడుతున్నారు. సోలార్ ప్యానెల్లు సూర్యకాంతిని గ్రహించి విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి. అయితే పెద్దఎత్తున ప్యానెల్లు ఒకేచోట ఉండడం వల్ల పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలపై ప్రభావం ఉండొచ్చని కొంతమంది నిపుణులు చెబుతున్నారు. దీనిపై పూర్తి స్థాయి శాస్త్రీయ అధ్యయనం అవసరమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### వెంచర్ల పేరుతో మాయమవుతున్న పొలాలు

ఒకప్పుడు కొత్తగూడెం చుట్టుపక్కల ప్రాంతాల్లో పచ్చని పొలాలు, చెరువులు, తోటలు కనిపించేవి. ఇప్పుడు వాటి స్థానంలో వెంచర్లు, లేఅవుట్లు, కాంక్రీట్ నిర్మాణాలు పెరుగుతున్నాయి. వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారిపోవడంతో భూమి సహజ స్వభావం కోల్పోతోంది. పొలాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల పరిసర ప్రాంతాల్లో చల్లదనం ఉండేది. ఇప్పుడు అదే భూములపై కాంక్రీట్ నిర్మాణాలు రావడంతో వేడి మరింత పెరుగుతోంది. కాంక్రీట్ రోడ్లు, భవనాలు పగటి వేడిని ఎక్కువగా గ్రహించి రాత్రివేళల్లో విడుదల చేస్తాయి. దీంతో రాత్రి సమయంలో కూడా ఉక్కపోత తగ్గడం లేదు.

### తగ్గుతున్న వర్షాలు ఎండిపోతున్న భూమి

గతంతో పోలిస్తే కొత్తగూడెం ప్రాంతంలో వర్షపాతం కూడా తగ్గిందని ప్రజలు చెబుతున్నారు. అడవులు తగ్గిపోవడం, భూగర్భ జలాలు క్షీణించడం, చెరువులు కనుమరుగవడం వల్ల భూమిలో తేమ నిల్వ ఉండడం తగ్గిపోయింది. ఒకప్పుడు వేసవిలో కూడా చెరువులు, వాగులు కొంతవరకు నీటితో కనిపించేవి. ఇప్పుడు చాలా చోట్ల పూర్తిగా ఎండిపోతున్నాయి. భూమిలో తేమ లేకపోవడంతో వేడి మరింత ఎక్కువగా అనిపిస్తోంది.

### పెరుగుతున్న కాలుష్యం

సింగరేణి ప్రాంతాల్లో బొగ్గు రవాణా, భారీ వాహనాల రాకపోకలు, పరిశ్రమల కాలుష్యం కూడా వాతావరణ మార్పులకు కారణమవుతున్నాయని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. బొగ్గు దుమ్ము, పొగ, వాహనాల నుంచి వెలువడే కాలుష్య వాయువులు గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. గాలి కాలుష్యం పెరగడం వల్ల ఉష్ణోగ్రతల ప్రభావం మరింత తీవ్రంగా అనిపిస్తోందని అంటున్నారు. గ్లోబల్ వార్మింగ్ ప్రభావం కూడా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రభావం కూడా కొత్తగూడెం వంటి ప్రాంతాలపై పడుతోంది. ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రతి ఏడాది వేసవికాలం మరింత తీవ్రంగా మారుతోంది. ఇప్పటివరకు ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే కనిపించే ఎండలు ఇప్పుడు మార్చి నుంచే ప్రారంభమవుతున్నాయి. ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలకు చేరువ కావడం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది.

### ఇకనైనా మేల్కొనాలా..?

పర్యావరణాన్ని కాపాడకపోతే భవిష్యత్తులో పరిస్థితులు మరింత దారుణంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**భారీ స్థాయిలో మొక్కలు నాటడం**

**నరికిన చెట్లకు ప్రత్యామ్నాయంగా అడవుల పెంపకం**

**చెరువుల సంరక్షణ**

**పచ్చని ప్రాంతాల పరిరక్షణ**

**నియంత్రణలేని వెంచర్లపై కట్టడి**

**పరిశ్రమల కాలుష్య నియంత్రణ**

**వంటి చర్యలు అత్యవసరమని సూచిస్తున్నారు.**

"అడవులు ఉంటేనే వానలు... చెట్లు ఉంటేనే చల్లదనం..." అనే మాట ఇప్పుడు కొత్తగూడెం ప్రజలకు నిజంగా అర్థమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తు తరాలకు చల్లని కొత్తగూడెంను అందించగలమని పర్యావరణ ప్రేమికులు పిలుపునిస్తున్నారు.

## కుక్కలు, కోతులు పాల్వంచ కొత్తగూడెం లో పుష్కలం..

**- వీటి వలన అనేక ప్రమాదాలు, భయాందోళనలో ప్రజలు**

పాల్వంచ ప్రతినిధి మే 26(విజన్ ఆంధ్ర) : పిల్లల ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చూసాం ఇప్పుడు పెద్దలు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి దయచేసి స్థానిక కొత్తగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యే దయచేసి స్పందించగలరు ఈమధ్య కాలంలో కోతుల వీర విహార చేష్టల వలన 8వ డివిజన్ లో ప్రమాదాల పరిస్థితి నెలకొన్నది దయచేసి మున్సిపల్ కమిషనర్ మేయర్ డిప్యూటీ మేయర్ ప్రతి డివిజన్ కార్పొరేటర్ గారు స్పందించి అత్యంత అవసరం ఆయన ఈ సమస్య ను ప్రత్యేక దృష్టి తో పరిష్కారం చూపించాలని అని బాధితుల అందరి తరుపున కుంపటి శివ కోరుతూనారు.

## నిర్మల్ కవి బి. వెంకట్‌కు శతావధాన సాహితీ సన్మానం




హైదరాబాద్, మే 26, విజన్ ఆంధ్ర : నిర్మల్‌కు చెందిన ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత బి. వెంకట్ హైదరాబాదులో నిర్వహించిన "ఏకదిన సంపూర్ణ శతావధాన ప్రాశ్నిక సాహితీ సన్మానం" కార్యక్రమంలో సన్మానం అందుకున్నారు. ఈ సన్మానాన్ని దర్శనం పత్రిక సంపాదకులు మరుమాముల వెంకటరమణశర్మ, దత్తాత్రేయశర్మ, శ్యామలానంద ప్రసాద్ శర్మ, గౌరీశంకరశర్మ తదితరులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్ దత్తపది అంశంలో ప్రాశ్నికునిగా పాల్గొని యువతలో సంస్కృతి, సంస్కారం పరిరక్షణపై పద్యరూపంలో సందేశం ఇవ్వాలని కోరారు. సెయింట్ మార్క్స్ హైస్కూల్, నేరెడ్మెట్‌లో జరిగిన అవధాన శిబిరం సమాపన సందర్భంగా ఈ సన్మానం జరిగింది. శతావధాని ఉప్పలధడియం భరతశర్మ ఒకే రోజులో 100 ప్రశ్నలకు 100 పద్యాలతో శతావధానం చేసి విశేష ప్రతిభ కనబర్చారు. ఈ శిబిరంలో యువతకు అవధాన విద్యపై ఉచిత శిక్షణ కూడా అందించారు. వెంకట్‌కు జిల్లా కవులు, కళాకారులు అభినందనలు తెలిపారు.


## వడ్డెర సంఘం సభ్యులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తా

**- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హామీ**



మల్కాజిగిరి, మే 26, (విజన్ ఆంధ్ర): నేరేడ్మెట్ డివిజన్ ఆర్కేపురం లోని వడ్డెర సంఘం సభ్యులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటా యింపు,ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హామీనిచ్చా రు. మంగళవారం వడ్డెర సంఘం కులస్తులు, ఎమ్మెల్యే ను తన క్యాంపు కార్యాల యంలో మర్యాద పూర్వకం గా కలిసి తమ సమస్యలను వివరించారు.వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించాలని, అలాగే తమ కమ్యూనిటీ కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మించా లని కోరారు. దీనికి సాను కూలంగా స్పందించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..మీ సమస్య లను తాను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఇందుకు అవసరమైన ఆధారాలతో రావాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో వడ్డెర కుల సంఘం సభ్యులు నరసింహ, లక్ష్మణ్, సాంబరాజు, బీఆర్ఎస్ నాయకులు జీకే హనుమం తరావు, జెకే సాయిగౌడ్, శంకర్రావు, రాజేష్ గౌడ్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మల్కాజిగిరి నియోజకవర్గం మెంబర్షిప్ ఇన్‌చార్జ్‌గా నందికంటి శ్రీధర్ నియామకం



, అల్వాల్ మే 26, (విజన్ ఆంధ్ర): బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన మెంబర్షిప్ కార్యక్రమం మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఎంబీసి కార్పొరేషన్ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ నియమితులైనారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాజీ మంత్రి హరీష్ రావుని మర్యాద పూర్వకంగా కలసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియ వెంట వెంటనే పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,మే 26,(విజన్ ఆంధ్ర); జిల్లాలో ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా, నిరంతరాయంగా పూర్తి చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం లక్ష్మణచందా మండలంలోని తిరుపల్లి గ్రామంలోని గోదామును కలెక్టర్ సందర్శించి, ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న వరి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వెంట వెంటనే పూర్తి చేయాలని సూచించారు. గోదాం మొత్తం నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యం పరిమాణం, అన్లోడింగ్ కోసం వేచి ఉన్న ట్రాక్టర్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీల సంఖ్యపై ఆరా తీసి, అవసరమైతే మరింత మంది హమాలీలను నియమించి అన్లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. హమాలీలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్ సరిత, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

**-డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్**




విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : 99 ప్రజాపాలన ప్రణాళిక భాగంలో భాగంగా మెదక్ జిల్లాలను కలెక్టర్ కార్యాలయం నందు మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు బాల్య వివాహం బతుకు ఆగమని నినాదంతో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి యూనిసెఫ్ ప్రతినిధి డేవిడ్ రాజు బాల్యవివాల గురించి వాటి నివారించడంలో బాల్య వివాహ నిరోధక అధికారుల పాత్ర గురించి క్లుప్తంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అథితులు డి ఆర్ ఓ అంబదాస్ రాజేశ్వర్ ,డి ఆర్ డి ఏ , శ్రీనివాసరావు డి ఎం ఎచ్ ఓ శ్రీరామ్, డి పి ఓ , యాదయ్య నర్సాపూర్ మున్సిపల్ చర్మన్ విచ్చేసి మెదక్ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చి దిద్దాలని పిలుపునిచ్చారు.ఇంచార్జి జిల్లా సంక్షేమ అధికారి స్వరూప రాథోడ్ మాట్లాడుతూ.. బాల్య వివరాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యత వహించాలని , మెదక్ జిల్లాని బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని , ఒకవేళ బాల్య వివాహాలు జరిగితే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు మెడికల్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్లు పంచాయతీ సెక్రటరీలు ఏఎన్ఎం ఐసిపిఎస్ సిబ్బంది సిహెచ్ఎల్ సిబ్బంది హబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ విద్యార్థుల ధృవపత్రాల పరిశీలన

**- కళాశాల ప్రిన్సిపాల్ టి.రామ్ మోహన్**

గద్వాల మే 26(విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లాలోని గోనుపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2026 విద్యార్థుల ధృవపత్రాల పరిశీలన మే 29 నుండి జూన్ 1 వరకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.రామ్ మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.దపాలిసెట్-2026 ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కౌన్సిలింగ్‌కు హాజరుకావాలనుకునే విద్యార్థులు తప్పనిసరిగా ముందస్తుగా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు.మే 27 నుండి మే 31 వరకు మీ సేవ కేంద్రాలు,ఆన్‌లైన్ సెంటర్లు లేదా సొంత కంప్యూటర్ల ద్వారా అధికారిక వెబ్‌సైట్‌లో లాగిన్ అయి తమకు అనుకూలమైన తేదీ, సమయాన్ని ఎంపిక చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ ధృవపత్రాలతో పాటు తగినన్ని జిరాక్స్ ప్రతులను తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. తీసుకురావాల్సిన పత్రాలు: పాలిటెక్నిక్ హాల్ టికెట్ మరియు పాలిసెట్-2026 ర్యాంక్ కార్డు, పదవ తరగతి మార్కుల మెమో మరియు టీసీ,1వ తరగతి నుండి 10వ తరగతి వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు,2026 సంవత్సరానికి సంబంధించిన కుల మరియు ఆదాయ ధృవపత్రాలు,విద్యార్థి ఆధార్ కార్డు,ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ కింద దరఖాస్తు చేసుకున్న ఓసీ అభ్యర్థులు ఈడబ్ల్యుఎస్, ఆదాయ ధృవపత్రాలు సమర్పించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని సెమీకండక్టర్ టెక్నాలజీ,బయోటెక్నాలజీ,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,మెషిన్ లెర్నింగ్,ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ,సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ వంటి 10 కొత్త కోర్సులను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు.ఈ కొత్త కోర్సుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,000 అదనపు సీట్లు పెంచినట్లు తెలిపారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

## ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

- ప్రతి గింజను ప్రభుత్వం కొంటుంది..
- ఎప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నాం..
- 38,402 మంది రైతుల అకౌంట్లో 423,52 కోట్ల రూపాయలు జమ
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : ధాన్యం కొనుగోలు ఈరోజు వరకు 2,65,639.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ,54,885 మంది రైతుల నుండి కొనుగోలు చేసి 38,402 మంది రైతుల అకౌంట్లో 423,52 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు.. ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, 24 గంటల పాటు అధికారులు అందుబాటులో ఉంటూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని, జిల్లా యంత్రాంగం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నదని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై చర్యలు నిలిపివేయాలి.

**- మాజీ డిప్యూటీ స్పీకర్ . పద్మదేవేందర్ రెడ్డి..**



విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసనలు చేపడుతున్న మంత్రి, ఎమ్మెల్యేలకు ముందు రైతుల వడ్లు కొనుగోలు చేయాలని సూచించినందుకు ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై చర్యలు తీసుకోవడం అన్యాయమని మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి విమర్శించారు.కార్మికులకు ప్రజల పక్షాన మాట్లాడే హక్కు ఉందనే విషయాన్ని గుర్తించకుండా అధికారులు మూర్ఖంగా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు.పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలపై జగిత్యాలలో నిరసన చేపడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు "ముందు వడ్లు కొనండి" అని చెప్పినందుకు జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్ డ్రైవర్ అశోక్‌కు డ్యూటీకి రావద్దంటూ రిమూవల్ లెటర్ ఇవ్వడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. డ్రైవర్ అశోక్ తాను ఏ రాజకీయ పార్టీని లేదా నాయకుడిని విమర్శించలేదని, రైతుల సమస్యల గురించి మాత్రమే మాట్లాడానని స్పష్టం చేసినప్పటికీ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రిమూవల్ లెటర్ జారీ చేయడం కార్మిక హక్కుల ఉల్లంఘన కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలపై స్పందించడం ప్రతి ఉద్యోగి కనీస బాధ్యత అని పేర్కొన్నారు. రైతుల తరపున మాట్లాడిన డ్రైవర్ అశోక్‌ను అభినందిస్తున్నామని తెలిపారు. వెంటనే డ్రైవర్ అశోక్‌పై తీసుకున్న చర్యలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి, ఆర్టీసీ అధికారులను డిమాండ్ చేశారు.

# చర్ల ఏజెన్సీలో చిరుత మళ్ళీ దర్శనం

- గోదావరి తీరాన కనిపించినట్లు సమాచారం
- భయాందోళనలో స్థానికులు
- మండల కేంద్రానికి కూత వేటులోనే మరో మారు దర్శనం



చర్ల, మే 26 (విజన్ ఆంధ్ర): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల ఏజెన్సీ ప్రాంతంలో చిరుత పులి సంచారం స్థానికంగా తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే, గత గురువారం రాత్రి చర్ల మండలం సుబ్బంపేట పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై ఓ చిరుత పులి ప్రత్యక్షమైనదని, రహదారికి ఇరువైపులా దట్టమైన అటవీ ప్రాంతం ఉండటంతో, అడవిలోంచి వచ్చిన చిరుత రోడ్డు దాటుతుండగా అటుగా వెళ్తున్న వాహనదారులు చూసి ఒక్కసారిగా షాక్‌కు గురైన ఘటన మరువక ముందే మళ్లీ ప్రత్యక్షం అయిందని సోమవారం రాత్రి సుబ్బంపేట శివారులోని గోదావరి ఇసుక రాంప్-2 వద్దకు ఒక చిరుత వచ్చి నీళ్లు తాగడాన్ని అక్కడ పనిచేస్తున్న టిప్పర్ డ్రైవర్ రాము గమనించినట్లుగా ఆయన వెంటనే అప్రమత్తమై ఒడ్డుకు చేరుకుని స్థానికులను హెచ్చరించినట్లు మండల వ్యాప్తం గా కలకలం రేపుతుంది కొన్నేళ్ల క్రితం చర్ల మండలంలోని ఎదురు గుట్టల సమీపంలో ఇలాంటి క్రూర జంతువులు తరచూ కనిపించేవని, కాలక్రమేణా అవి తగ్గిపోయాయని స్థానికులు చెబుతున్నారు, అయితే, సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ ఇప్పుడు సుబ్బంపేట పరిధిలో చిరుత కనిపించడంతో చర్ల ఏజెన్సీ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు, మండల కేంద్రానికి కూతవేటు లోనే రెండు సార్లు ఈ పులి సంచారం జరగడంతో ఈ సమాచారం చుట్టుపక్కల గ్రామాల్లో వేగంగా వ్యాపించడంతో ప్రజలు భయాందోళనలకు లోనవుతున్నారు

**అటవీ శాఖ అధికారుల హెచ్చరిక**

చిరుత సంచారం నేపథ్యంలో అటవీ శాఖ మరియు స్థానిక అధికారులు స్పందిస్తూ ప్రజలకు పలు జాగ్రత్తలు సూచించారు, పులి సంచరిస్తుందని చాటింపు ప్రకటించారు , రాత్రి సమయాల్లో ఆయా రహదారులపై ఎవరూ ఒంటరిగా, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించవద్దని కోరారు, అత్యవసరమైతే తప్ప చీకటి పడిన తర్వాత అటవీ ప్రాంత రోడ్లపైకి రావద్దని, సమూహాలుగా వెళ్లాలని సూచించారు, అటవీ సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు, పశువుల కాపరులు పగటిపూట కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు, పులి అడుగుల గుర్తులను గుర్తించామని అటవీశాఖ అధికారులు చెప్పుకొచ్చారు, ప్రస్తుతం అధికారులు ఈ ప్రాంతంలో నిఘా పెంచారు, పులి కంట పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పులికి ఎటువంటి హాని కలిగించకుండా ఉండాలని , స్థానికులు అప్రమత్తంగా ఉంటూ అటవీ శాఖ అధికారులకు సహకరించాలని కోరుతున్నారు.

# విదేశీ వాణిజ్యాన్ని అందిపుచ్చుకునేలా రైతులకు తోడ్పాటును అందించాలి

- వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధికారులను కోరిన కలెక్టర్ ఇలా త్రిపాఠి
- కలెక్టరేట్‌లో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం




నిజామాబాద్, మే 26 :( విజన్ ఆంధ్ర ) వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లా రైతాంగానికి మరింత ప్రయోజనం కలిగేలా వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా తోడ్పాటును అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను కోరారు. జిల్లా రైతాంగం తమ వ్యవసాయ ఉత్పత్తులను దేశ, విదేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్యపరంగా వారికి అనుసంధానం ఏర్పరచాలని అభిలషించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ(డీ.జీ.ఎఫ్.టీ), ఎ.పీ.ఈ.డీ.ఎ, జాతీయ పసుపు బోర్డు, నాబార్డు, ఇండియా పోస్ట్ ల సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. నూతన ఎగుమతిదారులను ప్రోత్సహించడం, ఎం.ఎస్.ఎం.ఈల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, జిల్లాల స్థాయిలో ఎగుమతులను గణనీయంగా పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ-కామర్స్ ఎగుమతుల ప్రదర్శన, ట్రేడ్ కనెక్ట్ పోర్టల్, పసుపు, వరి, సోయాబీన్, మొక్కజొన్న, పత్తి తదితర పంటల మార్కెట్ వైవిధ్యీకరణ అంశాలపై డీ.జీ.ఎఫ్.టీ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు విచ్చేసి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన, అధిక దిగుబడులను అందించే పంటల సాగు, సస్య రక్షణ చర్యలు, పంట ఉత్పత్తుల మార్కెటింగ్, విదేశాలకు ఎగుమతులు, ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం, సాగు నీటి యాజమాన్య పద్ధతులు తదితర అంశాల గురించి వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా రైతాంగం సేద్యపు రంగంలో ఆధునిక విధానాలు, శాస్త్రీయ పద్ధతులను అవలంభిస్తూ ఆదర్శ రైతులుగా పేరు పొందారని అన్నారు. ముఖ్యంగా ఆర్మూర్ ప్రాంత రైతులు అత్యధిక విస్తీర్ణంలో పసుపు సాగు చేస్తారని, వ్యవసాయ ఉత్పత్తులు, నూతన వంగడాల విషయంలో అంకాపూర్ ప్రాంత రైతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా రైతాంగానికి ఆధునిక పద్ధతులలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ, విదేశీ వాణిజ్యంతో అనుసంధానం కలిగిస్తే ఈ ప్రాంత రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ ఆకాంక్షించారు. పురాతన, సంప్రదాయ పద్ధతుల స్థానంలో ఆధునిక సాగు విధానాలను తెలియజేయడం, కూలీల కొరతను అధిగమించేందుకు వీలుగా యంత్రీకరణను వినియోగిం చడం, మార్కెటింగ్ మెలుకువలు, పసుపు పంట నాణ్యతను పెంపొందించే ప్రాసెసింగ్ విధానాలపై తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. ఈ దిశగా నిజామాబాద్ జిల్లాను ఎగుమతి కేంద్రంగా ప్రకటిస్తూ, పసుపు, వరి రైతులకు అవగాహన పెంపొందించేందుకు వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించడం ఈ ప్రాంత రైతాంగానికి మేలు చేకూరుస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. డీ.జీ.ఎఫ్.టీ ప్రాంతీయ సంచాలకులు ఎస్.ఎ.చవాన్ మాట్లాడుతూ, రైతులు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని అన్నారు. అప్పుడే వారికి గణనీయమైన లాభాలు సమకూరడంతో పాటు విదేశీ మారకద్రవ్యం పెరిగి రూపాయి మారకం బలపడుతుందని, ఇది ఒక రకంగా దేశానికి సేవ చేసినట్లు అవుతుందని సూచించారు. ప్రస్తుతం తెలంగాణ నుండి ఔషధాలు, ఇంజినీరింగ్ విడి భాగాలు ఎక్కువగా విదేశాలకు ఎగుమతి జరుగుతున్నాయని, ఇదే కోవలో పసుపు, వరి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను కూడా అధిక మొత్తంలో ఎగుమతి చేయవచ్చని అన్నారు. ఫారిన్ ట్రేడ్ పాలసీని అనుసరిస్తూ విదేశీ ఎగుమతులకు ప్రభుత్వం తగిన రాయితీలు వర్తింపజేస్తూ, అనేక విధాలుగా ప్రోత్సహిస్తోందని అన్నారు. నేటి పరిస్థితుల్లో ఈ-కామర్స్ ప్రాధాన్యతను గుర్తెరిగి, అవగాహనను పెంపొందించుకోవాలని, తద్వారా తాము ఉంటున్న ప్రాంతం నుండే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ఉత్పత్తుల ఎగుమతులు, వ్యాపార లావాదేవీలు జరపవచ్చని సూచించారు. డీ.జీ.ఎఫ్.టీ ద్వారా జిల్లా రైతాంగానికి తగిన తోడ్పాటు అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు అధికారులు కేవీఎస్.శైలజ, ప్రత్యూష్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు విద్య, కే.జనార్ధన్ రెడ్డి, ఎ.పీ.ఈ.డీ.ఎ అధికారి నాయుడు, నాబార్డు డీ.జీ.ఎం ఎస్.ప్రవీణ్ కుమార్, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

# కేటీఆర్ గులాబీ అద్దాలు తీసి చూడాలి

- కాంగ్రెస్ నేత జెన్న రాజు సవాల్
- ఇందిరమ్మ ఇళ్లపై అబద్ధపు ప్రచారం చేయొద్దు...
- మా బస్తీకి వస్తే అసలు పరిస్థితి తెలుస్తుందంటూ హెచ్చరిక...



బోడుప్పల్, మే 26(విజన్ ఆంధ్ర) : ప్రతి పేదవాడి స్వంత ఇంటి కలను నెరవేర్చేందుకు ప్రజా పాలన సర్కార్ కట్టుబడి ఉండగా, ఆ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అబద్ధపు ప్రచారం చేస్తూ ఉన్నారని కాంగ్రెస్ నేత జెన్న రాజు ఆరోపించారు. మంగళవారం బోడుప్పల్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పేదల స్వంతింటి కలను నెరవేర్చే ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గానికి తొలి విడతగా మూడు వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరుస చేసినట్టు జెన్న రాజు తెలిపారు. ఇప్పటికే అనేక ఇండ్లు పూర్తయి, లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకుని సంతోషంగా నివాసం ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు.ఇలాంటి పరిస్థితుల్లోనూ కేటీఆర్ నిజాన్ని ఒప్పుకోలేక అబద్ధాల ప్రచారానికి దిగుతున్నారని జెన్న రాజు విమర్శించారు. "నీకు ఇందిరమ్మ ఇండ్లు ఎక్కడ ఉన్నాయో అను మానం ఉంటే ఒకసారి బోడుప్పల్ సర్కిల్‌కి రా, మా దేవేందర్ నగర్‌లో నిర్మించుకున్న, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను దగ్గరుండి చూపిస్తాం" అంటూ ఆయన సవాల్ విసిరారు.అధికారాన్ని కోల్పోయిన నిరాశలో కేటీఆర్ నోటికి ఏది వచ్చినదో అదే మాట్లాడుతుండటం వల్ల తన రాజకీయ విలువను తానే కోల్పోతున్నాడని జెన్న రాజు ఎద్దేవా చేశారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష నేతగా ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంలో తప్పు లేదని, అయితే పదే పదే అబద్ధాలను నిజాలుగా చూపించి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తే మరోసారి ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# బక్రీద్ పండుగ నేపథ్యంలో సమన్వయ సమావేశం నిర్వహించిన సైబరాబాద్ సీపీ



శేరిలింగంపల్లి. మే 26:( విజన్ ఆంధ్ర) : రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా పండుగను ప్రశాంతంగా, పరిశుభ్రంగా నిర్వహించేందుకు సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ ఆధ్వర్యంలో సీఎంసీ, రెవెన్యూ, వెటర్నరీ శాఖ అధికారులతో మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ పోలీస్ అధికారులు, ఎస్‌హెచ్‌వోలు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా పరిశుభ్రత, ప్రజారోగ్యం, జంతు వ్యర్థాల సక్రమ నిర్వహణపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈద్‌గాహ్‌లు, మసీదులు మరియు నివాస ప్రాంతాల వద్ద జంతు వ్యర్థాల సేకరణ కోసం మందమైన నల్ల పాలిథిన్ కవర్లు అందుబాటులో ఉంచడం, వ్యర్థాల తరలింపుకు తగిన వాహనాలను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అధికారులు చర్చించారు. అలాగే రోడ్లు, ప్రజా ప్రదేశాల శుభ్రత కోసం తగినన్ని వాటర్ ట్యాంకర్లు, పారిశుధ్య సిబ్బందిని నియమించడం, అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ వినియోగించడం ద్వారా దుర్వాసన నివారణతో పాటు పరిశుభ్రతను కాపాడాలని సూచించారు. లిసైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, ఐపీఎస్ మాట్లాడుతూ,లి బక్రీద్ పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. పండుగ సందర్భంగా పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఈద్‌గాహ్‌లు, మసీదులు, నివాస ప్రాంతాల వద్ద జంతు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా అధికారులు సూచించిన విధంగా పాలిథిన్ కవర్లలో సేకరించాలని తెలిపారు. వ్యర్థాల తొలగింపు, రోడ్ల శు భ్రత, పారిశుధ్య నిర్వహణ కోసం సీఎంసీ, రెవెన్యూ, వెటర్నరీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పండుగ సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య సిబ్బంది, వాటర్ ట్యాంకర్లు, వ్యర్థాల తరలింపు వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ వినియోగించి పరిశుభ్రతను కాపాడాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రజలు కూడా పోలీసులకు, సంబంధిత శాఖల అధికారులకు సహకరించి పరిశుభ్రత, ప్రజారోగ్యం, సామరస్య వాతావరణాన్ని కాపాడాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం లో ఎస్ బి డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, సీ ఏ ఆర్ హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్ ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఐఐటీ జంక్షన్ వద్ద రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం రమేష్ ఐపీఎస్



శేరిలింగంపల్లి. మే 26 : (విజన్ ఆంధ్ర) : సైబరాబాద్ పోలీస్ కమిషనర్ గచ్చిబౌలి ఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఐటీ కారిడార్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మిస్తున్న మల్టీ లెవల్ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎంసి ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సైబరాబాద్ ట్రాఫిక్ విభాగ అధికారులు నిర్మాణ పనులు జరుగుతున్న తీరును సీపీ కు వివరించారు. జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించిన సీపీ, నిర్మాణ కాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే ముఖ్య ప్రాంతాల్లో సరైన సూచిక బోర్డులు, బ్యారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సిబ్బందిని అవసరమైన ప్రాంతాలులో నియమించాలని సూచించారు. ప్రాజెక్టు పనులు నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ పేర్కొన్నారు. ఈ సందర్శనలో సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, సిఎంసి ఇంజినీరింగ్ విభాగ అధికారులు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బాల్య వివాహం - బతుకు ఆగం.

- బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత
- ఎంఈఓ చిదిరాల సుధాకర్, ఎస్సై జి. అమూల్య.



భూపాలపల్లి జిల్లా (టేకుమట్ల) 26 మే (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలో ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా టేకుమట్ల జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో "బాల్య వివాహం బతుకు ఆగం" అనే అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ సరోజన అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యా అధికారి సుధాకర్, ఎస్సై అమూల్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తాయని, చిన్న వయస్సులో పెళ్లిళ్లు వారి విద్యను, ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని తెలిపారు. పిల్లలను పాఠశాలలోనే కొనసాగించడం ద్వారా వారి భవిష్యత్తు బాగుంటుందని సూచించారు. ఉమెన్ హబ్ జెండర్ స్పెషలిస్ట్ అనూష మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి వివరించి, సోషల్ మీడియా దుష్ప్రభావాలపై కూడా అవగాహన కల్పించారు. డిసిపియు సోషల్ వర్కర్ కుమార్ కేంద్ర ప్రభుత్వ మిషన్ వాత్సల్య పథకం, అక్రమ దత్తతలపై వివరాలు తెలియజేశారు. చైల్డ్ లైన్ ప్రతినిధి కళావతి ,18 సంవత్సరాల లోపు బాల్య వివాహం చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేసి, పిల్లలకు ఏవైనా సమస్యలు ఎదురైతే 1098 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల సర్పంచ్ మాట్ల శ్రీనివాస్, ఏపీఎం మంజుల, డీహెచ్‌డబ్ల్యూ అనూష, సఖి ప్రతినిధి మాధవి, చైల్డ్ లైన్ సభ్యులు, భరోసా సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, మహిళలు , బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్‌గా ఈరపోగు రాజ్‌కుమార్

- నియామక పత్రాన్ని అందజేసిన ఏఐసీసీ, టీపీసీసీ ఎస్సీ సెల్ ముఖ్య నాయకులు
- ఇచ్చిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తా రాజ్‌కుమార్



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 26 (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ పార్టీ నిబద్ధతతో, ప్రతి కోసం నిరంతరం పనిచేసే వారిని గుర్తించి, మరింత నమ్మకంతో బాధ్యత ఇచ్చిన పదవిని ఎక్కడ సొంత అవసరాలకు కాకుండా అనగారిన వర్గాల కోసం వారి అభ్యున్నతి కోసం, వాటి బలోపేతం కోసం పని చేస్తానని వనపర్తి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఈరపోగు రాజ్ కుమార్ అన్నారు. పదవి బాధ్యతలకు సంబంధించిన నియామక పత్రాన్ని ఏఐసిసి ఎస్సీ సెల్ చైర్మన్ రాజేందర్ పాల్ గౌతమ్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ నగరిగారి ప్రీతం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఈరపోగు రాజ్ కుమార్ మాట్లాడుతూ... సమాజంలోని అణగారిన వర్గాల, సమాజ హక్కుల సాధన కోసం కట్టుబడి పని చేస్తానని తెలిపారు. ఆయన పార్టీ కోసం కృషి చేసిన ప్రతిభను గుర్తించి సముచిత స్థానంతో గౌరవించడం చాలా సంతోషంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే తనపై విశ్వాసం ఉంచి పదవిని ఇచ్చినందుకుగాను వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి,రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ప్రతి నాయకుడికి కార్యకర్తలకు అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మండల సర్వేయర్




వడ్డేపల్లి మే 26( విజన్ ఆంధ్ర) : భూములకు సంబంధించి ఒక రైతుకు అనుకూలంగా సర్వే చేయడానికి లంచం డిమాండ్ చేసిన జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య మంగళవారం ఏసీబీ అధికారుల దాడిలో అడ్డంగా బుక్కయ్యారు.రూ. 20,000 డిమాండ్..మండలంలోని ఒక రైతుకు సంబంధించిన మొత్తం నాలుగు ఎకరాల పొలాన్ని సర్వే చేయడానికి ఎకరాకు రూ. 5,000 చొప్పున మొత్తం రూ. 20,000 ఇవ్వాలని సర్వేయర్ బ్రహ్మయ్య సదరు రైతుపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఇందులో భాగంగా రైతు నుంచి గతంలోనే అడ్వాన్సుగా రూ. 5,000లు తీసుకున్నారు. మిగిలిన పూర్తి డబ్బులు ఇస్తేనే పొలం సర్వే చేస్తానని, లేదంటే కుదరదని సర్వేయర్ మొండికేయడంతో విసిగిపోయిన బాధిత రైతు మహబూబ్ నగర్ అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ సారధ్యంలో ఏసీబీ బృందం పక్కా ప్రణాళికతో వడ్డేపల్లిలో నిఘా పెట్టింది. రైతు నుంచి సర్వేయర్ బ్రహ్మయ్య రూ. 10,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రసాయన పరీక్షలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు.

## మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2026 దరఖాస్తులకు ఆహ్వానం

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ,మే 26 (విజన్ ఆంధ్ర) : మహబూబ్‌నగర్ జిల్లా మహిళా, శిశు, వికలాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2026" కోసం అర్హులైన బాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు.ఈ అవార్డులు దేశవ్యాప్తంగా విశిష్ట ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రదానం చేయబడతాయి. ధైర్యసాహసాలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు-సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి ఆరు విభాగాల్లో అవార్డులు అందజేయనున్నారు.31 జూలై 2026 నాటికి 5 సంవత్సరాలు పూర్తి చేసి, 18 సంవత్సరాలు మించని భారతీయ పౌరులు ఈ అవార్డులకు అర్హులు. స్వయంగా దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఇతరులు కూడా ప్రతిభావంతులైన బాలలను నామినేట్ చేయవచ్చని అధికారులు వెల్లడించారు.ఆసక్తి గల వారు అధికారిక వెబ్‌సైట్ awards.gov.inAttachment.png ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తుల చివరి తేదీ 31 జూలై 2026 కాగా, దరఖాస్తు సమర్పించిన అనంతరం వచ్చే అక్‌నాలెడ్జ్‌మెంట్ ప్రతిని జిల్లా సంక్షేమ అధికారికి సమర్పించాలని తెలిపారు

## దత్తత ఉత్తర్వులు అందించిన జిల్లా కలెక్టర్




కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) మే 26.. హైదరాబాద్‌కు చెందిన దంపతులకు తోబుట్టువులైన పిల్లల దత్తతకు సంబంధించిన చట్టబద్ధమైన ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ శ్రీమతి చిత్రా మిశ్రా అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన విధానంలో దత్తత తీసుకోవాలని సూచించారు. దత్తత తీసుకోవాలనుకునే వారు పూర్తి సమాచారం కోసం జిల్లా పరిషత్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఎం. సరస్వతి, శిశుగృహ ఇన్‌చార్జ్ అపూర్వ,ఐసీపీఎస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# చేర్యాల పట్టణంలో సంస్కృతిక కళాకారులు జనగణన కార్యక్రమాన్ని పాటల రూపంలో వినిపించిన కళాకారులు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 26 మే : భారత జనగణన 2027 లో భాగంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ప్రధాన జనగణన అధికారి గారి ప్రత్యేక ఆదేశాలతో సమాచార పౌరసంబంధాల సమాచారశాఖఆధ్వర్యంలో మంగళవారం చేర్యాల పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ సాంస్కృతిక సారథి సిద్దిపేట జిల్లాకు చెందిన కళాకారులు ప్రజలకు జనగణన 2027 పై చైతన్యం చేయటం జరిగింది, మే 11 న జిల్లాలో జనగణన మొదలయ్యిందని జూన్ 9వరకు ఈ గణన కొనసాగుతుందని ప్రజలందరూ ఇంటికి వచ్చే ఎమ్యూనరేటర్ లకు సహకరించాలని పాటల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా హాజరైన చేర్యాల మున్సిపల్ చైర్పర్సన్ ముత్యాల అరుణ బాల్ నరసయ్య మాట్లాడుతూ ముందుగ ఇండ్ల లెక్కింపు చేస్తారని అనంతరం ప్రజల లెక్కింపు ఉంటుందని, ఇంటి వివరాలు, కుటుంబ వివరాలు, వృత్తి, వ్యాపారం, వంటి అంశాలపై అధికారులకు సహకరించి అడిగే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అందించాలని కోరారు. జనాభా వివరాలు పూర్తిగా తెలిస్తేనే జనాభా అవసరమైన స్థాయిలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపట్టేందుకు ప్రభుత్వానికివీలవుతుందని ప్రతి ఒకరు వారి కుటుంబ వివరాలను పూర్తిగా



ఎన్యుమరేటర్లకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మరియు సాంస్కృతిక సారధి కళాకారులు కళాంజలి రాజేష్, వెంకటాపురం రవి, దీకొండ భాస్కర్, ముదిగొండ నర్సింలు, పుల్లూరు యాదగిరి, వీరబత్తిని వెంకటేష్, మోతే బాబు, సడిమెల రాజమణి, బండ మంజుల, ఎల్లగారి శేఖర్, ఏర్పుల నర్సయ్య, కొమ్ము రవీందర్, నీరటి రవీందర్, కొమ్ముఎల్లయ్య ,వై.తిరుమలయ్య, భార్గవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు కొమురవెల్లి మండల కేంద్రంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు జన గణన 2027 పైఅవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో, డిప్యూటీ తాసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎదుల రిజర్వాయర్‌నుపరిశీలించిన మంత్రి జూపల్లి

## త్వరలో సీఎం పర్యటన నేపథ్యంలో ముమ్మర ఏర్పాట్లు



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 26 (విజన్ ఆంధ్ర) : పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు రంగారెడ్డి జిల్లాకు తాగు నీరు ఇచ్చేందుకు జూన్, మొదటి వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లా సందర్శించి సమీక్షించనున్న నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏదుల రిజర్వాయర్ ను సందర్శించి పరిశీలించారు. వనపర్తి జిల్లా శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, నాగర్ కర్నూల్ శాసన సభ్యులు కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట శాసన సభ్యులు వంశీకృష్ణ తో కలిసి ఎదుల రిజర్వాయర్ పంప్ హౌజ్ ను సందర్శించి ప్రస్తుత స్థితిగతులు, పూర్తి అయిన పనులను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ గురించి ఇరిగేషన్ ఎస్. ఈ పార్థసారథి వివరిస్తూ (5) స్టేజిలలో డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టు శ్రీశైలం ప్రాజెక్టు పారుతున్న నీటిని ఎత్తిపోతల ద్వారా నార్లపూర్ (అంజనగిరి) రిజర్వాయర్ లో నింపి అక్కడి నుండి ఎత్తిపోసి 6.55 టి.యం.సి. ల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఎదుల రిజర్వాయర్ నింపడం జరుగుతుందన్నారు. ఎదుల రిజర్వాయర్ నుండి వట్టెం, ఉదండపూర్, కే.పి. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ల ద్వారా ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు సాగు, తాగు నీరు అందించడం జరుగుతుందన్నారు. ఎదుల సర్జిపుల్ నుండి 134 మీటర్ల ఎత్తున ఉన్న రిజర్వాయర్ నింపడానికి 10 మోటార్లు ఏర్పాటు చేయడం జరిగిందని, రోజుకు రెండు టి.యం.సి ల నీటిని





ఎత్తిపోసేందుకు ఒక్కో పంపు 1.45 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉన్నట్లు తెలిపారు. సంవత్సరంలో 45 రోజుల పాటు 90 టి.యం.సి ల నీటిని ఎత్తిపోసేందుకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం జరిగిందని వివరించారు. మోటారు పంపుల సామర్థ్యం, వాటి ధర, మన్నిక తదితర విషయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటినీ వేగవంతంగా చేయడానికి, సమస్యల పరిష్కారం, అవాంతరాలను తొలగించడానికి ప్రాజెక్ట్ లను సందర్శించినట్లు చెప్పారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, వనపర్తి జిల్లా ఎస్పీ సునితా రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రాం సింగ్ పాటిల్, ఇరిగేషన్ ఎస్.ఈ పార్థసారథి, కార్యనిర్వహక ఇంజనీర్లు అమర్ సింగ్, రవీందర్, శ్రీనివాస్, వనపర్తి ఆర్డీఓ సుబ్రమణ్యం, కొల్లాపూర్ ఆర్డీఓ బన్సిలాల్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

# నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

**- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్**

**- ధాన్యం అన్‌లోడింగ్, అదనపు నిల్వ స్థలాలపై తనిఖీ**





వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 26 (విజన్ ఆంధ్ర) : కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు వస్తున్న ధాన్యం లారీలను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే అన్‌లోడింగ్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా, వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మంగళవారం పెబ్బేరు మరియు శ్రీరంగాపూర్ మండలాల పరిధిలోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంబాలపూర్, శ్రీరంగాపూర్, రంగాపూర్ మరియు పెబ్బేరు పరిసర ప్రాంతాల్లోని రైస్ మిల్లులను సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల నుండి వస్తున్న ధాన్యం లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం మరియు మిల్లుల్లో అదనపు నిల్వ స్థలం లభ్యతపై ఈ తనిఖీల్లో ప్రధానంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు వస్తున్న ధాన్యం లారీలను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే అన్‌లోడింగ్ చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ధాన్యం నిల్వకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మిల్లుల్లో అదనపు స్థలాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. లారీలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా, హమాలీలను పెంచి త్వరితగతిన అన్‌లోడింగ్ పూర్తి చేయాలన్నారు. మిల్లుల ఆవరణలో గోదాములు, ఖాళీ స్థలాలను పరిశీలించి, అదనపు ధాన్యం నిల్వ ఉంచేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ధాన్యం తరుగు, తూకం విషయంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా మిల్లర్లపై చర్యలు ఉంటాయని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్‌తో పాటు స్థానిక తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది మరియు రైస్ మిల్లుల యజమానులు ఉన్నారు.

# క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే ప్రమాదాలు దూరం

**- డాక్టర్ జి.దయాకర్ రావు**

**- లాపరోస్కోపిక్ అంకాలజీ సర్జరీతో అద్భుత ఫలితాలు**

**- వనపర్తి మహిళకు యశోద ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం**




వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 26 (విజన్ ఆంధ్ర) : అపెండిక్యులర్ మాస్, కోలన్ క్యాన్సర్ వంటి సమస్యలను ప్రారంభ దశలో గుర్తించి సరైన శస్త్రచికిత్స చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని మలక్ పేట యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ జి. దయాకర్ రావు చెప్పారు. అత్యాధునిక లాపరోస్కోపిక్, అంకాలజీ సర్జరీతో మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన వివరించారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎం వై ఎస్ బంకేట్ హాల్లో క్యాన్సర్ పై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. దయాకర్ రావు మాట్లాడుతూ అపెండి క్యులర్ మాస్తో కూడిన కొలన్ క్యాన్సర్ కు అరుదైన చికిత్స యశోద ఆసుపత్రిలో విజయవంతంగా జరిగిందని చెప్పారు. వనపర్తి జిల్లాకు చెందిన 51 ఏళ్ల సూగురు యాదమ్మ తీవ్రమైన కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డతో యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేరిందని, పరీక్షల్లో అపెండిక్యులర్ మాస్తో పాటు కోలన్ క్యాన్సర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారని చెప్పారు. కన్సల్టెంట్ జనరల్, లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ టి. సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రోగికి లాపరోస్కోపిక్ ఎక్స్ప్లోరేషన్, అడ్హీజి యోలిసిస్, ఒమెంటల్ బయాప్సీ నిర్వహించారని తెలిపారు. అనంతరం డాక్టర్ దయాకర్ రావు పర్యవేక్షణలో రైట్ హెమి కోలెక్టమీ,ఐలియో ట్రాన్స్వర్స్ అనాస్థమోషన్ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. పెద్దప్రేగు భాగంలో గడ్డతోపాటు చుట్టుపక్కల భాగాలకు అంటుకుపోయిన ఇన్ఫ్లమేటరీ మార్పులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారని చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం రోగికి యాంటీబయోటిక్స్, నొప్పి నివారణ చికిత్స, డయాబెటిస్ నియంత్రణ, ప్రత్యేక పర్యవేక్షణ అందించారన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం మెరుగుపడి స్థిరపడడంతో అవసరమైన సూచనలతో డిశ్చార్జ్ చేసినట్లు ఆయన తెలిపారు. అపెండిక్స్ లేదా పెద్ద ప్రేగుకు సంబంధించిన క్యాన్సర్ తో కూడిన అపెండిక్యూలర్ మాస్ అనేది క్లిష్టమైన ఉదర సంబంధిత వ్యాధి అని, కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డ, జీర్ణ సమస్యల వంటి లక్షణాలతో ఇది కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. సమయానికి గుర్తించకపోతే ఇన్ఫెక్షన్ వ్యాప్తి, ప్రేగు అవరోధం, క్యాన్సర్ ముదిరే ప్రమాదం ఉంటుందని, ముందస్తు నిర్ధారణ, అత్యధునిక పరీక్షలు, సకాలంలో శస్త్ర చికిత్స అత్యంత కీలకమని చెప్పారు. అపెండిక్యులర్ మాస్తో కూడిన కొలన్ క్యాన్సర్ను ప్రారంభ దశలో గుర్తించడం, అత్యాధునిక లాపరో స్కోపిక్ పరీక్షలు, బయాప్సీ కి ద్వారా ఖచ్చితమైన నిర్ధారణ చేయవచ్చన్నారు. క్లిష్టమైన కోలన్ క్యాన్సర్ కు విజయవంతమైన శస్త్ర చికిత్స నిర్వహణ, జీర్ణాశయ క్యాన్సర్కు మల్టీడిసిప్లినరీ వైద్య విధానానికి ప్రాముఖ్యత ఉంటుందని చెప్పారు. కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డ వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు పరీక్షలు అవసరమని అన్నారు. అత్యాధునిక గ్యాస్ట్రోఇంటెస్టినల్, సర్జికల్ ఆంకాలజీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కేసు మలక్పేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సర్జరీ, సర్జికల్ అంకిలజీ సేవలు, సమగ్ర వైద్య సదుపాయాలను మరోసారి ప్రతిభంబించిందని అన్నారు. అపెండిక్యులర్ మాస్తో కూడిన కొలన్ క్యాన్సర్ వంటి క్లిష్టమైన ఉదర సంబంధిత వ్యాధులను ప్రారంభ దశలోనే ఖచ్చితంగా నిర్ధారించి అత్యాదునిక లాపరోస్కోపిక్, ఆంకాలజీ శస్త్ర చికిత్సల ద్వారా విజయవంతంగా చికిత్స అందించడం ఆసుపత్రి నైపుణ్యాన్ని చాటిచెప్పిందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందం, మల్టీ డిసిప్లినరీ వైద్య విధానాలతో క్లిష్టమైన క్యాన్సర్, జీర్ణాశయ సంబంధిత వ్యాధులకు కూడా సమర్థవంతమైన చికిత్స అందించగల సామర్థ్యం తమ ఆసుపత్రికి ఉందని ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కే.శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర లు తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో సురక్షితమైన, నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలను అందించడంలో తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డీజీఎం లక్ష్మణా శ్రీకాంత్,ఏ.వాసు కిరణ్ రెడ్డి ఉన్నారు.

# విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ జి. కళార్చన**

**- వనపర్తి బాలికల జెడ్పీ హైస్కూల్ సమ్మర్ క్యాంప్‌లో చట్టాలపై అవగాహన సదస్సు**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 26 (విజన్ ఆంధ్ర) : విద్యార్థులు చదువుతో పాటు తమలోని ప్రతిభను గుర్తించి, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ జి. కళార్చన పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేసవి శిబిరం (సమ్మర్ క్యాంప్) విద్యార్థులకు మంగళవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జ్ కళార్చన మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచే దేశ చట్టాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో బాలికల రక్షణకు ఉన్న చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా పోక్సో చట్టం, బాల్యవివాహాల నిర్మూలన చట్టం, బాలకార్మిక నిర్మూలన చట్టాల గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. చిన్న పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్' (మంచి స్పర్శ – కీడు స్పర్శ) పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య వస్తే ధైర్యంగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, మోటార్ వాహనాల చట్టం పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, మహానంది (ఏ.ఎం.ఓ), పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఆర్ట్ టీచర్ నిరీష, సీ.ఎం.ఓ ప్రతాప్ రెడ్డి, స్కూల్ అసిస్టెంట్ మల్లేష్, బాల సదన్ ఇంచార్జ్ లావణ్యతో పాటు వేసవి శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు బూత్ లెవెల్ కమిటీలు చక్కగా పనిచేయాలి

**: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**



మల్కాజిగిరి, మే 26,(విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు బూత్ లెవెల్ కమిటీలు క్రమశిక్షణ పద్ధతిలో చక్కగా పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్ ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సూచించారు. సోమవారం మల్కాజిగిరి క్యాంప్ ఆఫీస్ లో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన, మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, ముఖ్య అతిథులుగా అనిల్ కుమార్ యాదవ్, రాజ్య సభ సభ్యులు మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, సమీర్ కౌశల్ టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ పరిశీలకులతో కలిసి హాజరై నారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. 'సర్' ప్రక్రియలో పాల్గొని ఓటర్లను గుర్తించాలని, అర్హులైన వారందరికీ ఓటు హక్కు పొందేలా చూడాల న్నారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర పాలనలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని సూచించారు. గత ప్రభుత్వాలకు ప్రస్తుతం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా తేడా ఉన్నదని ప్రజలు గుర్తించే విధంగా తెలియ జేయాలన్నారు. ఈ సమావేశంలో మల్కాజి గిరి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేందర్ నాథ్, టీపీసీసీ డెలిగేట్ సభ్యులు చంద్రశేఖర్, టిపిసిసికార్యదర్శి నిమ్మ అశోక్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, శేఖర్, 16 డివిజన్ల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్త లు, అభిమానులు, జిల్లా శాఖ కమిటీ సభ్య లు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం పెట్రోల్ డీజిల్ ధరలు పెంచుతున్న సందర్భం గా ఆనంద్ బాగ్ చౌరస్తాలో పెట్రోల్ డీజిల్ పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని నినా దాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్నం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకు లు సిరిగిరి నర్సింగ్ రావు,లక్ష్మీకాంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బి కే శ్రీనివాస్, సతీష్ కుమార్,పిట్టల శ్రీనివాస్,జీవన్ రెడ్డి, జీడి సంపత్ గౌడ్, వినోద్ కుమార్ వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, యూసుఫ్ భాయ్, ఎస్ ఆర్ ప్రసాద్, బాబు, సత్యనారాయణ, సంతోష్ రాందాస్, మోతే సాయికుమార్, సయ్యద్ మబ్బు,ఫరీద్ భాయ్, ప్రభా,ఆశా, ఇందిర ప్రియదర్శిని,శారద, బాల్ రాజ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు

# పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలి

**- ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**- కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ నిరసన**

**- వనపర్తి జిల్లా కేంద్రంలో ఎద్దుల బండ్లతో భారీ ప్రదర్శన**








వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 26 (విజన్ ఆంధ్ర) : గత నాలుగు రోజులుగా వరుసగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు నిరసనగా మంగళవారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఎద్దుల బండ్లతో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెంచిన ఇంధన ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలోని ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అబద్ధాలు చెప్పి, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. గద్దెనెక్కిన వెంటనే వరుసగా నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపారని ధ్వజమెత్తారు. "కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడం కోసమే కేంద్ర ప్రభుత్వం సామాన్యుల నడుం విరుస్తోంది. దేశంలో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో సామాన్య ప్రజల బతుకులు రోడ్డున పడ్డాయి అని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. తక్షణమే ప్రధానమంత్రి స్పందించి పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించకుంటే రాబోయే రోజుల్లో మండల స్థాయిలో కూడా పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ధరలు దిగివచ్చేంత వరకు కాంగ్రెస్ పార్టీ తరపున పోరాటాలు ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు శివసేనా రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెట్రోల్, డిజిల్ పెంపుపై భగ్గుమన్న ఆర్.ఎస్.పి.

**- ఆటోకు తాడు కట్టి లాగుతూ వినూత్న నిరసన.**



నిజామాబాద్ మే26:( విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆటోకు తాడు కట్టి లాగుతూ వినూత్న నిరసన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్పీ జిల్లా కన్వీనర్ కటారి రాములు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వరుసగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంచడమే కాకుండా, గత పది రోజుల వ్యవధిలోనే పెట్రోల్‌పై మొత్తం రూ.8.23, డీజిల్‌పై రూ.8.12 వరకు ధరలు పెంచడం ప్రజలపై తీవ్రమైన భారంగా మారిందన్నారు. దేశంలో ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్న సమయంలో ఇంధన ధరల పెంపు కారణంగా రవాణా రంగం పూర్తిగా దెబ్బతింటోందన్నారు. ముఖ్యంగా ఆటో కార్మికులు, చిన్న వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో నడిపే కార్మికులకు వచ్చే ఆదాయం మొత్తం పెట్రోల్, డీజిల్ ఖర్చులకే సరిపోతుందని, కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, గోపాల్ సింగ్ ఠాగూర్, సునిల్, ఆటో కార్మికులు,నిజాముద్దీన్, పండరి, ఇర్ఫాన్, హైమద్, కృష్ణ, అక్రమ్ ఖన్, జవిద్, కిషన్, శీను, సర్యపల్ ముజు, అశ్రఫ్, నంద సాయి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం వేగంగా అన్లోడింగ్

**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : ధాన్యాన్ని వేగంగా అన్లోడింగ్ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మిల్లర్లకు సూచించారు. మంగళవారం తూప్రాన్ మండలంలోని నవదుర్గ రైస్ మిల్ ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ధాన్యాన్ని త్వరగా అన్లోడింగ్ చేయాలని, హమాలి, లారీలను అందుబాటులో ఉంచుకోవాలని మిల్లర్లకు సూచించారు. అన్లోడింగ్ ఆలస్యం జరగకుండా మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్లోడింగ్ లో హమాలీని షిఫ్ట్ ల ప్రకారం పని చేయించాలన్నారు. తూప్రాన్ గ్రామ శివారులో వరి ధాన్యం కొనుగోలు , నిల్వ కోసం ఏర్పాటు చేసిన ప్రైవేట్ గిడ్డంగిని పరిశీలించారు. తూప్రాన్, వర్గల్ శివంపేట మండలాల నుండి సేకరించిన వరి ధాన్యాన్ని ఈ గిడ్డంగిలో నిల్వ చేయనున్నట్లు తెలిపారు. గిడ్డంగిలోని నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సౌకర్యాలు ,భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయా చంద్రారెడ్డి,డీఎం సివిల్ సప్లై అధికారులు, మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# చిన్నకోడూరు మండలలో వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి26 మే : సిద్దిపేట జిల్లాలో అకాల వడగండ్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిందని, అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు యుద్ధప్రాతికన లిఫ్ట్ చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం చిన్నకోడూరు మండలంలోని ఆధునిక వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం మరియు జిల్లా కేంద్రంలోని ఆధునిక వ్యవసాయ మార్కెట్ కమిటీ లో కొనుగోలు మరియు దిగుమతి ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలోపరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతుందని, కానీ జిల్లాలో వాతావరణ శాఖ అకాల, వడగండ్ల వానలు కురిసే ఆస్కారం ఉన్నట్లు హెచ్చరికలు జారీచేసిందని వడగండ్ల వాన కురిసే అవకాశం ఉందని కొనుగోలు వేగవంతం చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఏఎంసి లలో ప్రస్తుతానికి ఉన్న ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేసి స్థానిక గోదాం లో దిగుమతి చెయ్యాలని ఆదేశించారు. చిన్నకోడూరు ఏఎంసి వద్ద రోడ్లపైన ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే గన్నీలలో నింపి లిఫ్ట్ చేసేందుకు రెడీ గా ఉండాలని తెలిపారు. చిన్నకొడూరు గ్రామంలో ఎక్కువ మొత్తంలో ధాన్యం ఉన్నందున గోదాం లో దిగుమతికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఎత్తు ప్రాంతాల్లో ధాన్యంన్నీ ఉంచి టర్పాలిన్ కప్పాలని, అకాల వర్షాల వరదలలో ధాన్యం కొట్టుకుపోకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లారైతాంగానిక ి సూచించారు. వరి, మక్కలు కొనుగోలు ఒకే సారీ చేయడం మూలంగా హమాలీ, లారీల కొరత ఏర్పడిన ఒక్కొక్కటిగా ఒక ప్రణాళిక ప్రకారం కొనుగోలు వేగవంతం చేస్తున్నామని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం సన్ ఫ్లవర్ సైతం కొనుగోలుకుఅనుమతినిచ్చింది కావున పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని రైతులు సంయమనం పాటిస్తూ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నాయకపోడు యువ కళాకారుడు "కొత్త రేవంత్కు" సీసీఆర్టీఈ స్కాలర్షిప్ మంజూరు.



ములుగు మే 26; విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా పట్టణ కేంద్రానికి చెందిన నాయకపోడు గిరిజన యువ కళాకారుడు కొత్త రేవంత్ ప్రతిష్ఠాత్మకమైన సీసీఆర్టీ స్కాలర్షిప్ 202526 కు ఎంపికయ్యారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే "యువ కళాకారులకు వివిధ సాంస్కృతిక రంగాలలో స్కాలర్షిప్ పథకం" కింద ఈ గుర్తింపు లభించింది. ప్రస్తుతం హైదరాబాద్లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఎఫ్ఏ (పెయింటింగ్) చదువుతున్న రేవంత్, నాయకపోడు గిరిజన కళా సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్నారు. స్కాలర్షిప్ ప్రాజెక్ట్లో భాగంగా ఆయన "నాయకపోడు సంప్రదాయ చెక్క మాస్క్ కళ పునరుద్ధరణ" పై రెండేళ్ల ప్రాజెక్ట్ను ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్ట్లో పాండవులు, పోతురాజు, లక్ష్మీ దేవర , ఇతర సంప్రదాయ గిరిజన దైవాలకు సంబంధించిన చెక్క మాస్క్ల తయారీ, వాటి డాక్యుమెంటేషన్, సంప్రదాయ రంగుల వినియోగం, గిరిజన యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలు ఉన్నాయి. అలాగే నాయకపోడు గిరిజన కళా వారసత్వాన్ని సంరక్షిస్తూ, సమకాలీన కళా రూపాల ద్వారా సమాజానికి పరిచయం చేయడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశ్యంగా రేవంత్ తెలిపారు. సీసీఆర్టీఈ స్కాలర్షిప్కు ఎంపిక కావడంతో విశ్వవిద్యాలయ యాజమాన్యం, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు స్నేహితులు రేవంత్ను అభినందించారు.

# బోడేపల్లిలో ఘనంగా భీమన్న దేవుని ఊరేగింపు

**- మూడేళ్ల కొకసారి వచ్చే పండగ.**



కాగజ్నగర్ ,,మే 26, (విజన్ ఆంధ్ర) : కొమరం భీం అసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మండలంలోని బోడేపల్లి గ్రామంలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి వచ్చే భీమన్న దేవుని మొక్కుల పండగ ఈసారి కూడా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం గ్రామస్తులకు కేవలం పండగ మాత్రమే కాదు, నమ్మకానికి, ఆరాధనకు సజీవ నిదర్శనం. భీమన్న దేవుని ఊరేగింపు రోజున గ్రామమంతా పండుగ వాతావరణం సంతరించుకుంటుంది. తాతలు, తండ్రులు పాటించిన ఆచారాన్ని ఈ తరం కూడా అదే భక్తితో కొనసాగిస్తోంది.ఉదయం నుంచే గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు బోడేపల్లికి తరలివచ్చారు. డప్పులు, భజనల మధ్య భీమన్న దేవుని ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు గంగ స్నానం ఆచరించి, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.మా ఇంట్లో పిల్లలకు మంచి జరగాలని, పంటలు పండాలని ప్రతి మూడు ఏళ్లకోసారి భీమన్న దగ్గరికి వచ్చి మొక్కుకుంటాం. ఇది మా నమ్మకం, మా సంప్రదాయం" అని గ్రామ పెద్ద ఒకరు భావోద్వేగంగా చెప్పారు.మూడు ఏళ్లకు ఒకసారి జరిగే ఈ పండగ ఇప్పుడు బోడేపల్లి గ్రామానికి మాత్రమే పరిమితం కాకుండా, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కూడా ఆధ్యాత్మిక వేడుకగా మారింది. భీమన్న దేవుని మీద భక్తులకున్న నమ్మకం, భక్తి ఈ ఊరేగింపులో మరోసారి స్పష్టంగా కనిపించింది.తరతరాలుగా నిలిచిన ఈ సంప్రదాయం ముందు తరాలకు కూడా అదే భక్తితో కొనసాగాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ కె. హరిత ..**





ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 26 ఆంధ్ర... జూన్ 1వ తేదీన కొమరంభీం ఆసిఫాబాద్ మండలం కొలం కొథారి గ్రామానికి ముఖ్యమంత్రి విచ్చేస్తున్నందున, అందుకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కెరమెరి మండలం కోలం కొథారి గ్రామాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. దాస్, ఆసిఫాబాద్ ఆర్డీఓ (=ఇూ) లోకేశ్వర్ రావు, రాష్ట్ర ఇంజనీరింగ్ ముఖ్య అధికారులు మరియు ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం హెలిప్యాడ్ పనులను త్వరితగతిన, సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, మురికి కాలువల పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పాత నిర్మాణాలను, మురికి కాలువల వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ప్రారంభించబోయే సీసీ రహదారి ఇరువైపులా ముగ్గులు వేయాలని, ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు సర్వసిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గృహాలను చక్కగా అలంకరించాలని, ఇందిరమ్మ ఇళ్ల ముందు పరిసరాలు చాలా శుభ్రంగా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి మాట్లాడే అవకాశం ఉన్నందున, అందుకోసం ప్రత్యేక వేదికను సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా, సభకు విచ్చేసే ప్రజలకు మరియు లబ్ధిదారులకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట్ల షామియానాలు, కుర్చీలు సిద్ధం చేసి ఉంచాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సభ ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా, ప్రతీ ఒక్క అధికారి తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించి, ఏర్పాట్లను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (ఇూ) భిక్షపతి, పీడీ ప్రకాష్ రాజు, ఇంజనీరింగ్ శాఖల ఉన్నతాధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ ధరల పెంపుకు నిరసనగా అల్వాల్ కాంగ్రెస్ కార్యకర్తల నిరసన



అల్వాల్, మే 26,(విజన్ ఆంధ్ర): మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు సోమవారం అల్వాల్ కాంగ్రెస్ కార్యకర్తలు పెంచిన డిజిల్ పెట్రోల్ ధరలకు నిరసనగా మల్కాజ్గిరి ఆనంద్ బాగ్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. పదే పదే పెట్రోల్, ఢీజిల్ ధరలను పెంచుతూ పేద మధ్య తరగతి ప్రజలపై పెనుభారం మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నిత్యం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.

# నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలి

**- భూ సేకరణ పనులను రానున్న వారం రోజుల్లో పూర్తి చేయలి**

**- మంత్రి జూపల్లి కృష్ణారావు**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): మే 26 నియోజకవర్గ పరిధిలోని పాలమూరు రంగారెడ్డి వటేం 8వ ప్యాకేజ్ హౌస్ గెస్ట్ హౌస్ లో నాగర్కర్నూల్, వనపర్తి జిల్లాల్లో కొనసాగుతున్న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల కేఎల్ఐ, డిండి, ఉమామహేశ్వరం బాలెన్సింగ్ రిజర్వాయర్, అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్, మార్కండేయ రిజర్వాయర్, కర్ణేతాండ్రా బాలెన్సింగ్ రిజర్వాయర్ లతో పాటు వివిధ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు, భూ సేకరణ పనుల పురోగతిపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ప్రాజెక్టుల వారీగా జరుగుతున్న పనులు , భూ సేకరణ పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. ముఖ్యంగా కాలువల నిర్మాణం, రిజర్వాయర్ల అనుబంధ పనులు, పంప్హౌస్ల ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్ల కల్పన వంటి అంశాలపై చర్చించారు. ఇంకా భూ సేకరణలో పెండింగ్లో ఉన్న కేసులు, రైతులకు చెల్లించాల్సిన పరిహారం వంటి అంశాలను కూడా మంత్రి సమీక్షించారు. ప్రాజెక్టుల పనులు ఆలస్యం కాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. రైతులకు సాగునీరు అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి పనిని గడువులోపు పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా భూ సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. పరిహారం చెల్లింపుల్లో జాప్యం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు జిల్లాల వారీగా ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని వివరించారు. కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ పూర్తికాకపోవడం వల్ల నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు తెలియజేయగా, వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మంత్రి కలెక్టర్ లకు సూచించారు. నాగర్కర్నూల్, వనపర్తి జిల్లాలు ప్రధానంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడిన ప్రాంతాలు కావడంతో సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే వేల ఎకరాలకు నీరు అందే అవకాశం ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. దీని ద్వారా రైతుల ఆదాయం పెరగడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి కూడా గణనీయంగా పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సాగునీటి ప్రాజెక్టు రైతుల భవిష్యత్తుకు బలమైన ఆధారమని మంత్రి తెలిపారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఉమ్మడి జిల్లా లోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల సందర్శనకు రానున్నట్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లే ప్రధాన సమస్యల పరిష్కారానికి కావాల్సిన అనుమతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తమతమ నియోజకవర్గ పరిధిలోని ఉన్న భూ సేకరణ, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల సమస్యలను మంత్రి వివరించారు వనపర్తి నాగర్ కర్నూల్ జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ అమరేందర్,ఇరిగేషన్ శాఖల అధికారులు రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జన గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



సంగారెడ్డిబ్యూరో , మే: 26( విజన్ ఆంధ్ర ) : జిల్లాలో జన గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. జన గణనలో భాగంగా నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను మంగళవారం కంది మండలం ఇంద్రకరన్ గ్రామంలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్యూమరేటర్గా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగిని ఐడీ కార్డును పరిశీలించి, ఇప్పటివరకు హౌస్ లిస్టింగ్ ఎంత శాతం పూర్తయిందని అడిగి తెలుసుకున్నారు. స్వీయ గణన చేసుకున్న వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి స్థాయిలో నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. జన గణన కోసం వెళ్లే ప్రతి ఎన్యూమరేటర్ క్యూ.ఆర్ కోడ్తో జారీ చేసిన ఐడీ కార్డును తప్పనిసరిగా ధరించాలని కలెక్టర్ సూచించారు. సెన్సస్ ప్రక్రియ ఎంతో ప్రాధాన్యత కలిగినదని, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు పూర్తి బాధ్యతతో పని చేయాలని ఆదేశించారు.అనంతరం గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, రైస్ మిల్లుకు తరలించిన నిల్వలు, ట్యాబ్ ఎంట్రీలు, ట్రక్ షీట్ జనరేషన్, రైతుల ఖాతాల్లో జమ చేసిన చెల్లింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించి, అక్కడ ఆలస్యం లేకుండా అన్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండా చూడాల ని, మిల్లుల వద్ద ధాన్యం లోడుతో లారీలు నిలిచిపోకుండా పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయి పర్యవేక్షణతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట డి టి సి ఎస్ విజయలక్ష్మి ఉన్నారు.

## మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి

**- నగర మేయర్ కూరగాయల ఉమారాణి**



నిజామాబాద్ మే26:( విజన్ ఆంధ్ర ) : మహిళలు స్వయంగా ఉపాధి రంగాల్లో రాణించాలని నగర మేయర్ ఉమారాణి అన్నారు. నగరంలోని గాజుల్ పేట్ లోని కిసాన్ మున్నూరు కాపు సంఘం ఎపిక్ సంస్థ ఆధ్వర్యంలోని టైలరింగ్ శిక్షణ 15 రోజుల పాటు నిర్వహించారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమానికి నగర మేయర్ ఉమారాణి, కార్పొరేటర్ మల్కాయి మహేంధర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణలో స్కూల్ యూనిఫాంతో పాటు, వివిధ రకాల దుస్తులు నేర్చుకుని కుట్టారు. అతి తక్కువ సమయంలో శిక్షణలో ప్రతిభకనబర్చిన మహిళలందరినీ అభినందించి ఎపిక్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రజిత, ట్రైనర్లు నిరీష్ తో పాటు మహిళలు పాల్గొన్నారు.

## జనగణన సర్వేను పరిశీలించిన మల్కాజిగిరి జోన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్



మల్కాజిగిరి, మే 26, (విజన్ ఆంధ్ర): కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ ఆర్జీకే కాలనీలో జనగణన సర్వే జోరుగా కొనసాగు తోంది. మంగళవారం జనగణన సర్వేను మల్కాజిగిరి జోన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించి ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు పని తీరును పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి, ఎటువంటి లోపాలు లేకుండా నమోదు చేయాలన్నారు. అధికారులు డోర్ లాక్ సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు.సర్వే ప్రక్రియ సమర్థవంతంగా పూర్తయ్యే లా ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వ హించి, సంబంధిత సిబ్బందికి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ అవసరమైన సూచనలు చేశారు. జనగణన సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు తమ వంతు సహకారం అందించి పూర్తి సమాచారం ఇవ్వాలని జోనల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో డీసీ వసంత, ఏఎంసీ శ్రావణ్, గంగాన, ఎస్డబ్ల్యూఎం డిప్యూటీ ఈఈ సంతోష్, ఏఈ అనిల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్టీ సర్వీసుల మంజూరుకు 'సింగిల్ విండో' వ్యవస్థ

**- వినియోగదారులకు వేగంగా, పారదర్శకంగా సేవలు**

**- దరఖాస్తుల పర్యవేక్షణకు ప్రత్యేక 'హెచ్టీ మానిటరింగ్ సెల్' ఏర్పాటు.**

**- స్పష్టం చేసిన సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్..**

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 26 విజన్ ఆంధ్ర : వినియోగదారులకు హెచ్టీ (హై టెన్షన్) 11 కేవీ, 33 కేవీ మరియు ఆపై వోల్టేజ్ విద్యుత్ సర్వీసుల మంజూరును మరింత వేగవంతం చేసేందుకు 'సింగిల్ విండో' వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందని ఉత్తమ్ జాడే, సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆసిఫాబాద్ స్పష్టం చేశారు. హెచ్టీ సర్వీసుల ప్రక్రియను మరింత సరళీకృతం చేయడంలో భాగంగా కార్పొరేట్, సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా 'హెచ్టీ మానిటర్ సెల్'ను ఏర్పాటు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానంలో దరఖాస్తుల పర్యవేక్షణ బాధ్యతలను అధికారులకు ఈ క్రింది విధంగా విభజించారు 11 కేవీ వోల్టేజ్ దరఖాస్తులు సర్కిల్ కార్యాలయంలోని ఏడీఈ (కమర్షియల్) అధికారి పర్యవేక్షిస్తారు. 33 కేవీ మరియు ఆపై వోల్టేజ్ దరఖాస్తులు: కార్పొరేట్ కార్యాలయంలోని ఏడీఈ (కమర్షియల్) అధికారి పర్యవేక్షణలో ఉంటాయి.

**ఆన్లైన్ రిజిస్ట్రేషన్ – ట్రాకింగ్ విధానం:** టీజీ ఐపాస్ (TG–iPASS) పరిధిలోకి రాని హెచ్టీ దరఖాస్తుదారులు మొదట TGNPD-CL అధికారిక పోర్టల్లో అవసరమైన పత్రాలతో ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవాలి. దరఖాస్తు పూర్తికాగానే ఒక ప్రత్యేక అప్లికేషన్ నంబర్ (UID) కేటాయించబడుతుంది. ఈ దరఖాస్తులు వెంటనే సంబంధిత సర్కిల్ కార్యాలయాల డాష్బోర్డ్లో ప్రత్యక్షమవుతాయి. ఏడీఈ (కమర్షియల్) అధికారులు ప్రతిరోజూ ఈ డాష్బోర్డ్ను నిరంతరం పర్యవేక్షిస్తారు.

**పరిశీలన – మంజూరు ప్రక్రియ:** దరఖాస్తు నమోదైన వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన (ఫీజిబిలిటీ) మరియు ఎస్టిమేట్ల కొరకు సంబంధిత అధికారులకు పంపబడుతుంది. సర్కిల్ కార్యాలయ ఏడీఈ (కమర్షియల్) క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి మౌలిక సదుపాయాల లొకేషన్ను స్వయంగా సందర్శిస్తారు. 33 కేవీ మరియు ఆపై వోల్టేజ్ పరిధిలోని ఎస్టిమేట్లకు కార్పొరేట్ కార్యాలయ ఉన్నతాధికారులు అనుమతులు మంజూరు చేస్తారు. అలాగే, ఈ 33 కేవీ దరఖాస్తుల ఫీజిబిలిటీ అనుమతుల కోసం హైదరాబాద్లోని CE/కమర్షియల్ & RAC/TGTRANSCO కార్యాలయానికి ఆన్లైన్ ద్వారా పంపించడం జరుగుతుంది.

**సమయపాలన – పారదర్శకత :** 11 కేవీ వోల్టేజ్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఫీజిబిలిటీ ఉన్న పక్షంలో రెండు రోజుల్లోనే పోర్టల్లో అప్లోడ్ చేస్తారు. ఒకవేళ సాంకేతిక లేదా ఇతర కారణాల వల్ల సాధ్యపడకపోతే, ఆ వివరాలను దరఖాస్తుదారునికి ఎస్ఎంఎస్ (SMS) ద్వారా తెలియజేస్తారు. 33 కేవీ మరియు ఆపై వోల్టేజ్ దరఖాస్తులను కూడా నిర్దేశిత సమయపాలన ప్రకారం పరిశీలించి, అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుతో సర్వీసులు మంజూరు చేస్తారు. ఈ సింగిల్ విండో విధానం వల్ల వినియోగదారులు ప్రతి చిన్న పనికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇంటి నుండే తమ దరఖాస్తు స్థితిని (Application Status) ట్రాక్ చేసుకోవచ్చని ఎస్ఈ తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా విద్యుత్ శాఖలో పారదర్శకత మరింత పెరుగుతుందని, దరఖాస్తుల తాజా సమాచారం ఎప్పటికప్పుడు వినియోగదారుల మొబైల్కు ఎస్ఎంఎస్ రూపంలో అందుతుందని ఆయన వివరించారు.

# మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**- టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల రెడ్డి**



సంగారెడ్డి బ్యూరో, మే, 26(విజన్ ఆంధ్ర ) : మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల రెడ్డి అన్నారు. సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు ఇప్పటివరకు రెండు కోట్ల రూపాయల రుణాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీ లేని రుణాలను పూర్తిగా మహిళా సంఘాల సభ్యులకు అందించినట్లు తెలిపారు. పట్టణంలో 212 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో అనరులకు కేటాయించిందని విమర్శించారు. అధికారులు కూడా అందుబాటులో ఉండేవారు కాదని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని అధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజల మధ్య ఉంటున్నారని తెలిపారు. ఇందిరా శక్తి కింద 119 మందికి రుణాలను మంజూరు చేసినట్లు వివరించారు. చీరలు రెండు రంగుల్లో ప్రభుత్వం పట్టణంలో 29 వేల మంది మహిళా సంఘాల సభ్యులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూన వనిత, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, టిఎంసి విజయభారతి, కౌన్సిలర్లు , మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# వేములవాడ రైతాంగానికి వరంగా రైతు విజ్ఞాన కేంద్రం

**- వ్యవసాయ రంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**





వేములవాడ రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 26 (విజన్ ఆంధ్ర): రైతుల అభ్యున్నతి, వ్యవసాయ రంగ బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని సినారె కళామందిరంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వేములవాడలోని రాజశ్రీ గార్డెన్స్‌లో నిర్వహించిన సిరిసిల్ల, వేములవాడ డివిజన్ అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ (ఆత్మ) కమిటీ చైర్మన్, డైరెక్టర్ల బాధ్యతల స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నాణ్యమైన విత్తనాలు, భూసార పరీక్షలు, సాంకేతిక సలహాలు ఒకే చోట అందించేందుకు రైతు విజ్ఞాన కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. శాస్త్రవేత్తలు రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ వారి సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. వేములవాడ ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ కేంద్రాన్ని మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేవంత్ రెడ్డికి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రైతు విజ్ఞాన కేంద్రం కోసం 40 ఎకరాల భూమిని కేటాయించినట్లు వెల్లడించారు. జిల్లాకు మంజూరైన ఏకైక కేంద్రం వేములవాడకు రావడం ప్రత్యేక విషయమన్నారు. గత రెండేళ్లలో వేములవాడ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. నేతన్నల కోసం యార్న్ డిపో ఏర్పాటు చేయడంతో పాటు మహిళా సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు 13 ప్రాంతాల్లో 33/11 సబ్‌స్టేషన్ల మంజూరు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేసిన ఆది శ్రీనివాస్, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రైతులు వరి కొయ్యాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తిప్పాపూర్‌లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి సిద్దోగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఇటీవల కేదార్నాథ్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందిన వేములవాడకు చెందిన ఆకుల నరేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# గ్రామీణ ప్రాంతంలో మొదలైన కార్పొరేట్ స్థాయి విద్య

**సాయి ఎక్సలెంట్ పాఠశాల డిజిటలైజేషన్ . పాఠశాల ఇన్చార్జ్ స్వర్ణలత.**



జూలూరుపాడు మే 27 (విజన్ ఆంధ్ర) జూలూరుపాడు మండలం కేంద్రంలో సాయి ఎక్సెలెంట్ పాఠశాల నందు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సైతం రాణించేందుకు తీర్చి దిద్దే విధంగా డిజిటల్ తరగతులు ప్రారంభించినట్లు , పాఠశాల ఇంచార్జ్ స్వర్ణలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద మధ్య తరగతి విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం డిజిటలైజేషన్ చేయడం జరిగిందన్నారు. పల్లె, పల్లెకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే దృఢ సంకల్పంతో 2026 -2027 విద్యా సంవత్సరానికి ముందుకు అడుగులు వేసేదాని లో భాగంగా డిజిటల్ క్లాసులను కార్పొరేట్ లీడ్ అనే సంస్థ తో ఒప్పందం చేసుకొని నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. బట్టీ కి స్వస్తీ పలుకుతూ తనంతటా తాను పాఠాన్ని అవగాహన చేసుకుంటూ పాఠాన్ని పూర్తిగా అవగాహన కలిగి ఉంటారని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యార్థులు విని నేర్చుకోవడం కంటే చూసి నేర్చుకోవడం ద్వారా ఎక్కువ జ్ఞాపక శక్తి పెరుగుతుంది అని తద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, నభీన, దుర్గ భవాని, సత్యవతి, రమేష్, ఉదయభాను, కళ్యాణి, ప్రశాంతి, అరుణ, సౌజన్య, హైమావతి, శాంతమ్మ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# జాగ్రత్తలతోనే కీళ్లు, మోకాళ్లు, నడుం నొప్పులకు దూరం...

**- హెల్త్‌టాక్‌లో కరీంనగర్ మెడికవర్ వైద్యుల సూచన**



కరీంనగర్ (విజన్ ఆంధ్ర) మే 26..శారీరక శ్రమ, సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పు వంటి జాగ్రత్తలతోనే కీళ్లు, మోకాళ్లు, నడుం నొప్పులను దరిచేరకుండా చేయవచ్చని మెడికవర్ వైద్యులు సూచించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం కట్టరాంపూర్‌లోని గిద్దెపెరుమాండ్ల టెంపుల్ మైదానంలో హెల్త్‌టాక్, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాకేష్, న్యూరోసర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ... వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు, ఎక్కువసేపు కూర్చొని పనిచేసేవారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శరీర బరువు నియంత్రణ, కాల్షియం అధికంగా ఉండే ఆహారం, నిత్యవ్యాయామం ఎముకల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో తలకు, వెన్నెముకకు తగిలే గాయాలు అత్యంత ప్రమాదకరమని, గాయం అయిన తర్వాత వాంతులు, మూర్ఛ, అధిక తలనొప్పి, మాట్లాడడంలో ఇబ్బంది, చేతులు లేదా కాళ్లు సరిగా పనిచేయకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అనేక మంది ప్రజలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం లేదా ఆర్థిక ఇబ్బందుల కారణంగా పరీక్షలు చేయించుకోలేకపోవడం జరుగుతుందని, అలాంటి వారికి ఈ తరహా ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని వైద్యులు పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 150 మందికి పైగా రోగులకు వైద్యులు సేవలు అందించారు. రోగులకు షుగర్, బీపీ, ఈసీజీ వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. అదే విధంగా కమాన్‌రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా... బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్రాంచ్ మేనేజర్ జయప్రకాశ్, ఆపరేషన్ మేనేజర్ ఎం.రవి, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, అబ్దుల్ వకీల్, శ్రీకాంత్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**తహసీల్దార్లు ధాన్యం కొనుగోళ్లు ప్రక్రియ వేగంగా జరిగేలా చూడాలి**

**- కలెక్టర్ రాహుల్ శర్మ**



భూపాలపల్లి జిల్లా 26 మే (విజన్ ఆంధ్ర) : ఆర్డీఓలు, తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు, ఏ.పి.ఎం లు, పిఏసిఎస్ సి.ఈ.ఓ లతో ధాన్యం కొనుగోళ్ల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జాప్యం లేకుండా జరిగేందుకు తహసీల్దార్లు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మిగతా జిల్లాలతో పోలిస్తే మనజిల్లాలో పంటల కోతలు లేటుగా జరుగుతాయని కాబట్టి ఈ నెల చివరి వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యేలా చూడాలని స్పష్టంచేశారు. లారీల కొరత ఉన్న చోట ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు.స్వచ్ఛందంగా ట్రాక్టర్ల ద్వారా రైతులు ధాన్యం మిల్లులకు తరలిస్తే ట్రాక్టర్ ఛార్జీలు చెల్లిస్తామని తెలిపారు. గోదాముల కొరత లేకుండా ఉండేందుకు పత్తి మిల్లులను సైతం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఏ.పి.ఎం లు, పిఏసిఎస్ సిఈఓ లు ట్యాబ్ ఎంట్రి త్వరిత గతిన పూర్తి చేసి గోదాములకు ,మిల్లులకు తరలించాలని సూచించారు. తహసిల్దార్లు ప్రతి మిల్లు దగ్గర రెవెన్యూ సిబ్బందిని నియమించి పటిష్ఠ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని కాంటా వేసి గన్ని సంచులలో నింపి టార్పాలిన్లను కప్పి ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి కొనుగోళ్లు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా చూడాలని గన్ని సంచుల కొరత, టార్పాలిన్ ల కొరత ఉంటే వెంటనే పై అధికారులకు సమాచారం అందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, డిఆర్డీఓ బాల కృష్ణ, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతం



కామారెడ్డి బ్యూరో మే 26 (విజన్ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ఇప్పటికే 75 రోజులు పూర్తయ్యాయని, కార్యక్రమం సజావుగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ , జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంత్ రావ్ శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. అనంతరం "జయ జయ హే తెలంగాణ" గీతంతో కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, రైతుల శ్రేయస్సు లక్ష్యంగా ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదన్నారు. గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం వేదికగా నిలుస్తుందని తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేసి ప్రణాళిక ప్రకారంగా ముందుకు తీసుకువెళుతున్నారని . అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం లేకుండా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి సమావేశం నకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసి, అధికారులను అప్రమత్తం చేసి ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించి విజయవంతం గా కొనసాగడానికి కృషి చేసిన కలెక్టర్ ను అభినందించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాబోయే జూన్ 2న జిల్లా లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు గృహ ప్రవేశాలు చేయడం జరుగుతుందని, , అలాగే జిల్లాలో ఆయిల్ ఫామ్ పంటలు వేసి రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు వారిని ప్రోత్సహిస్తూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారని , అంతర్ పంటలు వేసి లాభాలు పొందుతున్నారని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రాథమిక పాఠశాలల నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.వ్యవసాయంలో పంట మార్పిడి విధానం, వాణిజ్య పంటలు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు అందుబాటులో ఉన్నాయన్నారు.అంతకు ముందు జిల్లా అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ ప్రతీ సంక్షేమ పథకం ప్రజలవద్దకు చేరాలని , అభివృద్ధి లో జిల్లాను ముందు వరసలో ఉండేలా అధికారులు సమన్వయం తో ముందుకు సాగాలని అన్నారు.కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మెన్, అడిషనల్ కలెక్టర్ గిరి, మున్సిపల్ ఛైర్పర్సన్ ఉమారాణి, ఎమ్మార్వో హిమబిందు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్ లు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పారాచూట్ నుంచి అడ్వాన్స్‌డ్ ప్రోటీన్ షాంపూ విడుదల



హైదరాబాద్, మే 26 (విజన్ ఆంధ్ర) : దేశంలోని ప్రముఖ ఎఫ్ఎంజీసీ కంపెనీలలో ఒకటైన మారికో లిమిటెడ్, పారాచూట్ అడ్వాన్స్‌డ్ ప్రోటీన్ షాంపూ విడుదలతో హెయిర్ క్లెన్సింగ్ విభాగంలోకి ప్రవేశించిందని మారికో లిమిటెడ్ కోర్ బిజినెస్ ఇండియా సీఈఓ ఆశిష్ గోపాల్ మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేరీకో లిమిటెడ్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ విక్రమ్ కర్వాల్ ఆయన మాట్లాడుతూ ఈ కొత్త ప్రోటీన్ షాంపూ శ్రేణి కొబ్బరి, సహజ పదార్థాల గుణాలను కలిగి ఉందన్నారు. ఇది కేశ సంరక్షణ విభాగంలో ఈ బ్రాండ్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. గత కొన్నేళ్ళుగా మారికో తన కేటగిరీని గణనీయంగా విస్తరించడంలో భాగంగా, హెయిర్-క్లెన్సింగ్ ఫార్మాట్‌లో పారాచూట్ అడ్వాన్స్‌డ్ కోకోనట్‌ను విడుదల చేసిందన్నారు. పారాచూట్ అడ్వాన్స్‌డ్ షాంపూ, సహజ ఉత్పత్తుల కోసం పెరుగుతున్న వినియోగదారుల డిమాండ్‌ను తీరుస్తుందన్నారు. ఇది, ప్రయోజనకరమైన, కొబ్బరి ఆధారిత ఆవిష్కరణలను పరిచయం చేయాలనే మారికో నిబద్ధతను ప్రదర్శిస్తుందని తెలిపారు.

# ప్రవేట్ ఆసుపత్రులలో ఓటి అసిస్టెంట్లతో ఆపరేషన్ లు

**- యాజమాన్యాలతో కుమ్మక్కై స్కానింగ్ సెంటర్ల దోపిడీ**

**- పిఆర్వోలతో కలిసి లక్షల్లో ఫీజులు వసూలు**

**- తెలంగాణ రాష్ట్ర ప్రజా ఆరోగ్య పరిరక్షణ సమితి అధ్యక్షుడు బొట్ల మహర్షి**




హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 26 ( విజన్ ఆంధ్ర ) : నగరంలోని కొన్ని ప్రముఖ ప్రవేట్ హాస్పిటల్లో ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లతో ఆపరేషన్లు చేపిస్తూ యాజమాన్యాలు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నయి అని తెలంగాణ రాష్ట్ర ప్రజా ఆరోగ్యం పరిరక్షణ సమితి అధ్యక్షుడు బోట్ల మహర్షి ఆరోపించారు. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహర్షి మాట్లాడుతూ హనుమకొండ జిల్లా పరిధిలో కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ ఆపరేషన్ థియేటర్లలో డాక్టర్లు కాకుండా థియేటర్ అసిస్టెంట్లతో ఆపరేషన్లు చేపిస్తూ వందలాదిమంది చావులకు కారణమవుతున్నారని ఆరోపించారు. స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలు ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలతో కుమ్మక్కై పేద మధ్యతరగతి రోగులను అనవసర స్కానింగ్ ల పేరుట వేలాది రూపాయలు ఖర్చు చేపిస్తూ పేద వర్గాలను మరింత కుదేలుగా మారుస్తున్నారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఉండే అమాయక గిరిజనులను టార్గెట్గా చేసుకొని పిఆర్ఓ, ఆర్ఎంపీలతో కలిసి హాస్పిటల్ యాజమాన్యాలు వైద్యం పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. ఇదే విషయాన్ని జిల్లా వైద్య శాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశామని దానిపై విచారణ జరుగుతుందని విచారణ వేగవంతం చేసి సంబంధిత హాస్పిటల్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు.

# పట్టుదలతో ముందుకు సాగితే దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించగలరు

**-టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి**





సంగారెడ్డి బ్యూరో , మే 26(విజన్ ఆంధ్ర ) : దివ్యాంగుల సంక్షేమం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి,తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యలు దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలు, స్కూటీలు, బ్యాటరీ వీల్ చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 30 మందికి స్కూటీలు, 15 మంది లబ్ధిదారులకు బ్యాటరీ వీల్ చైర్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దివ్యాంగులు స్వయం ఆధారితంగా జీవించేందుకు అవసరమైన సహాయ ఉపకరణాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకువస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల దివ్యాంగులు కూడా ప్రభుత్వ సేవలు సులభంగా పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, పట్టుదల, మనోధైర్యం ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని అన్నారు. దివ్యాంగులు సవ్యాంగులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తూ తమ ప్రత్యేకతను చాటు కుంటున్నారని కొనియాడారు. లక్ష్య సాధనకు కృషి, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని చెప్పారు.దివ్యాంగులు తమలో ఉన్న ప్రతిభను వెలికితీసుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాను స్టాఫ్ నర్స్‌గా పనిచేసిన రోజుల్లో లెప్రసీ వార్డులో సేవలు అందించిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ, చేసే పనిలో సేవాభావం, నిబద్ధత ఉంటేనే నిజమైన సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం జిల్లా సంక్షేమ శాఖ ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. వారికి అత్యుత్తమ సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు, షఫీ, నర్సింలు, రాయకోటి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**- ఏఈఓ మాదారపు రామకృష్ణ**



హన్మకొండ జిల్లా ప్రతినిధి మే 26 ( విజన్ ఆంధ్ర ) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబడిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను ప్రతి ఒక్క రైతు చేసుకోవాలని చర్లపల్లి క్లస్టర్ ఏఈఓ రామకృష్ణ తెలిపారు . దీనికోసం రైతు ఆధార్ కార్డు మరియు భూమి పాసుబుక్కు తీసుకొని ఏఈఓ వద్ద లేదా సమీప మీసేవ కేంద్రాలలో కచ్చితంగా చేసుకోవాలని తెలిపారు .ఒకవేళ చేసుకొనిచో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు మరియు యూరియా బస్తాలకు ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు .మరియు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు, పంటలు విక్రయించేందుకు, మరియు బ్యాంకు రుణాలు తీసుకునేందుకు ఇది తప్పనిసరి కానుంది.

## మహబూబాబాద్ జిల్లాలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

**- రూరల్ సిఐ అంజలి**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మే 26(విజన్ ఆంధ్ర): మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రూరల్ సీఐ అంజలి ఆధ్వర్యంలో రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బజానా తండా గ్రామంలో ఈ రోజు తెల్లవారుజామున 05:20 గంటల నుండి ఉదయం 07:30 గంటల వరకు ముమ్మరంగా "కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు సుమారు 120 ఇండ్లు మరియు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సమయంలో సరైన పత్రాలు మరియు నంబర్ ప్లేట్లు లేని 15 వాహనాలను గుర్తించారు. అదేవిధంగా అక్రమంగా నిల్వ ఉంచిన 100 కిలోల నల్ల బెల్లం,20 లీటర్ల గుడుంబా 20 కిలోల పటిక16 బీరు బాటిళ స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లం పానకం అక్కడికక్కడే ధ్వంసం చేశారు. స్వాధీనం చేసిన వస్తువులకు సంబంధించి బాధ్యులపై కేసులు నమోదు చేయనున్నట్లు సీఐ తెలిపారు. తనిఖీల అనంతరం గ్రామస్తులను సమీకరించి దొంగతనాలు, ఇంటి చోరీలు, చైన్ స్నాచింగ్ ఘటనలు, రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ వినియోగం, చెరువుల్లో ఈతకు వెళ్లడం వల్ల కలిగే ప్రమాదాలు, గంజాయి దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు మరియు సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, గంజాయి విక్రయాలు, గుడుంబా తయారీ మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఫోర్స్, క్యూ ఆర్ టీ ఫోర్స్ మరియు ఏఆర్ మహిళా పోలీస్ సిబ్బందితో కలిపి మొత్తం 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు బోడిగె శ్రీను జన్మదిన వేడుకలు



హన్మకొండ జిల్లా ప్రతినిధి మే 26 ( విజన్ ఆంధ్ర ) : గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు సీనియర్ వీడియో జర్నలిస్టు బోడిగె శ్రీను జన్మదిన వేడుకలు మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు.సమాజంలో జరుగుతున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాదు, జర్నలిస్టుల సమస్యల పట్ల కూడా బాధ్యతతో స్పందిస్తూ వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ.. బోడిగె శ్రీను ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు అని పలువురు జర్నలిస్టులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## వడ దెబ్బకు గురైనా చౌక దుకాణ దారుడు జబ్బా రామనాథం మృతి.



జూలూరుపాడు మే 27 విజన్ ఆంధ్ర జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామ పంచాయతీ బట్చలకోయగూడెం గ్రామానికి చెందిన చౌక దుకాణ దారుడు జబ్బా రామనాథం(55 )(సుధాకర్) అనే వ్యక్తి మంగళవారం ఉదయం 5 గంటలకు వరంగల్ ఎం జీ ఎం ప్రభుత్వ ఆస్పతిలోమృతి చెందినట్లు తెలిపారు . కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మే 24 ఆదివారం వడ దెబ్బకు గురైనా రామనాథం కొత్తగూడెం జిల్లా జనరల్ ఆస్పత్రిలో చేర్చి వైద్య సేవలు అందించారు మెరుగైన వైద్య సేవలు వరంగల్ ఎం జీ ఎం ప్రభుత్వ ఎం జీ ఎం ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించి వైద్యం సేవలు అందిస్తున్న క్రమం లో మంగళవారం ఉదయం ఐదు గంటలకు తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వివరించారు . తన భర్త వడదెబ్బ కారణంగా మృతి చెందినట్లు భార్య జూలూరుపాడు పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇచ్చారు స్పందించిన ఎస్సై బాదావత్ రవి మృతదేహాన్ని కొత్తగూడెం జనరల్ ఆసుపత్రి పోస్ట్ మార్టం నిమిత్తం తరలించన ఎస్ఐ బాదావత్ రవి కేస్ ఫైల్ చేసి దర్యాప్తు చేపట్టారు.

## చిన్నారిని ఆశీర్వదించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు .



జూలూరుపాడు మే 27 (విజన్ ఆంధ్ర ) జూలూరుపాడు మండల కేంద్రంలో (ఆర్కే ఫంక్షన్) హాల్ నందు జూలూరుపాడు గ్రామపంచాయతీ కి చెందిన కాశిమళ్ళ రజనీకాంత్- పుష్పలత కుమార్తె అమిత(హాని) ఓణీల అలంకార వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకట్ రెడ్డి , వెంగనాపాలెం మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్ రావు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు వేల్పుల నరసింహారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మోదుగు రామకృష్ణ, పోతురాజు నాగరాజు, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల ప్రధాన కార్యదర్శి మరియు సోషల్ మీడియా మాదుగుల నాగరాజు,రజక నాయకుడు ముదికొండ వెంకటప్పయ్య,సుందరం, యోహాన్,మంద కిషోర్, రాజు,పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

**- డిసిపిఓ బూర్ల మహేష్**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 26 విజన్ ఆంధ్ర. ప్రజా పాలన ప్రత్యేక ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన నేడు "బాల్య వివాహ ముక్త్ భారత్" కార్యక్రమాన్ని ఆసిఫాబాద్ మండలం కౌటగూడ గ్రామపంచాయతీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి బాల సంరక్షణ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి బాలల రక్షణ, సంరక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డిసిపిఓ) బూర్ల మహేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక సమస్య అని పేర్కొన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు జరపాలని చట్టం స్పష్టంగా పేర్కొంటోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాలు, వేధింపుల నేపథ్యంలో ప్రతి తల్లిదండ్రి అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరుల వద్ద ఒంటరిగా వదిలివేయరాదని హెచ్చరించారు. చిన్నారుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు పుస్తకాలు, కథలు చదివే అలవాటు చేయాలని, మొబైల్ ఫోన్ల వినియోగాన్ని పరిమితం చేయాలని సూచించారు. అనంతరం గ్రామస్థాయి బాల సంరక్షణ కమిటీని ఏర్పాటు చేసి కమిటీ సభ్యులకు బాధ్యతలు, విధులను వివరించారు. గ్రామంలో పిల్లలకు రక్షణ, సంరక్షణ, విద్య, ఆరోగ్యం తదితర అంశాల్లో సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, పిల్లలపై హింస వంటి సమస్యల నివారణలో గ్రామస్థాయి కమిటీలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లైలా, పంచాయతీ కార్యదర్శి శ్వేత, కౌన్సిలర్ చంద్రశేఖర్, గ్రామంలోని యుక్తవయసు బాలికలు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పీవీ విజ్ఞాన కేంద్రం పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

**- జూన్ 28 నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి**
**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
**- వంగరలో పీవీ విజ్ఞాన కేంద్రం, పీవీ స్వగృహంలోని ఫోటో మ్యూజియాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్**




హన్మకొండ జిల్లా ప్రతినిధి :మే 26 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.మంగళవారం మాజీ ప్రధానమంత్రి దివంగత పాములపర్తి వెంకట నరసింహారావు స్వగ్రామమైన వంగరలో నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పీవీ స్ఫూర్తి వనంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, సమావేశ మందిరాన్ని సందర్శించిన కలెక్టర్, అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని పర్యాటక శాఖ, కుడా అధికారులకు సూచించారు. తాగునీటి పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 28 నాటికి అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు.అనంతరం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగృహంలో ఏర్పాటు చేస్తున్న ఫోటో మ్యూజియాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పీవీ నరసింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా పనిచేసిన కాలంలో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో దిగిన అరుదైన ఫోటోలను కుటుంబ సభ్యులతో కలిసి పరిశీలించారు. వివిధ సందర్భాల్లో దిగిన ఫోటోల ప్రాముఖ్యతను పీవీ కుటుంబ సభ్యులు పీవీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, పీవీ మదన్ మోహన్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు.అదేవిధంగా వివిధ దేశాల నుంచి పీవీ నరసింహారావుకు లభించిన పురస్కారాలు, ఆయన రచించిన పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. ముందుగా పీవీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ రాజేష్, పర్యాటక శాఖ డీఈ ధనరాజ్, ఏఈ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి సమయంలో కూడా మొక్కజొన్న అన్‌లోడింగ్ కొనసాగేలా చర్యలు చేపట్టాలి..

**- ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి**
**- జిల్లా కలెక్టర్ అంకిత్**

కొత్తగూడెం బ్యూరో మే 27(విజన్ ఆంధ్ర) : లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారు చిలక మొక్కజొన్న నిల్వ గోడౌన్‌తో పాటు ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. బంగారు చిలక మొక్కజొన్న గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్, గోడౌన్‌కు చేరుతున్న మొక్కజొన్న లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోడౌన్‌లో 2,500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని అధికారులు వివరించారు. సుజాతనగర్, కొత్తగూడెం, టేకులపల్లి, ఇల్లందు, చర్ల, సమ్మెట, బూర్గంపాడు, ఆళ్లపల్లి, గుండాల తదితర మండలాల నుంచి మొక్కజొన్న ఇక్కడికి వస్తోందని తెలిపారు. అన్‌లోడింగ్ ప్రక్రియ ఆలస్యం కాకుండా రాత్రివేళల్లో కూడా పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం తగిన లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అదనపు హమాలీలను నియమించాలని సూచించారు.



గోడౌన్‌లో నిల్వల అన్‌లోడింగ్ తీరును, బస్తాలను భద్రపరుస్తున్న విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, పూర్తి నిల్వ సామర్థ్యాన్ని వినియోగించుకునేలా పంటను నిల్వ చేయాలని, ఎలాంటి నష్టం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హమాలీలతో మాట్లాడిన కలెక్టర్, ఒక్క లారీ అన్‌లోడింగ్‌కు ఎంత సమయం పడుతోందో, ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. హమాలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గత సంవత్సరం మే నెలలో ప్రారంభమైన పనులు ఇప్పటివరకు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, పనుల ఆలస్యానికి గల కారణాలను వివరంగా నివేదించాలని ఆదేశించారు. పనుల అమలులో జాప్యం చోటుచేసుకున్న కాంట్రాక్టర్లకు మెమోలు జారీ చేయాలని సూచించారు. రూ.5 కోట్ల వ్యయంతో మహిళా సాధికారతకు వేదికగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. భవనంలోని ప్రతి బ్లాక్‌ను అన్ని సౌకర్యాలతో సిద్ధం చేయాలని, స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ కార్యకలాపాలకు ఉపయోగపడే విధంగా భవనాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పరిశీలనలో తాసిల్దార్ శిరీష, పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రామాంజనేయ కాలనీలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం

కొత్తగూడెం బ్యూరో మే 27(విజన్ ఆంధ్ర) : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు బాల్యవివాహాల నిర్మూలన మరియు బాలల హక్కుల పరిరక్షణ లక్ష్యంగా మంగళవారం రామాంజనేయ కాలనీలో షీ టీం, ఎ హెచ్ టి యు , భరోసా సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక మహిళలు, యువతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాల్యవివాహం చట్టరీత్యా నేరమని, బాల్యవివాహ నిరోధక చట్టం ప్రకారం బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండకముందు వివాహం జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బాల్యవివాహాల కారణంగా బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటుందని వివరించారు. చిన్న వయసులో వివాహాలు జరగడం వల్ల మానసిక, శారీరక సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఎక్కువగా




ఉంటాయని, గర్భధారణ సమయంలో తల్లి మరియు శిశువుకు ప్రాణాపాయం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే బాలికలు విద్యను కొనసాగిస్తే కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని, ఉన్నత విద్య ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని వివరించారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాలు, కాలనీలు, పాఠశాలలు, కళాశాలల్లో బాల్యవివాహాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరిన అధికారులు, ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. బాలల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా షీ టీం హెల్ప్‌లైన్ నంబర్ 8712682131, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 వివరాలను ప్రజలకు తెలియజేసి, అవసరమైనప్పుడు వెంటనే సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది, భరోసా ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన సీఎం సభ స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ నితిక పంత్.



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 26 విజన్ ఆంధ్ర ..జూన్ 01న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కాగజ్నగర్ ఎక్స్ రోడ్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలాలు, హెలిపాడ్, సభ స్థలం ప్రాంతాలను జిల్లా ఎస్పీ నితికా పంత్ పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డిఎస్పి అశోక్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సుతారి మేస్త్రీలకు కవిత క్షమాపణ చెప్పాలి

**- తెలంగాణ సుతారి సంఘం అధ్యక్షులు ధరిపల్లి చంద్రం**



సిద్దిపేట, విజన్ ఆంధ్ర, మే 26:సుతారి మేస్త్రీలను అవమానించే విధంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ సుతారి సంఘం అధ్యక్షులు ధరిపల్లి చంద్రం అన్నారు. సోమవారం సిద్దిపేట గాంధీ చౌక్ వద్ద భవన నిర్మాణ రంగ కార్మికులు కవిత దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.అనంతరం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెంట్రింగ్ కార్మికులకు మద్దతు పలకడం తప్పు కాదని, అయితే "సుతారి హటావో.. సెంట్రింగ్ కో బచావో" అంటూ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. గుండు దారం లేకుండా భవన నిర్మాణం సాధ్యమా అని ప్రశ్నించారు.సుతారి మేస్త్రీలు నిర్మాణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా కవిత తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని సుతారి మేస్త్రీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.లేదంటే రాష్ట్రవ్యాప్తంగా 14 రకాల భవన నిర్మాణ కార్మిక సంఘాలు ఏకమై ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## మలితరం ఇవిటోల్ విమానం జెన్-2 ఆవిష్కరణ




హైదరాబాద్, మే 26 (విజన్ ఆంధ్ర) : బ్లజ్ ఏరోస్పేస్ నాలుగేళ్ల రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ తర్వాత తన మలి తరం ఇవిటోల్ విమానం జెన్-2ను ఆవిష్కరించినట్లు బ్లజ్ ఏరోస్పేస్ కంపెనీ ఫౌండర్, సీఈఓ అమర్ శ్రీ వత్సవాయ మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎండియా పార్ట్నర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ ఆంద్ర, ఐడియాస్ప్రింగ్ క్యాపిటల్ మేనేజింగ్ పార్ట్నర్ నాగనంద్ దొరస్వామి లతోకలసి ఆయన మాట్లాడుతూ ఇది కంపెనీ రూపొందించిన ప్లాట్ఫారమ్ ఆర్కిటెక్చర్ వంటిస్ ఆధారంగా వచ్చిన తొలి కమర్షియల్ గ్రేడ్ విమానం అన్నారు. జెన్-2 విమానం 200 కిలోలకుపైగా పేలోడ్ మోసే సామర్థ్యంతో, 500 కిలోల లోపు టేకాఫ్ వెయిట్ కలిగి ఉందని తెలిపారు. పూర్తిగా ఎలక్ట్రిక్ శక్తితో పనిచేసే ఈ విమానం ప్రస్తుతం ఫ్లైట్ టెస్టింగ్ దశలో ఉందని, దీన్ని హెవీ పేలోడ్ లాజిస్టిక్స్ కోసం రూపొందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో హైడ్రో జన్- ఎలక్ట్రిక్ టెక్నాలజీతో దీర్ఘదూర ప్రయాణికుల విమా నాలను 2027-28 నాటికి తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి

**-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట మే 26:(విజన్ ఆంధ్ర) : జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మరియు రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళ వారం చివ్వెంల మండలం బిబి గూడెం లోని శివ దుర్గ రైస్ మిల్, తిరుమలగిరి మండలాల్లోని ఇటూరు గ్రామంలో సోమేశ్వర రైస్ మిల్ ఇండస్ట్రీ, వ్యవసాయ మార్కెట్, పారా రైస్ మిల్, తాటిపాముల పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. మిల్లులకు వచ్చిన ధా న్యాన్ని వెంటనే ఆన్ లోడింగ్ చేయాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు. కొను గోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తర లించేలా రవాణా సౌక ర్యాలను పర్యవేక్షించాలని అధికారు లను ఆదేశిం చారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ మోహన్ బాబు, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, చివ్వెంల తహసిల్దార్ చంద్రశేఖర్, తిరుమలగిరి తహ సిల్దార్ హరిప్రసాద్, రైస్ మిల్లర్లు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# "బాల్యవివాహం బతుకు అగం"
# మేజర్ వివాహము బతుకు బంగారం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి మే 26 : సిద్దిపేట జిల్లా కేంద్రంలో 99 ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 26 మండలలో తహసీల్దార్ల అధ్యక్షతన బాల్య వివాహాల నిరోధక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినవి. ఈ సందర్భంగా సిద్దిపేట రూరల్ మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ "బాల్య వివాహాలను నిర్మూలిద్దాం బాలలబంగారు భవిష్యత్తునుకాపాడుదాం" అని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల బాలబాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటుందని తెలిపారు.సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థులు, తల్లిదండ్రులు, విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు అబ్బాయిలకు వివాహం జరిపించడం చట్ట విరుద్ధమని తెలిపారు. బాల్యవివాహంనిర్వహించిన వారు, ప్రోత్సహించిన వారు, వివాహంలో పాల్గొన్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్ బాలికను వివాహం చేసుకుంటే చట్టం ప్రకారం జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు.చాలామంది తల్లిదండ్రులు పిల్లలు చదువుకునే వయసులోనే వివాహాలు జరిపించివారిభవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాల నిర్మూలన కోసం పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 కుసమాచారంఅందించాలని కోరారు.బాల్య వివాహం నేరం చట్ట ప్రకారం శిక్షార్హం"బాల్య వివాహం చేసినా,చేసుకున్నా,ప్రోత్సహించినా రెండేళ్ల జైలు శిక్ష, లక్షరూపాయలజరిమానా"అనే నినాదాలతో తల్లిదండ్రులు, విద్యార్థుల్లో అవగాహనకల్పించాలనిఅధికారులను కోరారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.

# డొంక మార్గం మాయం..!

## ఏజెన్సీలో ప్రభుత్వ భూమి కబ్జా..?
## ప్రశ్నిస్తే బెదిరింపులేనా..?

*ఒకప్పుడు గ్రామ ప్రజలు నిత్యం నడుచుకుంటూ వెళ్లే డొంక మార్గం ప్రస్తుతం పూర్తిగా కనుమరుగైపోవడం స్థానికుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఏళ్ల తరబడి ప్రజల రాకపోకలకు ఉపయోగపడిన ఆ మార్గం క్రమంగా ఆక్రమణలకు గురై మాయం అయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.*



**కొత్తగూడెం, మే 27 (విజన్ ఆంధ్ర) :** పూర్తి వివరాల్లోకి వెళ్తే.. రామవరం పరిధిలోని 19వ డివిజన్ ఉండందాస్ గడ్డ ప్రాంతంలో గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని డొంక మార్గం వద్ద రోడ్డు మంజూరు చేసినట్లు స్థానికులు తెలిపారు. అయితే కొందరి అడ్డంకుల కారణంగా పనులు ముందుకు సాగలేదని చెబుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం, రోడ్డు నిర్మాణానికి సంబంధించి అధికారులు పరిశీలనకు వచ్చిన సమయంలో "ఇక్కడ రోడ్డు వేయడానికి వీలు లేదు" అంటూ కొందరు వ్యక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని, అధికారులను కూడా వెనక్కి పంపించారని ఆరోపిస్తున్నారు. దీంతో మంజూరైన రోడ్డు పనులు నిలిచిపోయాయని, అనంతరం అదే రోడ్డు ప్రతిపాదనను మరో ప్రాంతానికి మళ్లించి అక్కడ నిర్మాణం చేపట్టినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఆ ప్రాంతంలోని ప్రభుత్వ భూములు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆరోపణలు మరింత తీవ్రతరమయ్యాయి. ముఖ్యంగా గౌరవప్రదమైన సింగరేణి, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులే సుమారు కొన్ని లక్షల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు చట్టాలను అమలు చేయాల్సిన స్థానంలో ఉండి ప్రభుత్వ భూములనే కబ్జా చేయడం బాధాకరమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ అంశంపై ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. "ప్రభుత్వ భూమి ఎలా వ్యక్తిగత ఆస్తిగా మారింది..? డొంక మార్గం ఎలా కనుమరుగైంది..? రోడ్డు మంజూరై కూడా ఎందుకు పనులు జరగలేదు..?" అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, భూమి ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే డొంక మార్గాన్ని పునరుద్ధరించి, అసలు రోడ్డు మంజూరైన ప్రాంతంలోనే అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు. ప్రభుత్వ భూములపై జరుగుతున్న ఆక్రమణల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మేడ్చల్ జిల్లాలో ఏసీబీ దాడులు కలకలం...

- విజన్ ఆంధ్ర ప్రచురితమైన కథనానికి ప్రాధాన్యత...
- ఏసీబీ కి చిక్కిన తహసీల్దార్ సుచరిత
- శామీర్‌పేట కార్యాలయంలో సోదాలు...

- 30 ఎకరాల భూ కన్వర్షన్ వ్యవహారంలో రూ.30 లక్షల డిమాండ్..?
- డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ...
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్



**మేడ్చల్ జిల్లా,మే 26(విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించడం జిల్లాలో సంచలనంగా మారింది. ఓ రైతు నుండి భూమి నాలా కన్వర్షన్ కు 2 లక్షల లంచం తీసుకుంటూ శామీర్ పేట తహసీల్దార్ సుచరిత పట్టుబడటంతో జిల్లా అధికారుల్లో చర్చానీయమైంది.రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది.అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. శామీర్‌పేట మండలం ఆలియాబాద్ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. ఎకరానికి రూ. 1 లక్ష చొప్పున మొత్తం రూ. 30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ డ్రైవర్ ద్వారా రూ. 2 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నామని, ఎమ్మార్వో



సుచరితతో పాటు కీసర ఆర్డీఓ రాజేష్ పలువురు సిబ్బందిని విచారిస్తున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.ఇదిలా ఉండగా 2024లో కూడా శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ఎమ్మార్వో సత్యనారాయణ కూడా రూ. 2 లక్షల లంచం కేసులో డ్రైవర్‌తో కలిసి ఏసీబీకి చిక్కిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తాజాగా మరోసారి అదే కార్యాలయంలో ఏసీబీ దాడులు జరగడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

**విజన్ ఆంధ్ర ప్రచురితమైన కథనానికి ప్రాధాన్యత...**
కాగా మెడ్చల్ జిల్లా కలెక్టర్ కు కీసర ఆర్డీఓ పై మాజీ ఏఐసీసీ సభ్యులు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వికలాంగుల మాజీ చైర్మన్ బక్క జడ్సన్ ఫిర్యాదు మేరకు 2025 నవంబర్ 15న "వందల ఎకరాలు హాంఫట్... వేల కోట్లల్లో ఆదాయం..!" అనే శీర్షికతో విజన్ ఆంధ్ర దినపత్రికలో ప్రచురితమైన కథనం ఇప్పుడు మరోసారి ప్రాధాన్యత సంతరించుకుంది. భూ కన్వర్షన్‌లలో భారీ అవకతవకలు, అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలను ఆ కథనం వెలుగులోకి తీసుకువచ్చింది. తాజాగా ఏసీబీ దాడుల్లో తహసీల్దార్ కార్యాలయం అధికారులు పట్టుబడటం ఆ కథనంలోని ఆరోపణలకు బలం చేకూర్చినట్టుగా కనిపిస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

# అక్రమార్కులకు తాసిల్దార్ కొమ్ముకాస్తున్నారు

- **జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు పాయం**
- **ఏజెన్సీ చట్టాలను నిర్వీర్యం చేస్తే ఊరుకోం**
- **ఆదివాసీ విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాల నిరాకరణపై ఆగ్రహం**



చర్ల, మే 26 (విజన్ ఆంధ్ర): చర్ల మండల తాసిల్దార్ ఏజెన్సీ చట్టాల గురించి తెలిసి తెలియనట్లు నటిస్తూ అక్రమార్కులకు సపోర్ట్ చేస్తున్నారని గోండ్వానా సంక్షేమ పరిషత్ (జి ఎస్ పి) రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ తీవ్రంగా ఆరోపించారు, మంగళవారం నాడు ఆదివాసీ నాయకులతో కలిసి ఆయన తాసిల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు, గతంలో తాము ఇచ్చిన ఫిర్యాదుల అర్జీలపై వివరణ కోరగా, తాసిల్దార్ పొంతన లేని సమాధానాలు చెప్పడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు, తాసిల్దార్ ఏజెన్సీ ప్రాంతాన్ని మరిచిపోయి, మైదాన ప్రాంత అడ్మినిస్ట్రేషన్‌ను అమలు చేస్తూ ఆదివాసీ చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు.

**కుల ధ్రువీకరణ పత్రాల జారీలో వివక్ష**
మండలంలోని ఆదివాసీ విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు (క్యాస్ట్ సర్టిఫికెట్లు) ఇవ్వకుండా రెవెన్యూ సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పాయం సత్యనారాయణ ఆరోపించారు, మైదాన ప్రాంతం నుండి వచ్చిన లంబాడా గూగులోత్ మంగ (లింగాపురం సర్పంచ్)కు ఏ ప్రాతిపదికన రెవెన్యూ అధికారులు క్యాస్ట్ సర్టిఫికెట్ విడుదల చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**గత తాసిల్దార్ పాలనను గుర్తు చేస్తూ**
గతంలో ఇక్కడ పనిచేసిన తాసిల్దార్ ఈరెల్లి నాగేశ్వరరావు అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టించారని ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు. ఆయన హయాంలో ఇసుక, మట్టి, గ్రావెల్ మరియు ఇతర జీరో దందాలను పూర్తి స్థాయిలో అరికట్టారని, ప్రస్తుత అధికారులు మాత్రం అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ఏజెన్సీ చట్టాలను గౌరవించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. తాసిల్దార్‌ను కలిసిన వారిలో సీనియర్ ఆదివాసీ నాయకులు (తుడుందెబ్బ) వాసు ముసలయ్య, ఇర్పా ప్రకాష్, జీఎస్పీ చర్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూణెం వరప్రసాద్, శ్యామల తరుణ్ తదితరులు ఉన్నారు

## సినిమా, ఆధ్యాత్మిక, వైద్య రంగాలలో
# గొప్ప బహుముఖ స్వరం 'కల్ప్రదా'










హైదరాబాద్ 2026, (ఆకెళ్ళ విశ్వనాథ్) : ఎన్నో స్వరాలు తరచుగా వినిపిస్తాయి కానీ కొన్ని మాత్రమే నిజంగా ప్రతిధ్వనిస్తుంటాయి, ఆలాంటి ప్రతిభా వంతురాలైన స్వరం 'రజిత కల్ప్రదా' తన బాహుముఖ ప్రతిభతో పరిశ్రమలో, చిత్రనిర్మాణం , గేయ రచనలో, ఆధ్యాత్మిక వైద్యురాలుగా తన ప్రత్యేకతను నిరూపించుకుంటూ ప్రజ్ఞను, ప్రతిభను చాటుకుంటూ అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. దశాబ్ద కాలంలో తన సృజనాత్మక అనుభవంతో, ఆమె సినిమా, సంగీతం, ఆధ్యాత్మికతను అనుసంధానించే వృత్తిని నిర్మించుకుని, బహుళ భాషలు, మాధ్యమాలలో గుర్తింపు పొందుతున్నారు. సినీ దిగ్గజాలతో కలసి ముందడుగు వేస్తూ ఆమె ప్రస్థానంలో కథ చెప్పే, దర్శకత్వ ప్రతిభను వెలుగులోకి తెచ్చిన 'నాలయ లక్కునార్' (కళైజ్ఞర్ టీవీ, సీజన్ - 5, 2015) అనే వేదికను గెలుచుకోవడం ద్వారా 'రజిత కల్ప్రదా' తొలిసారిగా ప్రజల దృష్టిని ఆకర్షించారు. అప్పటి నుండి, ఆమె మణిరత్నం, భారతీరాజా, సుజోయ్ ఘోష్, ఏఆర్ రెహమాన్, లింగుస్వామి, కె.ఎస్. రవికుమార్, సుందర్. సి, సురేష్ కృష్ణ వంటి భారతదేశంలోని అత్యంత గౌరవనీయమైన చిత్రనిర్మాతలతో కలిసి పనిచేస్తూ, తమిళ, తెలుగు, హిందీ చిత్ర సీమలలో కథా అభివృద్ధికి, స్క్రిప్ట్ ఎంపికకు తన వంతు సహకారం అందిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆమె వివిధ భాషలలో సాహిత్యం, సృజనాత్మక పరిధిలో సంభాషణలు, సంగీతం వరకు విస్తరించింది. ఆమె 'లాక్డ్' (ఆహా ) అనే తెలుగు వెబ్ సిరీస్‌కు సంభాషణలు రాశారు. ఏ.ఆర్. రెహమాన్ యొక్క '99 సాంగ్స్' చిత్రానికి కూడా తన వంతు సహకారం అందించారు. గీత రచయిత్రిగా, ఆమె 'స్కంద' (ఎస్.ఎస్. థమన్), 'ప్రేమ్ కథ' (రాధన్), 'రాయన్' (ఏ.ఆర్. రెహమాన్), 'కదలిక్క నేరమిల్లై' (ఏ.ఆర్. రెహమాన్) వంటి చిత్రాలకు పాటలు రాశారు. 'రజిత కల్ప్రదా' తెలుగు, తమిళం రెండింటిలోనూ అనర్గళంగా మాట్లాడగల ఏకైక సమకాలీన మహిళా గీత రచయిత్రిగా ఆమె గుర్తింపు పొందారు, ఈ ఘనత ఆమె బహుముఖ ప్రజ్ఞను నొక్కి చెబుతుంది.

**బియాండ్ ది బిగ్ స్క్రీన్**
ఆమె మాటలు హార్లిక్స్, మాజా, మహీంద్రా, మిల్క్ -మెయిడ్, షెర్లాక్ వంటి మరెన్నో సంస్థల ప్రకటనల ప్రచారాలకు రూపమిచ్చాయి. అలాగే, '99 సాంగ్స్' చిత్రానికి పోస్ట్-ప్రొడక్షన్ డైరెక్టర్‌గా ఆమె తమిళ, తెలుగు వెర్షన్లలో పాటల సాహిత్యం, డబ్బింగ్‌లను పర్యవేక్షించారు. గొప్ప పండితురాలు, కళాకారిణి, వైద్యురాలుగా ఎదిగిన రజిత కల్ప్రదా తన విద్యాపరంగా సాధించిన విజయాలలో పూణేలోని ఎఫ్ టి ఐ ఐ నుండి ఫిల్మ్ ఎడిటింగ్‌లో డిప్లొమా, మార్కెటింగ్‌లో ఎంబీఏ చేశారు. ఆమె మార్కెటింగ్‌లో ఉత్తమ ప్రాజెక్ట్ అవార్డును అందుకున్నారు. ఆమె మద్రాస్ విశ్వవిద్యాలయం నుండి అర్థశాస్త్రం అలాగే తెలుగులో స్వర్ణ పతక విజేతగా కూడా నిలిచారు. సినిమా రంగంతో పాటుగా రజిత కల్ప్రదా ఆధ్యాత్మిక వైద్యురాలుగా, జ్యోతిష్యురాలిగా పనిచేస్తూ, తన కళాత్మక వృత్తిని తత్వశాస్త్రం, సంగీతం, ఫోటోగ్రఫీ, నిత్యం ప్రయాణం చెయ్యడంపై ఉన్న గాఢమైన ఆసక్తిని సమతుల్యం చేసుకుంటూ తన జీవితంలో ముందడుగు వేస్తూ పలు రంగాలలో ప్రయాణం చేస్తున్న కల్ప్రదా కు ఎన్నో అవార్డులు,రివార్డులు తెచ్చిపెట్టాయి. లఘు చిత్రాలు, అవి ఆమె యూట్యూబ్ ఛానెల్ 'కల్ప్రదా'లో ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయి. ఇవి, ఆమెకు తొలిసారిగా కీర్తిని తెచ్చిపెట్టిన సినిమాటిక్ దృక్పథాన్ని ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నాయి. రజిత కల్ప్రదా, ప్రయాణం దృఢ సంకల్పానికి, సృజనాత్మకతకు నిదర్శనంగానిలుస్తూ సినిమా నిర్మాణంలో ప్రశంశలు అందుకుంటూ అందరి హృదయాలను గెలుచుకుంటున్నారు. భారతదేశపు గొప్ప సంగీత దర్శకులకు గీతాలను రచిస్తూ, సినిమా, సంగీతం, ఆధ్యాత్మికతను సమతుల్యంగా చేసుకుంటూ, విశేషమైన సామర్థ్యంతో విభిన్న రంగాలలో తనను తాను నిరూపించుకుంటూ రజిత కల్ప్రదా, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలుస్తూ ముందడుగు వేస్తున్నారు. ఆమె తన జీవితంలో మరెన్నో విజయ శిఖరాలను అధిరోహించాలని ఆశిద్దాం, ఆకాంక్షిద్దాం.

## భీంనగర్‌లో యథేచ్ఛగా
# కబ్జాల పర్వం


## మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు



గద్వాల మే 26 (విజన్ ఆంధ్ర) : గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని భీంనగర్‌లో భూ కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. రియల్ ఎస్టేట్ వెంచర్లలో నిబంధనల ప్రకారం వదిలిపెట్టాల్సిన 10 శాతం (పార్కులు, ప్రజా అవసరాల) స్థలాలే లక్ష్యంగా కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఒకచోట ఇప్పటికే అక్రమ నిర్మాణాలు చేపట్టగా, మరోచోట ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు పక్కా ప్లాన్‌తో అడుగులు వేస్తున్నారు.

**అధికారుల అండదండలేనా..**
ఈ అక్రమ కబ్జాల వ్యవహారంపై 9వ వార్డు కౌన్సిలర్ రామలింగేశ్వర కాంప్లే అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఈ దందా వెలుగులోకి వచ్చింది. కౌన్సిలర్ స్వయంగా ఫిర్యాదు చేసినప్పటికీ, చర్యలు తీసుకోవడంలో గద్వాల మున్సిపల్ అధికారులు తీవ్ర వెనుకడుగు వేయడం గమనార్హం. అధికారుల నిర్లక్ష్య వైఖరి, పరోక్ష సహకారం వల్లే కబ్జాదారులు బరితెగిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

**పార్కు స్థలాలపై కన్ను..**
పలు ప్రైవేట్ వెంచర్లలో ప్రజల సౌకర్యార్థం, పార్కుల కోసం కేటాయించిన లేఅవుట్ స్థలాలను కొందరు స్వాహా చేసేందుకు యత్నిస్తున్నారు. విలువైన ఈ ఖాళీ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత మున్సిపల్ యంత్రాంగానిదే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భీంనగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, కబ్జాకు గురవుతున్న పార్కు స్థలాలను స్వాధీనం చేసుకోవాలని, ప్రభుత్వ భూములకు రక్షణగా బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.




# ఏటీఎం మిషన్ ను ఎత్తుకెళ్లిన దొంగలు

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ,మే 26,(విజన్ ఆంధ్ర) : మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఏటీఎం దొంగతనం కలకలం రేపింది. తెలంగాణ చౌరస్తాలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం కేంద్రంలోకి చొరబడిన గుర్తు తెలియని దొంగలు ఏకంగా ఏటీఎం మెషిన్ నే పెకిలించి ఎత్తుకెళ్లారు. ఉదయం పక్కనే ఉన్న వ్యాపార సముదాయాల నిర్వాహకులు అక్కడ మిషన్ లేకపోవడానికి గమనించి పోలీసులకు స్థానికులకు సమాచారం అందించారు. పోలీసులు ఫోర్ నెక్స్ నిపుణులు డాగ్ స్క్వాడ్ సహాయంతో దర్యాప్తు చేపట్టారు. చాపీ లో ఎంత నగదు ఉందో పూర్తి వివరాలు బ్యాంకు అధికారులు డిపాజిట్ విత్డ్రవాల్ ట్రాన్సక్షన్ ఆధారంగా చెప్తామని నిందితులను త్వరలోనే గుర్తిస్తామని జిల్లా ంజూ గారు చెప్పటం జరిగింది .ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు సీఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.